సాహిత్య

# ప్రస్థానం

మార్చి 2010

వెల రూ. 10



సాహితీ స్రవంతి

# మాక్సిం గోర్కీ

(1868 - 1936)



ప్రముఖ రష్యన్ రచయిత, కథలు, నవలలు ఎన్నో రాశాడు. నిరుపేదగా, కూలీగా బతికాడు.
ఇతని రచనలు ముఖ్యంగా 'అమ్మ' విప్లవానికి ఎంతో తోడ్పడ్డాయి.
మార్చి 16 గోర్కీ వర్ధంతి

సాహిత్య ప్రస్థానం

సంపుటి : 8 | మార్చి 2010 | సంచిక : 51

# ఉగాది ఊసులు

**ఈ** నెలలోనే వస్తుంది ఉగాది పండుగ.అది తెలుగు సంవత్సరాది. వలస పాలన వల్ల అంతర్జాతీయంగా ఆంగ్లేయులు ప్రాబల్యం వల్ల అది ప్రాధాన్యత కోల్పోయింది గాని సాహితీ సాంస్కృతిక పరులకు సంబంధించినంత వరకూ ఇప్పటికి ప్రధాన పర్వంగానే వుంది. ఆ రోజున చాలా చోట్ల కవి సమ్మేళనాలు సాహిత్య గోష్టులూ జరుగుతుంటాయి. సాంప్రదాయిక కోణం నుంచి మొదలైన ఈ ప్రక్రియ తర్వాత ఆధునికులూ వదలిపెట్టిన దాఖలాలు లేవు. కాకపోతే వారిలా కోయిల కూతలను వర్ణించి వదలిపెట్టకుండా వర్తమానపు ఆవర్తాన్ని స్పర్శించడం ఇక్కడ జరుగుతుంది. అభద్రత, అధిక ధరల వంటి వాటి గురించి దేశాధినేత కూడా చెప్పక తప్పని ప్రస్తుత సంక్షుభిత వాతావరణంలో అలాటి సమావేశాలూ సమాలోచనలూ మరింత అవసరమవుతున్నాయి. ప్రపంచీకరణ విష సంస్కృతి ఒకవైపు, విచ్చలవిడి వినియోగ తత్వంలో వికృత పోకడలు మరో వైపు, పాలక వర్గ పక్షాల స్వార్థ రాజకీయ క్రీడలు మరో వైపు జడలువిచ్చి నర్తిస్తున్న నేటి పరిస్థితుల్లో సాహిత్య కారులు వాటి నిజస్వరూపాన్ని విప్పి చెప్పవలసిన అగత్యం పెరుగుతున్నది. అసహనాలు ఆత్మహత్యల వంటి వాటిని అరికట్టి నిజమైన చైతన్యం పెంచేందుకు ప్రేరణ కావాలని కాలం ఆహ్వానిస్తున్నది.ఉగాదికి సంబందించి ప్రాచీన నవీన యుగాల్లోని ఉత్తమ సంప్రదాయాలను గుర్తు చేస్తూ ప్రస్తానం అక్షరాభినందనలు అందజేస్తున్నది.

కవర్ పెయింటింగ్ : **గ్రిఫిత్స్**
**(18-19 శతాబ్దాల మధ్య యూరోపియన్ చిత్రకారులు వేసిన భారతీయ పెయింటింగ్స్ ప్రదర్శన హైదరాబాద్‌లోని సాలార్జంగ్ మ్యూజియంలో జరుగుతుంది. ఆ ప్రదర్శనలోని చిత్రం ఇది**

**బొమ్మలు : శేఖర్, శివాజి, లక్ష్మీనారాయణ, వెంకటేష్**

## ఈ సంచికలో...


| | |
|---|---|
| ఒక్కడు చాలు (కథ) | 2 |
| పడిలేచిన కడలి తరంగం | 7 |
| కవిత | 11 |
| వాళ్ళిద్దరూ ఓడిపోయారు (కథ) | 12 |
| కవిత | 16 |
| శ్రీశ్రీకి పిల్లలంటే ప్రాణం – సరోజా శ్రీశ్రీ ఇంటర్వ్యూ | 17 |
| వసంతంతో సంభాషణం! | 19 |
| కవిత | 23 |
| 'మోటు మనిషి' కె.ఎన్.వై. పతంజలి | 24 |
| రారా మార్గంలో సింగమనేని | 26 |
| వెల్లివిరిసిన పుస్తక సంస్కృతి | 29 |
| కవిత | 32 |
| అగాధం (కథ) | 33 |
| కవిత | 37 |
| కొత్త పుస్తకాలు | 38 |
| సామూహిక శ్రమ నుండి భాషలు పుట్టాయి | 41 |
| స్ఫూర్తి ప్రధాత శ్రీశ్రీ | 42 |
| అంపశయ్య నవీన్ పుస్తకాల ఆవిష్కరణ | 43 |
| డైరీ | 44 |


సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** (సంపాదకుడు)
**కె.ఆనందాచారి**
**ఎ.సత్యభాస్కర్**
**వీరప్రసాద్**
**ఎం.నరహరి**

**కె. లక్ష్మయ్య,** మేనేజర్

చిరునామా

సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

## కథ



**శిరంశెట్టి కాంతారావు**

***అపార్టుమెంట్ల గ్రహణం పట్టడంతో సూర్యుడు అదృశ్యమైన పశ్చిమ ఆకాశంలో పొగచూరిన నారింజ రంగు మాత్రం కన్పిస్తుంది.***

***సాయంత్రం వేళ గూళ్ళకు ఎగిరిపోయే పక్షులు ఎక్కడా కన్పించడంలేదు కానీ పగలల్లా ఆఫీస్‌ల్లో పనిచేసి అలసిపోయిన ఉద్యోగులు మాత్రం సైబీరియా వలస పక్షుల మాదిరిగా మెల్లమెల్లగా ఇండ్లకు వెళుతున్నారు.***

పొదుగులు చేపులకొస్తుంటే లేగదూడల కోసం అరుస్తూ ఇండ్లకు పరుగెత్తుకొచ్చి ఆలమందలు కన్పించడం లేదు. కానీ, హారన్ మోతలతో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని ఛేదించుకుని గమ్యం దిశగా దూసుకుపోవాలని చూస్తున్న రకరకాల వాహనాలు రోడ్ల నిండా కిక్కిరిసిపోయాయి.

మాపటి వంటల కోసం అంటించిన కట్టెల పొయ్యల పొగ ఊరిని చుట్టేసే దృశ్యం స్మృతులభోషాణాల్లో నిక్షిప్తం అయిపోగా రోడ్ల మీద వాహనాలు వెలువరిస్తున్న పొగమాత్రం కళ్ళను మండిస్తూ... పరిసరాలను కబళిస్తుంది.

పాఠశాల పంజరంలో నుండి బయటపడి, తన ఇద్దరు పిల్లలతో ట్రాఫిక్‌ను ఈదుకుంటూ ఇల్లుచేరిన ప్రమీల కాళ్ళచెప్పులు విడవడమే ఆలస్యం ఇంటిపనుల్లో మునిగిపోయింది.

-----------

నారాయణ గూడా చౌరస్తా నుండి అత్తాపూర్ రింగ్ రోడ్డు దాకా సిటి బస్సులో పడి ఇంటి కొచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలవుతుంటే, వంట్లోశక్తి అంతా ఆవిరైపోయినట్టు ఉస్సూరుమంటూ కుర్చీలో కూలబడ్డాడు శ్రీనివాసరావు.

భర్తను చూస్తూనే "నేనూ మీలాగే స్కూల్‌కి వెళ్ళొచ్చి ఒక్క చేతి మీదుగా ఇంటిపనులు, బయటిపనులు చెయ్యాలంటే నా నడుములు పగిలిపోతున్నాయి. ఇవాళ్ళ మధ్యాహ్నం నుండి చిన్నోడికి జ్వరమొచ్చింది. హాస్పటల్‌కి తీసుకెళ్దామంటే అక్కడ ఇంతింత పొడవున క్యూలు. అయినా వెళ్దామంటే ఇంటిపని నాకోసం ఎదురుచూస్తుంది. మీరేమో ఉదయం ఎనిమిదింటికి ఇంట్లో నుండి బయటపడితే, రాత్రి తొమ్మిదింటికి కాని ఇంటికి రారు" జ్వరమొచ్చిన పిల్లాడికి మాత్రవేసి పాలు పడుతూ తన సొదనంతా వెళ్ళగక్కింది ప్రమీల.

భార్య ఇబ్బందిని సానుభూతితో అర్ధచేసుకున్నా, ఏమీ చేయలేని నిస్సహాయతతో ప్రాణం ఉసూరుమంటుంటే "నన్నేంచేయమంటావు చెప్పు, నాడ్యూటీ అలాంటిది మరి". అనునయంగా అన్నాడు శ్రీనివాసరావు.

శ్రీనివాసరావు నారాయణ గూడాలో బాగా పేరున్న ఓ కార్పొరేట్ జూనియర్ కాలేజీలో క్యాంపస్ ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నాడు. రోజుకు పది, పన్నెండు గంటలు కాలేజీలోనే గడపాల్సి ఉంటుంది. దాంతో ఇంట్లో ఏదీ పట్టించుకునే అవకాశమే ఉండదతనికి.

శ్రీనివాసరావుకి నలభై మూడేండ్లు. ఎత్తు ఐదు ఏడు, ఎత్తుకు తగ్గలావు, ఎర్రటి ఎరుపు వత్తైన నల్లటి జుట్టు, తెల్లటి పలువరస, తెలివైన కళ్ళతో కొత్త వాళ్లను కూడా ఇట్టే ఆకట్టుకునే కలుపుగోలుతనంతో చలాకీగా ఉంటాడు.

ఇక ప్రమీల విషయానికొస్తే, తను భర్తకన్నా ఐదేండ్లు చిన్నది. అన్నిరకాలుగా భర్తకి తగిన జోడి. తనేంటో, తన పనేంటో తప్ప



March 2010_Prasthanam.pmd 2 2/25/2003, 12:37 PM

అనవసరంగా ఎవ్వరి విషయంలోనూ తలదూర్చదు. తన విషయాల్లో ఎవరన్నా అనవసరంగా తలదూరిస్తే ఊరుకోదు.

తను మల్లేపల్లి మిషనరీ హైస్కూల్లో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తుంది. ఆ స్కూల్లో విపరీతమైన కట్టుబాట్ల మధ్య, వత్తిళ్ళ మధ్య పనిచేయాల్సిరావడంతో తనకీ మధ్య విపరీతమైన తలనొప్పి వస్తున్నా అలాగే నెట్టుకొస్తుంది.

ప్రమీల శ్రీనివాసరావులది జగ్గయ్యపేట దగ్గర ఓ చిన్న పల్లెటూరు. వాళ్ళకు ఎనిమిది సంవత్సరాల దినేష్, ఐదు సంవత్సరాల సుమంత్ ఇద్దరు మగపిలలు. వాళ్ళిద్దరినీ ప్రమీలా వాళ్ళ స్కూల్లోనే చేర్పించారు.

వాళ్ళు హైదరాబాద్ వచ్చినప్పటి నుండి అద్దె ఇండ్లల్లో ఉండీ, ఉండీ ఈ మధ్యనే బ్యాంక్‌లో లోను తీసి అత్తాపూర్ రింగ్ రోడ్డులో శంషాబాద్ ఫ్లైఓవర్ దగ్గర్లో ఓ అపార్టుమెంట్ కొనుక్కుని అందులోకి మారిపోయారు. ఇప్పుడా అప్పే వాళ్ళ నెత్తిన ముళ్ళ కిరీటమై కూర్చుంది. ఏదో విధంగా ఆ అప్పు తీర్చాలన్న పట్టుదలతో ఉన్నారు.



ఆ రోజు పొద్దున్నే శ్రీనివాసరావు కాలేజీకి వెళ్ళేసరికి అక్కడంతా గోల, గోలగా ఉంది. సీనియర్ ఇంటర్ చదువుతున్న ఖైరతాబాద్ ఎమ్.ఎల్.ఎ మనవడు బిల్డింగ్ మీదికెక్కి "నిన్న శ్రీనివాస్ సార్! తీసుకున్న నా సెల్, వెంటనే నాకివ్వకపోతే నేనిక్కణ్ణుంచి దూకేస్తా" అంటూ హల్‌చల్ చేస్తున్నాడు.

అప్పటికే అక్కడ గుమిగూడిన కరస్పాండెంట్, ఇతర డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, స్టాఫ్, స్టూడెంట్స్ రోడ్డునపోయే జనం ఆందోళనగా చేరుతుంటే "నీ సెల్‌నీకిప్పిస్తాం గాని, దిగిరా బాబు" అంటూ రకరకాలుగా బ్రతిమాలుతున్నారు.

ఇంతలో–

మనవడి విషయం తెలిసిన ఎమ్.ఎల్.ఎ. కుటుంబమంతా కాలేజీ మీదికొచ్చి "ఎవరా శ్రీనివాస్! ఏంటనుకుంటున్నాడతను? వాడి చదువేంటో, వాడేంటో తప్ప పక్కనేం జరుగుతుందో గూడా పట్టించుకోని మా పిల్లవాడి సెల్ లాక్కునేంత అవసరమేమొచ్చింది? మావాడికేదన్నా జరిగిందో, అప్పుడుంటుంది మీ తమాషా" అంటూ తమ స్థాయిని మర్చిపోయి నోటికొచ్చినట్లు మాట్లాడసాగారు.

జరుగుతున్నదంతా చూస్తూ నిశ్శబ్దంగా నిలబడిపోయి శ్రీనివాసరావు దగ్గరకొచ్చిన కరస్పాండెంట్ "ఈ న్యూసెన్సంతా ఏంటయా?! అతని సెల్‌ఫోన్‌తో నీకేంపని? ఇప్పుడతను నిజంగానే దూకేస్తే? నీకేం, నువ్ బాగానే ఉంటావు. మధ్యలో మా పీకలమీదకొస్తుంది. మొత్తానికి పేనుకు పెత్తనమిచ్చినట్టు చేశావు" అంటూ చడా, మడా తిట్టిపోశాడు గాని అసలు జరిగిందేమిటో విచారించలేదు.

అతని మాటలన్నీ ఓపిగ్గా విన్న శ్రీనివాసరావు ఒక్కమాటకూడా బదులు మాట్లాడకుండా వెళ్ళి ఆఫీస్‌రూమ్‌లో దాచి ఉంచిన సెల్‌ఫోన్ తెచ్చి కరస్పాండెంట్ చేతికిచ్చాడు.

వెంటనే అతను "ఇదిగో బాబూ! నీఫోన్ నువ్వు తీసుకుందువు గాని దిగిరా" చేతిలో సెల్‌ఫోన్ ఊపి చూపిస్తూ కేకలు వేశాడు.

"మీరెవ్వరూ సెల్ ఓపెన్‌చేసి చూడనని మాటిస్తేనే దిగివస్తా. లేదంటే దూకేస్తా" అంటూ బిల్డింగ్ చివరి, చివరికొస్తూ ఇంకొ కొత్త డిమాండ్ ముందుపెట్టాడు ఎమ్.ఎల్.ఎ మనవడు. దాంతో చూడగూడనిదేదో ఆ సెల్‌ఫోన్లో ఉందన్న విషయం అక్కడ చేరినవాళ్ళందరికీ ఒక్కసారిగా అర్ధమైపోవడంతో, అప్పటిదాకా శ్రీనివాసరావును నానా మాటలన్న వాళ్ళంతా అతని ముఖం వంక చూడలేక తలలు తిప్పుకున్నారు.

"సరే బాబు! అట్లాగే. నువ్వు చెప్పినట్టే ఇక్కడ మేమెవ్వరం నీ సెల్ ఆన్‌చేసి చూడం గాని వెంటనే దిగేసెయ్" ఇంకా ఆలస్యమైతే మీడియావాళ్ళు, పోలీస్‌వాళ్ళు వచ్చేస్తారు. అందులోనూ ఎమ్.ఎల్.ఎ మనవడు. అప్పుడు రాష్ట్రం మొత్తం అదో ఇష్యూ అవుతుంది అన్న భయంతో కుర్రవాణ్ని బ్రతిమాలసాగారు కరస్పాండెంట్ వాళ్ళంతా.

కరస్పాండెట్ ఛాంబర్లో సమావేశమైన ఎమ్.ఎల్.ఎ, డైరెక్టర్లు, ప్రినిపాల్ వాళ్ళంతా అసలు విషయం ఏంటో చెప్పండి" అన్నట్టు శ్రీనివాసరావు వంక చూశారు.

"ఈ మధ్య వారం, పదిరోజులుగా మధ్యాహ్నం లంచ్‌బ్రేక్‌లో గబ,గబా అన్నం తినేసి తన ఫ్రెండ్‌తో కలిసి థర్డ్‌ఫ్లోర్ టాయ్‌లెట్స్ వెనుకచేరి ఏదో చేస్తున్నారు. అది గమనించిన నేను ఏం చేస్తున్నారక్కడ?" అంటూ నాలుగైదుసార్లడిగాను. అడిగిన ప్రతిసారీ 'ఏంలేదుసార్!" టాయ్‌లెట్ కెళ్లొస్తున్నాం" అంటూ తడుముకోకుండా సమాధానం చెబుతున్నారు.

టాయ్‌లెట్స్ కిందున్నాయి గదా? అంటే ఏం మాట్లాడరు. దాంతో వాళ్ళను నమ్మబుద్ధికాలేదు. దాంతో నిన్న మధ్యాహ్నం వాళ్ళకంటే ముందే థర్డ్‌ఫ్లోర్ కెళ్లిన నేను వాళ్ళకు కనిపించకుండా దాక్కున్నాను.

ఆ విషయం తెలియని మిత్రులిద్దరూ రోజులాగే వచ్చి సెల్‌ఫోన్లో ఏదో చూస్తూ విచిత్రంగా ప్రవర్తించసాగారు. నేను వెనుకపాటుగా నిశ్శబ్దంగా వెళ్ళి హఠాత్‌గా ఫోన్ గుంజుకునిచూస్తే అందులో బ్లూఫిల్మ్ నడుస్తుంది.

దాంతో బిత్తరపోయిన వాళ్ళిద్దరూ ''మాసెల్ మాకివ్వండిసార్! మీకు వెయ్యారూపాయలిస్తాం అంటూ నాతోనే బేరం మొదలుపెట్టారు.

నేను మాట్లాడకుండా సెల్ తీసుకుపోయి ఆఫీస్‌రూమ్‌లో దాచిపెట్టి ఇంటికెళ్ళాను. తిరిగి పొద్దునే నేను కాలేజీకి వచ్చేసరికి జరిగిందేమిటో మీకు తెల్సిందే" అంటూ జరిగిన విషయాన్ని మొత్తం కళ్ళకు కట్టినట్టు వివరించాడు శ్రీనివాసరావు.



March 2010_Prasthanam.pmd 3 2/25/2003, 12:37 PM

"చిన్నప్పటి నుండీ మావాడు చాలా బుద్ధిమంతుడండీ! అలాంటి వాడు ఇలాంటి పన్లుచేస్తున్నాడంటే నేనసలు నమ్మలేకపోతున్నా. వాడిఫ్రెండెవడోగాని, వాడివల్లే మావాడు చెడిపోతున్నాడేమో" తన మనవడు చేసిన తప్పును ఎదుటివాడి మీదికి తోసేస్తూ మాట్లాడుతున్నా ఎమ్.ఎల్.ఎ. స్వరంలో ఇందాకటి తీవ్రతస్థానంలో సంజాయిషీ తొంగి చూస్తుంటే శ్రీనివాసరావు వంక చూస్తూ అన్నాడు.

"సరే, జరిగిందేదో జరిగింది. ఇకనుండి మీరో కంట కనిపెట్టుండండి. మేంగూడా అతని విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాలే సార్!" అంటూ ఎమ్.ఎల్.ఎ. ను మెల్లగా సాగనంపారు కరస్పాండెంట్ వాళ్లంతా కలిసి.

తప్పు చేసిన కుర్రవాడి తాత ఎమ్.ఎల్.ఎ కావడంతో, వాణ్ణి ఏమీ చేయకపోగా సాదరంగా సాగనంపిన కరస్పాండెంట్‌వాళ్ళు" ఇకనుండి కొంచెం జాగ్రత్తగా ఉండండి" అంటూ శ్రీనివాసరావుకే బుద్ధులు నేర్పారు.

ఛాంబర్లో నుండి బయటకొచ్చిన శ్రీనివాసరావును చుట్టుముట్టిన మిగతా స్టాపంతా "ఎవరెట్లాబోతే మీకెందుకు సార్! మనదంతా అరిటాకు సామెతగద. మనకేదన్నా జరిగితే అడగడానికి మనకు యూనియనా?పాడా ఎందుకొచ్చిన గొడవ? ఏదో చూసి, చూడనట్టుపోతే అయిపోయే''. అంటూ ఎవరికితోచినట్టు వాళ్ళు ఉచిత సలహాలివ్వసాగారు.



అందరి మాటలూ విన్న శ్రీనివాసరావు "మీరన్నది నిజమే. కానీ, నేనేం పట్టించుకోకపోతే ఇదే మేనేజ్‌మెంట్ జీతం తీసుకునప్పుడు మీ పని మీరు చెయ్యాలిగదా? అంటూ అడిగేవాళ్ళు కాదా? ఇవన్నీ మామూలేగాని, పోనీండి" అంటూ నెమ్మదిగా ఆఫీస్‌వైపు వెళ్ళిపోయాడు.

"ఏవండీ! ఇవాళ్ళ సాయంత్రం మా అనిల్‌గాడు, వాడి భార్యా వస్తున్నామని ఫోన్ చేశారు. అందుకే మీరు కొంచెం పర్మిషన్‌పెట్టి ముందుగా రండి. అలాగే వస్తూ, వస్తూ బజార్లో ఏదన్నా స్వీట్ తీసుకురండి. అసలే కొత్తదంపతులు, మొదటిసారి మనింటికొస్తున్నారు. కాస్త మంచీ మర్యాద చేయాలిగదా?" పొద్దున్నే కాలేజీకి బయలుదేరుతున్న శ్రీనివాసరావుతో పిల్లలకు యూనిఫామ్స్ తొడుగుతూ చెప్పింది ప్రమీల.

"సర్లే, అలాగే వస్తానే. ఈరోజు మధ్యాహ్నం కూకట్‌పల్లి బ్రాంచిలో పేరెంట్స్ మీట్ ఉందట. ఆ ఏర్పాట్లు చూడ్డానికి వెళ్ళాలని నిన్నే ప్రిన్సిపాల్ గారు చెప్పారు. కాలేజీకెళ్ళి, అక్కణ్ణుంచి కాలేజీ వెహికల్లో కూకట్‌పల్లి వెళ్లిరావాలి." అన్జెప్పి ఈ మధ్యే కొత్తగా కొన్న స్ప్లెండర్ మీద కాలేజీకి వెళ్ళిపోయాడు శ్రీనివాసరావు.

"తను, నేనడగ్గానే వస్తానంటాడు గాని రావడానికెక్కడ కుదురుతుంది? నాతిప్పలేవో నేను పడడమే మంచిది. ఈ ప్రైవేట్ ఉద్యోగాల్లో శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువ. అసలు స్వంత జీవితమంటూ లేకుండా పోతుంది. ఓ చుట్టం, పక్కంలేదు. ఓ పండుగ, పబ్బంలేదు. మీరెక్కడికీ రావడంలేదంటూ చుట్టాలంతా నిష్ఠూరాలాడుతున్నారు. వాళ్ళకు మేంరావడం లేదన్నదొక్కటే గాని ఇక్కడ మా పరిస్థితులు పాపం! వాళ్ళకేం తెలుసు?" అనుకుంటూనే పిల్లల్ని తయారుచేసి, తనూ తయారై గడియారంలో చిన్న ముల్లులా స్కూల్‌కి పరుగులు తీసింది ప్రమీల.

"ఏంటి బావా! లేటైందేంటి? బండేది?" రాత్రి ఎనిమిది గంటలకు నడ్చుకుంటూ ఇంటికొచ్చిన శ్రీనివాసరావు చూస్తూనే పలకరించాడు ఆ సాయంత్రమే భార్యను తీసుకొనివచ్చిన ప్రమీల చిన్నాన కొడుకు అనీల్.

"ఇంకివ్వాళ్ళ ముందొచ్చాను. బండి కాలేజీలోనే ఉందిలే" అంటూ గబ, గబా బాత్‌రూమ్‌లో దూరి తలుపేసుకున్నాడు శ్రీనివాసరావు.

భోజనాలు చేసిన తరువాత అంతాకలిసి హాల్లో కూర్చుని అనిల్‌వాళ్ళు తీసుకొచ్చిన వాళ్ళ పెళ్ళి క్యాసెట్ వేసుకుని చూస్తున్నారు.

ఇంతలో... కాలింగ్ బెల్ మోగడంతో ''ఈ రాత్రప్పుడెవరబ్బా!'' అనుకుంటూ వెళ్ళి తలుపు తీసిన శ్రీనివాసరావు వచ్చినవాళ్ళను చూస్తూనే ఆశ్చర్యపోతూ" మీరా ?! మా ఇల్లెలా తెల్సింది మీకూ? బండిలాగే నన్ను కూడా ఏమైనా చేద్దామని వచ్చారా?" కోపంతో గొంతు బొంగురుపోతుంటే గట్టిగా అరిచాడు.

''లేదు సార్! ఏదో ఆవేశం కొద్దిచేశాం గాని క్షమించండి సార్! ఎంత ఖర్చయినా మీ బండి చేయించి పెడతాంగాని ఈ విషయం మా పేరెంట్స్‌కి చెప్పకండి సార్!" యుక్త వయసు ఊపిరిపోసుకుంటున్న స్వరపేటికలు జీరపోతుంటే ఈ సందడికి లేచి వచ్చిన ఇంట్లో వాళ్ళ వంక సిగ్గుపడి చూస్తూ అన్నారా వచ్చిన వాళ్ళిద్దరు.

అసలక్కడ జరుగుతున్నదేమిటో అంతుపట్టని ప్రమీలా వాళ్ళు నిశ్శబ్దంగా చూడసాగారు.

"సర్లే, నేనెవ్వరికీ చెప్పనుగాని, ముందు మీరిక్కణ్ణుండి నేరుగా మీఇండ్లకుపొండి. మీరు టైమ్‌కి ఇంటికి వెళ్ళకపోతే మీపేరెంట్స్ భయపడతున్నారేమో?" వరిగడ్డి మంటలా చల్లారిన కోపంతో వచ్చిన కుర్రాళ్ళిద్దరినీ మెల్లగా పంపించివేశాడు శ్రీనివాసరావు.

అంతావచ్చి మళ్ళీ హాల్లో కూర్చున్న తరువాత అసలేంటిదంతా? ఎవరు వాళ్ళు? మీ బండికేమైంది? అంటూ శ్రీనివాసరావు మీద ప్రశ్నల వర్షం కురిపించారు.

"ఏమీ లేదు. వీళ్ళిద్దరూ సీనియర్ ఇంటర్ కుర్రాళ్ళు. వీళ్ళ క్లాసులో రోహిణి అని ఓ మార్వాడీ అమ్మాయిని రోజూ వెంటబడి టీజ్ చేస్తుంటే, ఓరోజు ఆ అమ్మాయి నాదగ్గర కొచ్చి విషయం వివరించి సార్! వాళ్ళ మీద ప్రిన్సిపాల్ గారికి కంప్లైంటిద్దామంటే ఇంకా



March 2010_Prasthanam.pmd 4 2/25/2003, 12:37 PM

రెచ్చిపోతారేమోనని ఒకపక్క భయం. పోని మా పేరెంట్స్‌కి చెబుదాంటే అసలు వాళ్ళు ముందే కాలేజీ మానెయ్యమంటారేమొనన్న భయం ఇంకోపక్క. ఏం చెయ్యాలో అర్ధంగాక మీదగ్గరకొచ్చాను సార్! మీరే ఏదన్నా మార్గం చూపించాలి' అంటూ ఏడ్చుకుంటూ చెప్పింది.

పాపం ! ఆ౦ అమ్మాయి పడుతున్న మానసిక క్షోభ అంతా ఆమె కళ్ళల్లో కన్పిస్తుంటే ఏదో ఒకటి చేయాలనుకున్న నేను బాగా ఆలోచించి, నాసెల్ ఆ అమ్మాయికిచ్చి ఏంచేయాలో వివరించాను.

నేను చెప్పినపని చెప్పినట్టు చేసిన ఆ అమ్మాయి మూడోనాడు నాసెల్ నాకు తెచ్చిచ్చింది. ఆ మరునాడు ఎదురైనప్పుడు వీళ్ళను పక్కకు తీసుకుపోయి 'ఏంట్రా!? మార్వాడి అమ్మాయిని టీజ్ చేస్తున్నారట ఏంటి? అంటూ గట్టిగా అడిగాను.

"అబ్బే, మాకేం తెలియదు సార్! అసలు మేమెప్పుడూ ఆ అమ్మాయితో మాట్లాడనే మాట్లాడలేదు సార్ ! అంటూ తలల మీద చేతులు పెట్టుకుని వట్టేసి మరి చెప్పుకొచ్చారు వాళ్ళు.

వెంటనే నేను 'ఒక్క నిమిషం ఆగండి' అంటూ నాసెల్ ఆన్‌చేశాను

అంతే !

వాళ్ళ కళ్ళల్లో వెర్రి ఆశ్చర్యం ! వాళ్ళ బుర్రల్లో ఆయోమయం పొంగులుపారుతుంటే నిన్న మనం ఆ౦ అమ్మాయితో అన్న మాటలు సార్ ! సెల్‌లో కెట్టావచ్చాయిరా ! అన్న సంశయంతో నావంక చూడలేక తలలు నేలకివాల్చారు.

''మొక్కగా ఉన్నప్పుడే వీళ్ళను వంచకపోతే ముందు ముందు ఎలా తయారవుతారో అనుకున్న నేను రేపు మీ పేరేంట్స్‌ను పిలిపించి ప్రిన్సిపాల్ గారి ముందు ఈ సెల్ విన్పిస్తాను. అప్పుడాయన చక్కగా టి.సి. లిచ్చి ఇంటికి పంపుతాడు. ఇక మీరు ఎంచక్కా రోడ్లమీద తిరుగుతూ కన్పించిన అమ్మాయికల్లా బీట్‌కొట్టుకుంటూ తిరగొచ్చు' అంటూ డోస్ మీద డోస్ ఇచ్చాను.

దానికి వాళ్ళు గజ, గజా వణికిపోతూ" ప్లీజ్ సార్ ! ఆ పనిమాత్రం చెయ్యకండి. ఇట్లాంటి పని మళ్ళీ ఎప్పుడూ చెయ్యం' అంటూ కాళ్ళబేరానికొచ్చారు.

చాలాసేపు వాళ్ళను కావాలనే సతాయించిన నేను ఆఖరికి సర్లే, ఎవ్వరికీ చెప్పనుగాని, వళ్ళు దగ్గరపెట్టుకుని ఉండండి' అంటూ వదిలేసిన నేను, ఆ౦ విషయాన్ని అప్పుడే మర్చిపోయాను.

అయితే, వీళ్ళు మాత్రం దాన్ని మనసులో పెట్టుకుని సమయం కోసం చూస్తున్నారు కాబోలు, రెండునెల్ల తరువాత నిన్న మధ్యాహ్నం బండిస్టాండ్‌లో పెట్టి కాలేజీ వ్యాన్‌లో కూకట్‌పల్లి వెళ్ళినప్పుడు ఎవ్వరికంటా పడకుండా బండిని డామేజీ చేసి తప్పుకున్నారు.

నేను వచ్చి బండిని చూద్దును గదా నా బుర్ర తిరిగిపోయింది. ఈ పని ఎవరు చేసుంటారబ్బా అని ఆలోచించుకున్న నాకు వీళ్ళ మీదనే అనుమానం వచ్చింది. అయితే, నేను వాళ్ళను పిలిపించకుండా, వాళ్ళ మిత్రులతో ఈ పనిచేసిందెవరో, నాకు బాగా తెలుసు. వాళ్ళనేం చెయ్యాలోగూడా నాకు తెలుసు! అంటూ విషయం వాళ్ళకు చేరేలా మాట్లాడి నేరుగా ఇంటికొచ్చాను" అంటూ ఒక్కో సంఘటనా వరసపెట్టి చెప్పుకుంటూ వచ్చాడు శ్రీనివాసరావు.



'ఇంత చేసినవాళ్ళు, ఆ౦ మాత్రానికే భయపడి ఇల్లు వెతుక్కుంటూ ఇంతదూర మొచ్చారా! లేకుంటే ఇంకేదైనా ప్లానుందా?" ఆందోళనకు లోనవుతూ అడిగింది ప్రమీల.

"లేదు. ఒక్కోసారి మౌనం కత్తికన్నా పదునుగా ఎదుటి వాళ్ళను భయపెడుతుంది. వాళ్ళ విషయం పసిగట్టిన నేను, వాళ్ళతో ఏమీ మాట్లాడకుండా రావడంతో వాళ్ళల్లో ఓ అపరాదభావం ఏర్పడి వెంటాడుతూ ఇంతదూరం తరుముకొచ్చేలా చేసింది. అంతే తప్ప వాళ్ళ ముఖం వాళ్ళు నన్నేం చేస్తారు చిన్నపిల్లలు" అంటూ ఆ విషయాన్ని అంతటితో ముగించిన శ్రీనివాసరావు వంక ప్రమీలాతో సహా ఇంట్లో ఉన్నవాళ్ళంతా ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నంత విభ్రాంతికి లోనయ్యారు.

"చూడండి! ప్రిన్సిపాల్ గారూ! ఈ క్యాంపస్‌లో మాకన్నా మీకన్నా, టీచింగ్ స్టాఫ్‌కన్నా కాలేజీ పిల్లల్లో, వాళ్ళ తల్లిదండ్రుల్లో గూడా ఆ శ్రీనివాసరావు గాడంటే చెప్పలేనంత అభిమానం, ఆదరణా ఉంది. వాడుకూడా పిల్లలకు సంబంధించి ఎంతపెద్ద ఇష్యూ అయినా ఇట్టే సెటిల్ చేస్తున్నాడు. వాణ్ణి ఇట్లాగే వదిలేస్తే ఏదో ఒకరోజు ఏకు మేకవుతాడు. అందుకేవాణ్ణి త్వరలోనే బయటకు పంపించాలి. ఈలోపు మనక్యాస్ట్‌లో ఎవరైనా మంచి క్యాండెట్ దొరుకుతాడేమో వెతికి పట్టుకొని, ఓ నాలుగు నెల్లపాటు వీడితో పాటు నీడలా అనుసరించి ఏ ఇష్యూని ఎట్లా డీల్ చేస్తున్నాడో పరిశీలించి నేర్చుకొమ్మని చెప్పండి" ఓ ఆదివారం సాయంత్రం కరస్పాండెంట్ ఇంట్లో సమావేశమైన డైరెక్టర్లంతా ఏకగ్రీవంగా శ్రీనివాసరావును ఇంటికి పంపించే నిర్ణయం తీసుకున్నారు.

"ఏమైనా అతను మంచి వర్కర్ పైగా నిజాయితీ గలవాడు, ఆ విషయం మీకూ తెలుసు ఈ సంవత్సరం అతనొక్కడే రెండు వందల యాభై అడ్మిషన్స్ పట్టుకొచ్చాడు. అలాంటివాణ్ణి వదులుకోవడం అంత మంచిదికాదేమో మళ్ళోసారి ఆలోచించండి". తన అనుభవంతో స్పందిస్తూ చెప్పాడు ప్రిన్సిపాల్ డైరెక్టర్ల నందరినీ ఉద్దేశించి.

"అవన్నీ మాకు తెల్సుగాని చెప్పినట్టు చెయ్యండిచాలు" యజమాని చెబుతాడు, పనివాడు ఆచరిస్తాడన్న అహాన్ని ప్రదర్శిస్తూ అన్నారు డైరక్టర్లంతా.

"సరే, మీ ఇష్టం" అంతకన్నా ఏమీ చేయలేని ప్రిన్సిపాల్ మౌనంగా ఊరుకున్నాడు.

నెలరోజుల తరువాత ఓరోజు

"సార్ ! రేపటినుండి నేను కాలేజీ మానేస్తున్నాను." తనను తొలగించడానికి నిశ్చయించుకుని వాళ్ళు మనిషిని రప్పించారని



March 2010_Prasthanam.pmd 5 2/25/2003, 12:37 PM

# ప్రగతి చక్రం ఆత్మఘోష




కన్నెగంటి వెంకటయ్య

స్నేహితుడా !
రయ్యిన రోడ్డుపై పరుగులు తీసే నేను
చెయ్యెత్తిన నీ కోసం
విద్యా ఉపాధినై చేయూత నిచ్చానే !
ఏళ్ళతరబడి ప్రయాణిస్తూ
మైళ్ళ దూరంలో వున్న నీ బంధు మిత్రులతో
ఆత్మీయత నందిచ్చానే !
నీ పెళ్ళీ పేరంటాలకు
పుష్పక విమానమై
కేరింతల పులకింతలు పంచానే !
నిలువెల్లా తడిసిపోతూ
పిడుగుల జడివానలో సైతం,
నీ విధి నిర్వహణకు
గొడుగునై వడి వడిగా నడిచానే !
అర్థరాత్రి, అపరాత్రి అనకుండా
మంచు తెరలు చీల్చుకుంటూ
చలి పులి నెదుర్కొని
నులివెచ్చని దుప్పటినై నీ గమ్యాన్ని చేర్చానే !
కణ కణ మండే ఎండల్లో
సెగల పొగల్ని గుండెల్లోనే అణచుకొని
నిన్ను వేసవి విడదిచేర్చి,
వినోదాల వింజామరనయ్యానే !

నీకు యిన్ని విధాలుగా సాయపడుతూ
నా ఆలనా పాలనా చూస్తున్న వారికోసం
కృతజ్ఞతా భావంతో పనిచేసే నన్ను
నీ అస్థిత్వ ఆరాట, పోరాటాలకు
క్షణిక ఆగ్రహ ఆవేశకావేశాలకు
బలిచేస్తావా నేస్తమా !
నిన్ను ఆప్యాయంగా మోస్తూ
నీ పాదాలు కందకుండా
ఓలలాడించిన గుండెల్ని
బండలేసి బళ్ళున
పగుల గొడతావా మిత్రమా !
నీ కొరకే నిర్విరామంగా
పరిగెడుతూ వున్ననన్ను
నిరసన జ్వాలల్లో కనికరం లేకుండా
కాల్చేయడం న్యాయమా !

దహనమౌతున్న నా దేహం నుండి
వస్తున్న కమురు వాసన కాస్తయినా
నిన్ను కదిలించడం లేదా ?!
కులం మతం భాషా ప్రాంతీయం
లింగభేద వయో భేదాలన్నవి
లేశమైన లేని బ్రతుకునాది
మీరందరూ ముద్దుగా
పిల్చుకునే ఎర్రబస్సును నేను !
క్షోభిత హృదయంతో
ఆర్తిగా చేతులెత్తి అడుగుతున్న
ప్రగతి రథ చక్రాన్ని
గతి తప్పించడం ధర్మమా !
ఇకనైనా యోచించు నా హితుడా !
మరో జన్మలో కూడా
నీ సేవకే పరితపిస్తూ... నీరీక్షిస్తూ...

---

గ్రహించిన శ్రీనివాసరావు మేనేజ్‌మెంట్ కంటే ముందే మెరుపులేని ఉరుములా స్టాఫ్ మీటింగ్‌లో నేరుగా కరస్పాండెంట్‌తోనే చెప్పేశాడు.

"ఎందుకు మానేస్తున్నావ్? ఐనా, ఇంత హఠాత్‌గా మానేస్తానంటే మాకెలా కుదురుతుంది?" శ్రీనివాసరావు మాటలతో మీటింగ్ హాల్లో ఉన్న వాళ్ళందరితో పాటు తనూ ఒక్కసారిగా నివ్వెరపోతూనే అన్నాడు కరస్పాండెంట్.

"దీన్ని బట్టి చూస్తే నువ్వేదో వేరే ఇన్స్టిట్యూట్‌లో చేరినట్టుంది. అందుకే ఇంత ధైర్యంగా చెబుతున్నావ్ పిల్లకాకి కొట్టిన ఉండేలు దెబ్బకు మాడు బొప్పి కడుతుంటే అన్నాడు ప్రిన్సిపాల్.

"నన్ను అన్యాయంగా పంపించడానికి మీరు నిశ్చయించుకున్నప్పుడు, నా దారి నేను వెతుక్కోకూడదా?" నిండా మునిగినవాడికి చలేమిటన్నట్టుగా సూటిగా సమాధానమిచ్చాడు శ్రీనివాసరావు.

"రేయ్! నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? మేం తల్చుకుంటే నిన్నీ హైదరాబాద్ రోడ్ల మీద ప్రాణాలతో తిరక్కుండా చేస్తాం జాగ్రత్త" గడ్డిపరక అనుకున్న వాడు కాస్తా కట్లపాములామారి తమకే షా చెప్పడం సహించలేని డైరెక్టర్లు తమను తాము మర్చిపోయి నోటికొచ్చినట్టు అరవసాగారు.

అప్పటిదాకా వాళ్ళను గౌరవిస్తూ మాట్లాడిన శ్రీనివాసరావు ఆఁ మాటలతో ఒక్కసారిగా లేచి నిల్చుంటూ" ఈ సంస్థ నాది అనుకుని ఇల్లు వాకిలీ, భార్యా పిల్లల్నీ కూడా పట్టించుకోకుండా కష్టపడి నందుకు మీరేం చేయాలనుకున్నారో అర్థం చేసుకోలేనంత అమాయకుణ్ణి కాదు. కెజి నుండి పిజి దాకా దేశంలో ఎన్ని వేల, లక్షల స్కూళ్ళు, కాలేజీలు మీలాంటి వ్యక్తుల చేతుల్లో నడుస్తున్నాయో, వాటిల్లో ఎన్నివేల మంది నాలాంటి వాళ్ళు అసంఘటితంగా పనిచేస్తున్నారో? ఎంతదోపిడికి, దాష్టికానికి గురౌతున్నారో? ఇప్పుడిప్పుడే నాకార్థమౌతుంది. అందుకే నేనో నిర్ణయం తీసుకుంటున్నాను వినండి.

నేనీ హైదరాబాద్‌లోనే ఉంటాను, మీకళ్ళ ముందే తిరుగుతుంటాను. ఈ నగరంలో ఉన్న పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న నాలాంటి వాళ్ళందరినీ సంఘటిత పరుస్తా, ఒకతాటి మీదికి తెచ్చి మీలాంటి వాళ్ళ ఆటలు కట్టిస్తా". అంటూ చకచకా బయటికి నడిచాడు.

వెళ్ళిపోతున్న శ్రీనివాసరావును చూస్తున్న కరస్పాండెంట్ కళ్ళ ముందు ఏనుగు కుంభ స్థలాన్ని కొట్టబోతున్న సింహపు పిల్ల కన్పించడంతో, ఒక్కసారిగా అసహనంతో కంపించిపోయాడు.

■



March 2010_Prasthanam.pmd 6 2/25/2003, 12:37 PM

విశ్లేషణ

# పడిలేచిన కడలి తరంగం



**డా॥ దిలావర్**

***అసంఖ్యాక పురస్కారాలు, అత్యున్నత గౌరవాలను పొందిన ఆమె జీవిత చరిత్రను తెలుసుకుంటే మనం ఆశ్చర్యపోతాం. ఆమె జీవితం నిజానికి వడ్డించిన విస్తరికాదు. ఆమె యీ సాఫల్యం వెనుక, విజయాల వెనుక ఎంతో పరిశ్రమ, పట్టుదల, దీక్ష వున్నాయి. ఎన్నో ఆటుపోట్లు, ఎన్నో ఒడిదుడుకులు వున్నాయి, ఎన్నో ఎత్తుపల్లాలు, లోయలూ శిఖరాలు – చీకటి వెలుగులూ వున్నాయి.***

అమెరికా ఆధునిక కవిత్వం గురించి చెప్పుకోవలసివస్తే మాయాఏంజిలోను అనివార్యంగా గుర్తుచేసుకోవలసి వస్తుంది. ఆమె తన జీవితంలో సాధించినవి చాలానే వున్నాయి. వివిధ హోదాలలో పనిచేసేందుకు ఏంజిలో అనేకమంది అమెరికా అధ్యక్షులు చేత సగౌరవంగా ఆహ్వానింపబడింది. ప్రెసిడెంట్ ఫోర్డ్ ఏంజిలోను అమెరికన్ రెవల్యూషన్ బీసెంటెన్నియల్ కమీషన్ సభ్యురాలిగా నియమించాడు. ప్రెసిడెంట్ కార్టర్ ఆమెను అంతర్జాతీయ మహిళా సంవత్సర ప్రెసిడెన్షియల్ కమీషన్ సభ్యురాలిగా నియమించాడు. 1993లో ప్రెసిడెంట్ క్లింటన్ తన పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఒక కవితను వినిపించాల్సిందిగా కోరాడు. ఏంజీలో 'ఆన్ ది పల్స్ ఆఫ్ ది మార్నింగ్" అన్న కవితను చదువుతుండగా టీవీల్లో ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు.

ఏంజిలో 1981 నుండి నార్త్ కరోలినా, విన్‌స్టన్ సాలేనా లోని వేక్‌ఫారెస్ట్ యూనివర్శిటీలో 'రేనాల్డ్ ప్రొఫెసర్ ఆఫ్ అమెరికన్ స్టడీస్'గా సేవలందించారు. అడపాదడపా 'పొయెటిక్ జస్టిస్', 'రూట్స్' (ఏడుతరాలు) లాంటి మూవీ – టీవీ చిత్రాల్లో కనిపిస్తూనే వున్నారు. 1996లో 'డౌన్ యిన్ ది డెల్టా' అన్న చలన చిత్రానికి దర్శకత్వం వహించారు. 'జార్జియా' అనే సినిమాకు ఏంజిలో స్క్రీన్ ప్లే సమకూర్చింది. 1972లో మొట్టమొదటి ఆఫ్రికన్ – అమెరికన్ మహిళ రచించిన స్క్రీన్‌ప్లే గా అది పులిట్జర్ ప్రైజ్‌కు నామినేట్ చేయబడింది.

అసంఖ్యాక పురస్కారాలు, అత్యున్నత గౌరవాలను పొందిన ఆమె జీవిత చరిత్రను తెలుసుకుంటే మనం ఆశ్చర్యపోతాం. ఆమె జీవితం నిజానికి వడ్డించిన విస్తరికాదు. ఆమె యీ సాఫల్యం వెనుక, విజయాల వెనుక ఎంతో పరిశ్రమ, పట్టుదల, దీక్ష వున్నాయి. ఎన్నో ఆటుపోట్లు, ఎన్నో ఒడిదుడుకులు వున్నాయి, ఎన్నో ఎత్తుపల్లాలు, లోయలూ శిఖరాలు – చీకటి వెలుగులూ వున్నాయి.

**"life is not series of giglamps symmetrically arranged, but a luminous halo, a semitransperent envolop surrounding us from the beginning of the conciousness to the end"** అంటుంది వర్జీనియా వూల్ఫ్. అన్న సందర్భం ఏదైతేనేం గాని మాయాఏంజిలో జీవితానికి అన్వయిస్తే – యీ మాటలు సరిగ్గా అతికినట్టు సరిపోతాయి.

మాయా జీవితం అనేక మలుపులు తిరుగుతుంది. కథకుల వూహలకు కూడా అందనంతటి వైచిత్రి ఆమె జీవితంలో చోటు చేసుకుంది. మార్గరేట్ అన్నే జాన్‌సన్ మి సౌరిలోని సెయింట్ లూయిస్‌లో 4 ఏప్రిల్ 1928లో జన్మించింది. ఆమెకు ఒకసోదరుడు కూడా వున్నాడు. మార్గరెట్ మూడు సంవత్సరాల లేబ్రాయంలో వుండగానే ఆమె తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. సోదరునితో పాటు ఆమె అమ్మమ్మ, తాతయ్యల యిల్లు చేరుకుంది.



March 2010_Prasthanam.pmd 7 2/25/2003, 12:37 PM

అక్కడి నుండి మార్గరేట్ జీవితంలో కష్టాలు మొదలయ్యాయి. అమ్మమ్మ యిల్లు ఆర్కాన్సస్‌లోని స్టాంప్స్ అనే చిన్నపట్టణంలో వుంది. అక్కడ దక్షిణ అమెరికా అంతటిలోనూ పాతుకుపోయిన, వ్యవస్థీకృత జాతి వివక్షను ప్రత్యక్షంగా చూసింది. అక్కడే ఆమె ఆఫ్రికన్, అమెరికన్ సంప్రదాయాలనూ, మతపరమైన ఆచార వ్యవహారాలను ఒంటపట్టించుకుంది. అక్కడ వున్నప్పుడే ఆమె సోదరుడు ఆమెకు 'మాయా' అన్న నిక్‌నేమ్ పెట్టాడు.




మాయ ఏడవ సంవత్సరంలో వుండగా ఆమె జీవితం అనుకోని కుదుపులకు లోనయింది. అన్నెం పున్నెం తెలియని ఆలేత వయసులో జరిగిన ఓ దారుణ సంఘటన ఆమె జీవితాన్ని అతలాకుతలం చేసింది. తల్లిని చూడడానికి షికాగో వెళ్ళినప్పుడు ఆమె తల్లి బాయ్‌ఫ్రెండ్, ఆమెను కిరాతకంగా రేప్‌చేశాడు. సిగ్గుతో కుచించుకుపోయిన మాయా అపరాధ భావనతో కృంగిపోయింది. ఆ కామపిశాచిని మనసులోనే తిట్టుకుంది. తరువాత కొన్నాళ్ళకు అతణ్ణి ఓ అంకుల్ హత్య చేశాడని తెలిసింది. మత విశ్వాసాలను నమ్మే మాయ తను మనసులో అలా శపించడం వల్లనే అతను హత్య చేయబడ్డాడని భావించింది. తాను ఏదో తప్పు చేసిందన్న భావన మనసును తొలిచి వేస్తుండగా, ప్రాయశ్చిత్తంగా ఐదు సంవత్సరాల పాటు మౌనవ్రతాన్ని పాటించింది.

పదమూడవ ఏట మాయా తన సోదరునితో సహా శాన్‌ఫ్రాన్సిస్కోలో వున్న తన తల్లి దగ్గరకు చేరుకుంది. అక్కడ మిషన్ హైస్కూల్‌లో చేరి స్కాలర్ షిప్ సంపాదించింది. శాన్‌ఫ్రాన్సిస్కో లేబర్ స్కూల్‌లో డాన్స్, డ్రామా విభాగాల్లో చేరింది. అక్కడే తన భవిష్యత్ రాజకీయ కార్యకలాపాలను తీర్చిదిద్దిన అభ్యుదయ భావాలకు పునాది ఏర్పడింది. తన అభిరుచి మేరకు లలిత కళల అభ్యాసంలో మునిగి తేలుతున్నా జీవనోపాధి పెద్ద ప్రశ్నార్థకమై ఎదుట నిలిచింది. పొట్టకూటికి జెర్రిపోతులాడించిన చందంగా కేబుల్ కార్ కండక్టర్ వుద్యోగంలో చేరింది. ఆ విధంగా మాయా ప్రప్రథమ ఆఫ్రికన్ – అమెరికన్ మహిళా కేబుల్ కార్ కండక్టర్ అయింది.

అయినా రోజులు వెళ్ళబుచ్చడం కనాకష్టమే అయింది. ఏ రోజుకారోజు దినవెచ్చాలు దొరకడం గగనమే అయింది. గత్యంతరం లేక కడుపుమంట చల్లార్చుకునేందుకు పడుపు వృత్తిని స్వీకరించింది. ఆ వృత్తిలో వున్నప్పుడే ఆమె గర్భవతి అయింది. తెగిన గాలిపటంలా దరీదాపూ లేకుండా తిరుగుతున్న తన మనసును తిరిగి విద్యాభ్యాసం వైపుకు మళ్ళించింది. పట్టుదలతో పట్టభద్రురాలు అయింది. పట్టాపుచ్చుకోవడానికి కొన్ని రోజులు ముందే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

ఎడారిలాంటి జీవితంలో అనంతంగా పరచుకున్న సమస్యలు ఆమె మనసును అల్లకల్లోలం చేయడం మొదలెట్టాయి. అగాధంలా నోరు తెరుచుకున్న ఆకలి ఆమె ఎదుర్కోవలసిన సమస్య అయింది. నైట్ క్లబ్‌లో సింగర్‌గా చేరి కొన్నాళ్ళు బతుకును యీడ్చింది. టోష్ ఏంజిలో అన్న గ్రీకు నావికుణ్ణి పెళ్ళి చేసుకుంది. బాల్యంలో తన సోదరుడు సరదాకు పెట్టిన పేరు 'మాయా'తో భర్త పేరులోని 'ఏంజిల్' ను కలిపి మాయా ఏంజిలోగా తన పేరును మార్చుకుంది. పెళ్ళి ఆమె ప్రవృత్తికి ఏమాత్రమూ అడ్డురాలేదు. ఆమె **opera porgy and bessin** ల ప్రదర్శనలతో యూరపంతా పర్యటించింది. ఆధునిక డాన్స్‌ను బాగా అధ్యయనం చేసింది. టీ.వి. కార్యక్రమాల్లో తన డాన్స్‌లతో జనాన్ని వుర్రూతలూపింది. 1957లో సొంతంగా ఒక ఆల్బమ్‌ను కూడా తీసుకొచ్చింది. యాభైలలో ఆమె తన రచనా నైపుణ్యాన్ని పెంపొందించుకునేందు అహర్నిశలు శ్రమించింది.

తన అధ్యయనంలో భాగంగా మాయా న్యూయార్క్‌కు వెళ్ళింది. అక్కడి **Black poets** తో కలిసింది. హార్లెమ్ రైటర్స్ గిల్డ్‌లో సభ్యత్వం తీసుకుంది. సివిల్ రైట్స్ మూమెంట్‌కు సాంస్కృతిక అనుబంధ శాఖలైన సంస్థలతో చేయి కలిపింది.

న్యూయార్క్‌లో సౌత్ ఆఫ్రికా సివిల్ రైట్స్ యాక్టివిస్ట్ వుసుమ్‌జిమేక్‌తో ప్రేమలో పడింది. 1960లో ఆమె కుమారుని తీసుకొని, వుసుమ్‌జిమేక్‌తో కలిసి కైరోకు వెళ్ళింది. అక్కడ మాయా **The Arab observer** అనే ఇంగ్లీషు పత్రికకు సంపాదకత్వం వహించింది. అక్కడ్నుంచి తన కుమారుని తీసుకొని ఘనాకు వెళ్ళింది. ఘనాలోని వర్ధమాన ఆఫ్రికన్ – అమెరికన్ అధ్యయన సంస్థలో చేరింది. ఘనా విశ్వ విద్యాలయంలో ఇన్‌స్ట్రక్టర్‌గా, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటర్‌గా తన సేవలనందించింది. ఘనేనియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీకి తన రచనల నందించింది. ఆఫ్రికన్ రివ్యూకి ఎడిటర్‌గా పనిచేసింది.

విదేశాలలో పర్యటించే సమయంలో ఆమెలోని అంతులేని జ్ఞాన తృష్ణను చల్లార్చుకునేందుకు ఫ్రెంచ్, స్పానిష్, ఇటాలియన్, అరబిక్, పశ్చిమ ఆఫ్రికా భాష 'ఫ్యాంటి' మొదలైన వాటిని బాగా అధ్యయనం చేసి గొప్ప పట్టు సాధించింది.

ఘనాను పలుమార్లు సందర్శించిన అమెరికా అసమ్మతి నాయకుడు మాల్కోమ్‌తో మాయాకు పరిచయం ఏర్పడింది. అమెరికా యువతను గురించిన అతని పరిణత దూరదృష్టి మాయాను బాగా ఆకర్షించింది.

మాల్కోమ్ నిర్మిస్తున్న నూతన వ్యవస్థ – అమెరికన్ ఆఫ్రికన్ ఐక్య సంఘటనలో పాల్గొనేందుకు మాయా 1964లో అమెరికాకు పయనమైంది ఆమె అమెరికాకు చేరుకున్న కొన్ని రోజులకే మాల్కోమ్ దారుణంగా హత్యగావింపబడ్డాడు. అసమానతలు లేని ఒక నూతన వ్యవస్థ కోసం అతడు కన్న కలలన్నీ అతనితో పాటే సమాధి చేయబడ్డాయి.

తరువాత డా॥ మార్టిన్ లూథర్ కింగ్ జూ॥తో ఆమె పౌరహక్కుల ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం మొదలెట్టింది. సౌత్



March 2010_Prasthanam.pmd 8 2/25/2003, 12:37 PM

క్రిష్టియన్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్‌కు ఆమెను సమన్వయకర్తగా వ్యవహరించవలసిందని డా॥ మార్టిన్ లూథర్‌కింగ్ జూ॥ ఆమెను కోరాడు. 1968లో ఆమె పుట్టినరోజున్నే డా॥ మార్టిన్ లూథర్‌కింగ్ జూ॥ హత్యగావింపబడటంతో ఆమె హతాశురాలయింది.




కకావికలైన మనసుతో,... ఏం చేయాలో తోచని అయోమయ పరిస్థితిలో, ఆమె స్నేహితుడు జేమ్స్ బాల్డ్‌విన్ తారసపడ్డాడు. అతని సలహామేరకు కొన్నాళ్ళపాటు ఏకాంతాన్ని ఆశ్రయించింది. తనను తాను ఓదార్చుకునే క్రమంలో ఆమె సాహిత్య పథికురాలు అయింది. పూర్వమెన్నడూ లేనంత లోతుగా రచనా వ్యాసంగంలో నిమగ్నమయింది. అప్పుడే ఆమె 'కేజ్డ్ బర్డ్ సింగ్స్' అన్న ప్రఖ్యాత కవితా సంపుటి వెలువరించింది. ఆ పుస్తకం – తను ఆర్కాన్ సాస్‌లో గడిపిన బాల్యం దగ్గర నుండి ఒక బాలునికి తల్లి అయ్యే వరకు పరచుకున్న విషాద జీవితాన్ని తెలియజేస్తుంది. ఆ పుస్తకంతో మాయా అనూహ్యంగా జాతీయ స్థాయి ప్రముఖురాలిగా ఎదిగింది. ఇక అప్పట్నుంచి ఆమె వెనుదిరిగి చూసుకోవలసిన అవసరం ఎప్పుడూ రాలేదు.

మాయా వెలయించిన సుమారు 30 పుస్తకాలతో ఆమె తన దేశంలోనే కాక, అంతర్జాతీయ ఖ్యాతి నార్జించింది.

ఆమె నడిచిన దారిలో ఎన్ని కష్టాలెదురైనా లెక్క చేయలేదు. ఒక్కోసారి తిండికోసం కూడా అలమటించిన రోజులున్నాయి. ఎన్ని యిబ్బందులు కలిగినా కేవలం నేలకేసి కొట్టిన మట్టిముద్దలా మిగిలిపోలేదామె. నేలకేసి ఎంత బలంగా విసిరేస్తే అంతపైపైకి ఎగిరే బంతిలాంటిది ఏంజిలో, జీవన పోరాటాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకుందే తప్ప కష్టాలూ, కన్నీళ్ళకు ఆమె ఏనాడూ వెరవలేదు. సమస్యలకు వెన్నిచ్చి జీవితంలోంచి పారిపోనూ లేదు. తను ఏ నేలమీద నుంచుందో, ఏ గాలిని శ్వాసగా మలుచుకుందో, ఏ వెలుతురులో రెక్కలు విప్పుకుందో వాటిలోంచి పిండుకున్న జీవిత సారాన్నే తన కవిత్వ సారంగా అక్షర ప్రపంచానికి అందించిన ప్రతిభావంతురాలు మాయా ఏంజిలో.

తన సంక్షుభిత జీవితంలోంచి పుట్టిన ఆవేదనలకే అక్షరరూపం యిచ్చింది. ఆమె మనోతీరంలో ఉవ్వెత్తున ఎగసిన ఆందోళనలకే కవితారూపమిచ్చింది. రక్తదఘ్నంగా తనలో వున్న – దేనికీ వెరవనితనంతోనే తన అక్షరాలకు పదును పెట్టుకుంది. పురివిప్పుకున్న తనలోని స్వేచ్ఛాగుణంతోనే ఆమె అక్షరపతాకను ఎగరేసి రెపరెప లాడించింది.

ఫినామినల్ వుమన్' అన్న కవితలో స్త్రీ ఔన్నత్యాన్ని ఆకాశానికెత్తుతుంది మాయాఏంజిలో. వికసించిన స్త్రీ వ్యక్తిత్వాన్ని గొప్ప ఆత్మవిశ్వాసంతో చిత్రిస్తుంది యిందులో. ఆత్మ న్యూనతాభావం మచ్చుకు కూడా లేని ఆమె స్త్రీ అనవసరంగా ఏ భేషజాలను కూడా ప్రదర్శించదు. మనం తల పూర్తిగా పైకెత్తి చూసినా కనిపించనంత ఎత్తుగా ఎదిగిన స్త్రీ ఆమె కవిత్వంలో విశ్వరూపం ధరిస్తుంది.

'నేను ఎలా వుంటే నువ్వు సంతోషపడతావో
ఒక మగాడి దగ్గరకి
అంత కూల్‌గా గదిలోకి నడిచివస్తాను.
మగాళ్ళు నన్ను చూడగానే
లేచి నుంచోడమో, లేదా మోకరిల్లడమో చేస్తారు.
తేనెపట్టు మీదికి తేనెటీగల్లా
నాచుట్టూ మగాళ్ళు ముసురుతారు
నేనంటాను – (అందుక్కారణం)
అది నాకళ్ళలోని జ్వాల
నాపలువరుసలోని మెరుపు
నా నడుములోని వూపు
నా పాదాలలోని సొగసు
నేను స్త్రీని... నేను స్త్రీని...'

ఇందులో స్వాతిశయం ఎంతమాత్రమూ లేదు. స్త్రీకే సొంతమైన అందాలను సగర్వంగా ప్రకటిస్తున్నది మాయా.

'స్టీల్ ఐ రైజ్' అన్నది మరొక మంచి కవిత.

లజ్జా భరిత చరిత్ర గుడిసెల్లోంచి
నేను లేస్తాను / మూలాలు విస్తరించిన బాధలోంచి / నేను లేస్తాను.
నేనొక నల్ల సముద్రాన్ని
అందులోకి దూకుతూ
చెమర్చుతూ, అందంగా తడిసిపోతూ
భయబీభత్సాల విహ్వల రాత్రుల పక్కన
నేనున్న కెరటాన్ని వదలిపోతూ'.. అంటూ స్త్రీకున్న అపార ఆత్మశక్తిని బహిర్గతం చేస్తుంది. అనూహ్యంగా ఎన్నో మలుపులు తిరిగే చరిత్రలో, స్త్రీ గురించి పురుషుడు ఎన్నో అబద్ధాలు రాసి వుండొచ్చు. ఎన్నో వక్రీకరణల్ని చిత్రించి వుండొచ్చు. ఆమెను దూళిలో కలిపే ప్రయత్నం చేసి వుండొచ్చు. కాని స్త్రీ ఆ ధూళిలోంచే అపర కాళికలా లేస్తుంది. శక్తి స్వరూపిణియైన స్త్రీ ఆత్మికశక్తి ముందు పురుషుడు డీలా పడిపోక తప్పదు. ఈ విషయాన్ని గొప్ప కవితాత్మక స్వరంతో ఎలుగెత్తి చాటుతుంది మాయా.

'ఎలోన్' అన్నది మరో ఎన్నదగిన కవిత. గజదంత గోపురాల్లో తమలోకి తాము ముడుచుకొని – అంతర్ముఖులై లోకాన్ని పట్టించుకోని వాళ్ళ వల్ల తమకూ ప్రయోజనం లేదు. లోకానికీ ఉపయోగం లేదు.

'ఎవ్వరూ... ఎవ్వరూ...
ఒంటరితనాన్ని జీవించలేరు.
డబ్బున్నా దాన్ని వుపయోగించని
కొందరు మిల్లియనీర్లు వుండొచ్చు



March 2010_Prasthanam.pmd 9 2/25/2003, 12:37 PM

వెన్నుముకల్లేని వాళ్ళ భార్యలు
వాళ్ళ చుట్టూ తిరగొచ్చు
వాళ్ళ పిల్లలు స్వేచ్ఛాగీతాలు పాడొచ్చు
రాతి గుండెల చికిత్స కోసం
ఖరీదైన డాక్టర్లుండొచ్చు
నువ్వు శ్రద్ధగా వింటే
నాకు తెలిసింది చెబుతాను
తుఫాను మేఘాలు కమ్ముకుంటున్నాయి
పెనుగాలులు వీస్తున్నాయి
మానవ జాతి విలవిల లాడిపోతోంది
వాళ్ళ మూలుగులు నేను వింటున్నాను
ఎందుకంటే.....




ఎవరూ ఒంటరితనాన్ని జీవించలేరు." అంటూ గంభీరంగా అనేక జీవిత సత్యాలను తాత్విక స్థాయిలో కవిత్వీకరిస్తుంది మాయా.

లైంగిక వివక్షత కారణంగా స్త్రీ అణచివేతను, ఆమె రెండో శ్రేణి పౌరురాలుగా పరిగణింపబడటాన్ని స్త్రీవాదం ప్రశ్నించవచ్చు. అంతమాత్రాన స్త్రీవాదమంటే పురుషద్వేషం అన్న అపోహను మాయా నిర్ద్వంద్వంగా ఖండించింది. ఉన్నంతలో ప్రేమమూర్తులైన పురుషుల గురించి రాసింది. ఆ పురుషుల ఆకర్షణ గురించి రాసింది. తానొక ప్రేమమూర్తిగా పురుషుల్ని అమితంగా ప్రేమించింది.

'మెన్' అన్న ఆమె విలక్షణ కవిత అందుకు సాక్ష్యంగా నిలుస్తుంది. మాయాయౌవ్వనంలో వున్నప్పుడు వీధిలో వచ్చేపోయే మగాళ్ళను కిటికీ గుండా చూసేది. పరదాల రెపరెపల మాటు నుండి వారి ఆకర్షణ ఎంత బలీయమైనదో గమనించేది.

"ఏదో ఒకరోజు – నువ్వు యీ ప్రపంచపు పక్కానికి రాని ఓ అందానివైనట్టు – మృదువుగా నిన్ను తమ అరచేతిలోకి తీసుకుంటారు. సుతారంగా నొక్కుతారు. నులివెచ్చని ఆ మొదటి స్పర్శకు పరవశించిపోతావు. ఎదిరించడం తెలియని నువ్వు ఓ మధురమైన కౌగిలింత నిస్తావు..." అంటూ పరదాల మబ్బుల వెనుక వూహాలోకాలలో తేలిపోతుంది కవయిత్రి....

పంజరం లోని పక్షి కలల సమాధి మీద నుంచుంటుంది. తననీడ పీడకలల గావు కేకలై ధ్వనిస్తుంది. తన రెక్కలు విరచివేయబడ్డాయి. కాళ్ళు కట్టివేయబడ్డాయి. అయినా తన స్వేచ్ఛాకాంక్షిత గళం ఎలుగెత్తి పాడుతూనే వుంటుంది.

"ఐనో వైది కేజ్డ్ బర్డ్ సింగ్స్" అన్న కవిత ఏంజిలో దుర్భరమైన ఒంటరితనంలో వుండి రాసింది. ఆమె అంతరాంతరాలలో దాగివున్న తీవ్ర స్వేచ్ఛా ప్రియత్వాన్ని ప్రతీకాత్మకంగా చిత్రించిన కవిత యిది. "స్వేచ్ఛా పక్షి విజయం వీపు మీద వాలుతుంది. వర్తమానం అంచుల నందుకోవడానికి అలల మీద తేలియాడతుంది. సూర్య కిరణాల బంగారు రంగులో తన రెక్కల్ని ముంచుతుంది. విశాల ఆకాశం తనదని ధైర్యంగా చాటుతుంది." అంటూ ఆకాశంలో సగం – తన దృఢ సంకల్ప పక్షాలు విప్పి స్వేచ్ఛా ఆకాశాన్ని అందుకోవడానికి ప్రయత్నించడం యీ కవితలో రమ్యంగా బొమ్మ కడుతుంది.

'ది డిటాచ్డ్' అన్న కవిత రూప పరంగా నైతేనేమి, సంవిధానపరంగా నైతేనేమి, వ్యక్తీకరణ పరంగానైతేనేమి ప్రత్యకతను సంతరించుకున్నది. పదాల పోహళింపులో, అభివ్యక్తిలో గొప్ప పనితనం ప్రదర్శింపబడింది. యీ కవితలో.

"ఇరుకు చీకటి గదులలో
మా మెడలను చాపుతూ
భార్యలను హతమార్చేవారిని స్వాగతిస్తూ
మేం మరణిస్తాం
చంపే వారికి తెలియదు
మృత్యువు అంతర్గతమైనదని
తెలియని దేవతల ముందు మోకరిల్లి
అబద్ధాలకు కమ్మని రుచి కలిగిస్తూ
మేం ప్రార్థిస్తాం
దేవతలకు తెలియదు
నరకం అంతర్గతమైనదని.
గ్లోస్ ధరించిన చేతులతో
మా నగ్నత్వాన్ని స్పర్శించుకుంటూ
నాలుకలతో ముద్దాడదానికి
మానోళ్ళను ఆహ్వానిస్తూ
మేం ప్రేమిస్తాం
ముద్దులు ప్రేమను స్పృశించలేవు
ప్రేమ అంతర్గతమైనది."

మాయా ఏంజిలో కవిత్వంలో కేవలం ఆమె అభిమానులచే తనే కాక విమర్శకుల ప్రశంసలు కూడా పొందింది. అయితే ఆమె ప్రఖ్యాతికి తగిన నిష్పత్తిలో ఆమెకు అవార్డులు ఇవ్వలేదన్నది విమర్శకుల అభిప్రాయం. అందుకు ఆమె "అవార్డులు పొందడం ప్రత్యేక కళ. అది కవితారంగానికి గానీ కళారంగానికి గానీ చెందిన వ్యవహారం కాదు. పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవడం కన్నా గొప్ప అవార్డు ఏముంటుంది?" అంటూ స్పందిస్తుంది. ఆమె, జీవితంలో గానీ, కవిత్వంలో గానీ నైతిక విలువల్ని విస్మరించింది అనలేం. అన్ని విలువల కన్నా మనిషే ప్రామాణికమైన గీటురాయి. ఆమె కవిత్వంలో నిజాయితీ వుంది. ఇంద్రియానుభూతి వుంది. ఆత్మాభిమానం వుంది. స్వేచ్ఛా ప్రియత్వం వుంది. అన్నిటికన్నా మించి, నులివెచ్చని మానవీయ స్పర్శ వుంది. ■

## కవిత

# పేక మేడ

అల

భ్రమ ఎంత వికృతమైనది
ప్రలోభానికి, లాభాపేక్షకి మూలం ఈ భ్రమే
ఏది స్థిరం కాదని
ఏది స్థానువూ కాదని
శాశ్వతం అంతకన్నా కాదని
పతనమో, అభివృద్ధో
ఏదో ఒకటి
నిరంతరం జరగవల్సిందేనని తెలిసినా
స్థిరం చేసుకోవాలని
స్థాణువుగా వుంచాలని
శాశ్వత పరుచుకోవాలని
అర్రు చాచడానికి హేతువు ఈ భ్రమే !
భ్రమ ఎంత క్రూరమైనది
ఎవరివో నిర్భాగ్యుల శిరస్సుల్ని
పచ్చగడ్డికి వలె పరపరాకోస్తుంది
ఎవరివో అభాగ్యుల దేహాల్ని
నాగసాకీలో లాగ తునాతునకలు చేస్తుంది



అదుగో వాళ్ళని అమాంతంగా
ఎత్తుకుపోయి
దావానలం మధ్యలోకి విసిరేస్తుంది
భూగోళాన్ని చాపచుట్టి
చంకలో పెట్టుకొని
రక్కసి నవ్వు నవ్వుతుంది
పంట పొలాల్ని, పండ్ల తోటల్ని
అభయారణ్యాల్ని, భూగర్భ నిధుల్ని
భోజనం బల్ల మీదకు రప్పించుకొని
హాయిగా ఆరగిస్తుంది
సముద్రాల్ని
ఇంటిపై అంతస్తు మీద
నీళ్ళ టేంకుగా నిలబెడుతుంది
నదుల్ని గదుల్లో
నాళాలుగా ప్రవహింపజేస్తుంది
నెత్తురు చెమటల్ని
అత్తరూ, పన్నీరుగా పూసుకుంటుంది
యధాస్థితిలో ఏది వుండదని

---

# పరాయీకరణ

డా॥ మౌని

ఒక వసుధైక కుటుంబం... ఎప్పుడూ..
'గ్లోబలైజేషన్' కిందికి రాదు
వచ్చిందో... అది
ఒకడి అధీనతకు అగ్రిమెంటు
ప్రపంచీకరణ పేరుతో.. అది ఒక
పరాయీకరణ... పరాధీనత
ప్లాస్టిక్ పూమాలలతో
ఆహ్వానిస్తున్న ఒక స్వాగతం
దేశ దేశాలను బానిసలుగా
మార్చేందుకు
ఎరవేసిన ఒక వల
వ్యాపార విష సంస్కృతిని
మొలిపించే
ఒక తాంత్రిక శిల
డాలర్ విత్తనాలు చల్లి
వాణిజ్య ఆకర్షణ పేరుతో
దేశ సంస్కృతిపై.... విషం కక్కుతున్న
ఒక బేతాళ తల.
గ్లోబలైజేషన్... విదేశీయత,
దేశీయతపై కమ్ముకుంటుంది



స్వదేశీయత తనకు తానుగా
తాకట్టవుతుంది
మంత్రాల మర్రిచెట్టు కింద
మన బతుకుల్ని ఎప్పటికీ
ఎదగని మొలకలుగా చేస్తుంది
పచ్చని పొలాల్ని.. ఎండగట్టి
'సెజ్'ల పేరుతో రేటుగట్టి
అమ్ముకోవడం నేర్పుతోంది
పల్లె తల్లి గుండెలపై
మెత్త మెత్తగా...
డాలర్ కత్తిని దించుతోంది
ఈనాటి..
డాలర్ ఆశల జబ్బు
రేపటి మన బతుకులకు
ఇప్పటి కిప్పుడే మనం చేసుకుంటున్న
ఎన్‌రోల్‌మెంటు....
ఇదే జరిగితే...
రేపటి కాలంలో.. అందరం
విదేశీయతకు...
తలలు తాకట్టు పెట్టి
తలలులేని మొండేల్లా...
తప్పక.. నడవాల్సి వస్తుంది !....బహుపరాక్ ... !



March 2010_Prasthanam.pmd 11 2/25/2003, 12:37 PM

కథ

# వాళ్ళిద్దరూ ఓడిపోయారు



**డా॥ కె.ఎల్.వి. ప్రసాద్**

***కోనసీమలో–***

***కొబ్బరిచెట్ల నడుమ, ప్రకృతి అందాలను నిండా కప్పుకుని, చూపరుల కళాదృష్టికి, అదొక పచ్చని తివాచీ మాదిరిగా దర్శనమిస్తుంది ఆ... గ్రామం.***

***ఇప్పుడిప్పుడే అభివృద్ధి అంచులవైపు పయనిస్తుందని చెప్పుకోవడానికి వీలుగా, ఆ గ్రామంలోని పూరిళ్ళన్నీ పక్కా డాబాలుగా రూపాంతరం చెందుతున్నాయ్.***

ఆ గ్రామంలోని ఇళ్ళన్నీ పూరిళ్ళు కాదు. కేవలం పూరిళ్ళు మాత్రం బడుగువర్గాల వారివి. మిగతా కులాల వారివి కొందరివి ఓ మాదిరి పక్కా గృహాలైతే, అతి తక్కువ మందివి పక్కా ఇళ్ళు.

ఆ ఊళ్ళో క్షత్రియులని, యితర కులాలని విడదీస్తూ ఏటిగట్టు. ఏటిగట్టుకు దిగువ ప్రాంతంలో క్షత్రియులు, ఎగువ ప్రాంతంలో ఎక్కువ శాతం దళితుల ఇళ్ళు, మిగతావి ఇతర కులాల వాళ్ళకు చెందినవి ఉన్నాయి.

ఏటిగట్టు ప్రక్క ఎగువ భాగంలో, దళితులు నివాసం ఉండే ప్రాంతానికి కొద్ది ఫర్లాంగుల దూరంలోనే పుణ్య గోదావరి నది ప్రవహిస్తుంటుంది. గోదావరికి వరదలు వస్తే, అన్ని రకాలుగా మొదట నష్టపోయేది దళిత కుటుంబాలే.

క్షత్రియులకి, మిగతా వాళ్ళకి వాళ్ళు నివాసం వుంటున్న ఇళ్ళ తేడాను బట్టి, వాళ్ళ ఆర్థిక స్థితిగతులను లెక్కగట్టవచ్చు. అభివృద్ధి పథంలో వాళ్ళ పెంకిటిళ్ళు మేడలుగా మార్పు చెందుతుంటే, వీళ్ళ గుడిసెలు చిన్న చిన్న డాబాలుగా మారుతున్నాయ్.

ఈ రెండు ముఖ్య వర్గాల ప్రజల ఇళ్ళను విడదీస్తూ ఒక వెడల్పయిన పంటకాలువ, దానికి అక్కడక్కడ పిల్ల కాలువలు, కాలువ ప్రక్క సన్నని కంకర రోడ్డు. జట్కాలు, ఆటోలు పోవాలన్నా, మినీ బస్సులు, చిన్నకార్లు, మోటారు సైకిళ్ళు పోవాలన్నా ఆ గ్రామానికి కంకర రోడ్డే దిక్కు!

కంకరరోడ్డుకు, పంటకాలువ ఒడ్డుకు మధ్యన, ఒక ఖాళీస్థలంలో పెద్ద రావిచెట్టు, చెట్టు చుట్టూతా సిమ్మెంటుతో నున్నగా తయారుచేసిన అరుగు, అరుగుకు కాస్త దూరంలో అందమైన అల్లూరి సీతారామరాజు విగ్రహం. ఇదీ సంక్షిప్తంగా ఆ ఊరి స్వరూపం.

సాయంత్రం అయ్యేసరికి, పగలంతా పనులలో అలసిపోయిన చాలామంది భూస్వాములు, రావిచెట్టు సిమ్మెంటు అరుగుమీదికి చేరుకుంటారు. ఇక్కడ అనేక అంశాలు చర్చకు రావడమే కాదు; అనేక ముఖ్యమైన నిర్ణయాలకు అది వేదిక అయిపోతుంది.

అయితే, అక్కడకు ఇతరులు ఎవరూ రారు. అలాగని రాకూడదనే నియమం ఏమీ అక్కడ లేదు. క్షత్రియుల సంఖ్య తక్కువగా ఉన్న ఆ గ్రామంలోను, చుట్టు ప్రక్కల గ్రామాలలోను, యీ వర్గాలకే ఆస్తులు అధికంగా ఉన్నాయి.

ఆ... కోవకు చెందిన పెద్దరైతు సుబ్బరాజు. అక్షరం అసలే అబ్బని సుబ్బరాజు, ఎంతటి ఆస్థిపరుడయినా అతనికి ఎలాంటి భేషజాలు లేవు. పనివాళ్ళతో సమానంగా పనిచేస్తూ, వాళ్ళల్లో ఒకడిగా కలిసిపోయే మనస్తత్వం అతనిది. చూసేవాళ్ళకు అతనొక గొప్ప భూస్వామిలా అసలు కన్పించడు. అతని వందల ఎకరాల ఆస్థిలో, కొబ్బరితోటలు, పండ్లు, పూలతోటలతో పాటు పంట పొలాలు కూడా



March 2010_Prasthanam.pmd 12 2/25/2003, 12:37 PM

ఉన్నాయి.

పెద్దవాళ్ళల్లో పెద్దవాడిగా, చిన్నవాళ్ళల్లో చిన్నవాడిగా, కలిసిమెలసి, అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ, సహృదయుడని పేరుబడ్డ సుబ్బరాజు ఒకానొక రోజు సాయంత్రం రావిచెట్టు దగ్గర సమావేశంలో కేంద్రబిందువయ్యాడు.



సుబ్బరాజుకి, చేతికి ఎముక లేనివాడని పేరు. అతను ఎవరికీ అన్యాయం తలపెట్టిన సంఘటనలు గాని, శత్రువులున్న చరిత్ర గాని అసలు కన్పించవు. చేతనయితే సహాయం చేయడం లేకుంటే మిన్నకుండడం అతని జీవనశైలికి పెట్టింది పేరు!

అయినా జనం నోళ్ళల్లో అతనిప్పుడు బాగా నానుతున్నాడు. దానికి కారణం సుబ్బరాజు కాదు, సుబ్బరాజు కొడుకు సత్తిరాజు!

-------

"సుబ్బరాజు యింతపని చేస్తాడని అనుకోలేదా!" అన్నది ఒక కంఠం.

"అవును! నిజంగా యిది విన్నవాళ్ళకి వింతగానే ఉంది. రాజుగారు యింతకు తెగిస్తారని అనుకోలేదు!" అన్నారు మరొకరు.

"అంతకు మించి ఆయన మాత్రం ఏమి చేయగలడు పాపం!" అని సానుభూతి వాఖ్యానం చేశాడు మరొక వ్యక్తి.

"పేరు ప్రతిష్టల కోసం, యింతకు మించి ఆయనకు ఏమీ కన్పించలేదా?" అన్నాడు ఒక వితండవాది.

"పేదలకు పంచి, పట్టాలిప్పించినా బావుండేది" అన్నారు ఒక కమ్యూనిస్టు సానుభూతిపరుడు.

"ఆయన క్షుణ్ణంగా ఆలోచించకుండా ఎప్పుడూ ఏమీ చేయడు. ఇప్పుడున్న ఆయన పరిస్థితిని బట్టి మంచిపనే చేశాడని నాకన్పిస్తున్నది" అన్నాడు సుబ్బరాజును అతిదగ్గరగా ఎరిగిన వ్యక్తి.

"ఈ విషయం గురించి మనం యిప్పుడు ఇంతగా తర్జన, భర్జనలు చేయవలసిన అవసరం ఏముంది? ఆయన రెక్కల కష్టం అందునా సొంత ఆస్తి. ఆయన ఇష్టం. రాజుగారిని విమర్శించడానికి మనం సరిపోము!" అన్నాడు మరో మనసున్న మనిషి.

రావిచెట్టు దగ్గర సందడి యీ విధంగా కొనసాగుతుంటే అక్కడ సుబ్బరాజు ఒక్కడూ ఇంట్లో కూర్చుని ఆలోచనల సుడిగుండాలలో చిక్కుకునిపోయి ఉన్నాడు.

ఒక్కగానొక్క కొడుకు – సత్తిరాజును గురించిన ఆలోచనలు అతడి మస్తిష్కంలో మెదలడం మొదలుపెట్టాయి.

----------

పొలం పనులు పూర్తిచేసుకుని, తను యీ మధ్యనే కొనుగోలు చేసిన రష్యన్ ట్రాక్టర్‌ను స్వయంగా నడుపుకుంటూ ఇంటికి చేరిన సుబ్బరాజుకి నవ్వుతూ స్వాగతం పలికింది ఆయన అర్ధాంగి సరస్వతమ్మ. రాగిచెంబు నిండా చల్లని మంచినీళ్ళు భర్తకు అందిస్తూ–

"ఇది విన్నారా? మన సత్తిబాబు పదోతరగతి ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయ్యాడు. ఇంకా చదువుకుంటానని ఒకటే మారాం చేస్తున్నాడు. మిమ్మల్ని అడగడానికి భయపడ్తున్నాడు" అంది సరస్వతమ్మ భర్త ముఖంలోకి పరికిస్తూ.

"బాబు చదువుకుంటానంటే ఎందుకు వద్దంటాను గాని... ఏడి... ఆయన ఎక్కడ?" అని ఆత్రంగా అడిగాడు సుబ్బరాజు.

"ఇప్పటివరకు మీకోసమే చూచి యిప్పుడే స్నేహితులతో బయటకు వెళ్ళాడు. ఈ పాటికి తిరిగి వచ్చేస్తుంటాడులెండి!" అంది సౌమ్యంగా.

"సరస్వతీ! సత్తిబాబును చదివించడానికి నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. పైచదువులు చదువుతానంటే ఆనందంగా చదివిస్తాను. నిజానికి మనకి ఆస్తులు మాత్రమే ఉన్నాయి తప్ప, సరస్వతీ కటాక్షం లేనే లేదు. కాని...!" అంటూ ఆగిపోయాడు

"మరి.... మీ సందేహం ఏ విషయంలో?" అంది నుదురు చిట్లిస్తూ సరస్వతమ్మ.

"ఆయన కోరిక మేరకు చదివించిన తరువాత ఉద్యోగాలు చేస్తాను, ఊళ్ళేలతాను...అంటే ఎలా?"

"ఓ! .... అదా మీ అనుమానం....!"

"అవును మరి. చదువుకున్నవాళ్ళు నాలా కష్టపడడానికి ఇష్టపడతారనుకుంటున్నావా సరస్వతీ!"

"మన సత్తిబాబును కూడా అందరిలా అంచనా వేస్తే ఎలా? మీరు గీసిన గీత దాటి ఎప్పుడయినా మీకు ఇబ్బంది కలిగించినాడా?"

"అన్ని రోజులు ఒకేలా వుండవు సరస్వతీ! నన్ను చదివించాలని మా నాన్న ఎంతో ప్రయత్నించాడు. కాని నాకు అది బారెడు దూరంగా జరిగి నన్ను నిరక్షరాస్యుడిగానే మిగిల్చింది. ఎలాగూ చదువు లేదు కాబట్టి వ్యవసాయంలో ఇమిడిపోయాను. కాని మన బాబు సంగతి అలా వుండదు కదా! నేను మాత్రం ఎంతకాలం ఈ ఆస్థిని సంరక్షించగలను చెప్పు?"

"అది నిజమేనండి, నేను కాదనడం లేదు. కాని మన బాబు చదువుతోపాటు, మన పొలాల పచ్చదనం కూడా కాపాడతాడనే గట్టి నమ్మకం నాకుంది మరి!"

"మన పిల్లల్ని మనం నమ్మడంలో తప్పులేదు, కానీ పెద్ద చదువుల కోసం, పట్టణాలకు వెళ్ళిన తరువాత ఎవరు ఎట్లా మారతారో! ఎవరు చెప్పగలరు?"

"మీరొక విషయం మరచిపోయారు. మన మూర్తిరాజు గారి సంగతేమిటి? జర్మనీ దేశంలో పెద్ద చదువులు చదివి గొప్ప ఇంజనీరు ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఆయన చేస్తున్న పనేమిటి? మీతో పాటుగా



March 2010_Prasthanam.pmd 13 2/25/2003, 12:37 PM

అరకలి దున్నడం కాదూ! పాతిక ఎకరాల పంటభూమిని సాగు చేయడం లేదూ!"

"నిజమే సరస్వతీ నేను కాదనడం లేదు. సరే ఎలా జరిగేది అలా జరుగుతుంది. ఆయన కోరుకున్నట్లు గానే చదివిద్దాం" అన్నాడు సుబ్బరాజు.

-----------



భార్యకిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు సుబ్బరాజు. తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయడం లేదు సత్తిరాజు. ఇంటర్మీడియెట్ తొంబయి శాతం మార్కులతో పాస్ కావడమే కాకుండా ఎం.సెట్‌లో మంచి ర్యాంకు సంపాదించిన సత్తిరాజుకి మంచి పేరు ప్రఖ్యాతులున్న ఇంజనీరింగ్ కళాశాలలో సీటు కూడా వరించింది. ఆ సమయంలో కంప్యూటర్ సైన్స్‌కు మంచి గిరాకి వుండడంతో దానినే తన ప్రధాన సబ్జక్టుగా ఎన్నుకున్నాడు సత్తిరాజు.

ప్రధాన పట్టణంలో ఇంజనీరింగ్ స్టూడెంటయిన సత్తిరాజు అతి తక్కువ కాలంలోనే వేష-భాషల్లో విశేషమైన మార్పు వచ్చేసింది. అతని జీవనశైలి కూడా మారిపోయింది.

అలా అని చదువు విషయంలో అతను ఏ మాత్రం అశ్రద్ధ చేయలేదు. ఖర్చు విషయంలోను, తండ్రికి తగ్గ తనయుడు గానే మెలుగుతున్నాడు. తన టార్గెట్‌కు తగ్గట్టుగానే ప్రతి సంవత్సరం మంచి మార్కులతో పాస్ అవుతున్నాడు. అతని ఆలోచనలు చదువు పరిధిని దాటి ఎలాంటి వింత పోకడలను ఆశ్రయించడం లేదు. ఇంజనీరింగ్ చదువుతున్న అందరి విద్యార్థుల మాదిరిగానే భవిష్యత్తు గురించి కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను మనస్సులో భద్రపరుచుకున్నాడు.

సందర్భం వచ్చినప్పుడల్లా తన నిర్ణయాల గురించి తల్లితో సున్నితంగా చర్చిస్తూ వస్తుండడం వల్ల సరస్వతమ్మ తనయుడి మదిలోని భావాలను అంచనావేయగలిగింది. ఈ విషయంలో ఒక ప్రక్క తనకు సంతోషంగా ఉన్నా భర్త సుబ్బరాజు మనస్సునెరిగిన సరస్వతమ్మ మరోప్రక్క భయం భయంగానే ఉంటుంది. ఈ విషయం సత్తిరాజు గ్రహించకపోలేదు. ఎలాగైనా తల్లి తన పక్షం నిలబడి, తండ్రిని ఏదోరకంగా ఒప్పిస్తుందనే గట్టి నమ్మకం సత్తిరాజుకు ఉంది.

అందుచేతనే ఇంజనీరింగ్ తర్వాత ఏమిటి? అన్న ప్రశ్న ఉదయించకుండా తండ్రి దగ్గర జాగ్రత్త పడ్డాడు సత్తిరాజు. చదువు గురించి చర్చపెడితే యింకా చదువుతానంటాడేమోనని కొడుకు దగ్గర ఆ ప్రస్తావన రాకుండా తన పెద్దరికం నిరూపించుకున్నాడు సుబ్బరాజు.

సర్పంచ్ సదానందంతోపాటు సుబ్బరాజు కలిసి కాకినాడ ప్రయాణం అయ్యాడు. పేదవాళ్ళకు పట్టా భూములు ఇప్పించే విషయంలో కలెక్టరు ఆఫీసులో పని పెట్టుకుని ఇద్దరూ కాకినాడ వెళ్ళి వారం రోజులు అక్కడే ఉండిపోవలసి వచ్చింది సుబ్బరాజుకి.

సుబ్బరాజు చెల్లెలు సుశీలమ్మ కాకినాడలోనే కాపురం ఉండడం వల్ల చెల్లెలిని చూడాలనుకున్నప్పుడల్లా ఏదోపని పెట్టుకుని కాకినాడ వెళ్తుంటాడు సుబ్బరాజు. ఆ క్రమంలో వారం రోజుల తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన సుబ్బరాజుకి ముందుగానే రెండు ముఖ్యమైన విషయాలు తెలిసాయి. అందులో ఒకటి ఆయనకి అమితమైన సంతోషాన్ని కలిగించేదయినప్పటికీ రెండవ విషయంలో కాస్త షాక్ తిన్నంత పనయింది. అయినా ఏమీ తెలియనట్లుగానే ప్రవర్తించడం మొదలుపెట్టాడు సుబ్బరాజు.

సత్తిరాజు గాని, తల్లి సరస్వతమ్మ గాని ఆ విషయాలు సుబ్బరాజుకి చెప్పడానికి భయపడ్తున్నారు. అలా అని చెప్పకుండా వుండలేని పరిస్థితి! అందుకే సత్తిరాజు సాహసం చేశాడు. తండ్రి తీరిగ్గా కూర్చుని, పెంపుడు కుక్కను ఆటలాడిస్తున్న సమయంలో–

"నాన్నగారూ, మీకొక శుభవార్త చెప్పనా?" అన్నాడు

"చెప్పు నాయనా! ఏమిటి?" అన్నాడు. ఆశ్చర్యపోతూ తనకు ఏమీ తెలియదన్నట్లుగా.

"నా ఇంజనీరింగ్ పూర్తయింది నాన్నగారు. రెండు సబ్జెక్టుల్లో గోల్డ్ మెడల్ కూడా వచ్చింది!" అన్నాడు.

"అలాగా, సంతోషం బాబూ! మనలో ఎవ్వరూ చేయని పని నువ్వు చేశావు. నీకు నా అభినందనలు" అన్నాడు సంతోషం ప్రకటిస్తూ సుబ్బరాజు.

ఆనందంగా వికసించిన సత్తిరాజు ముఖం ఒక్కసారిగా మాడిపోయిన బల్బులా తయారయింది. కొడుకులో ఆకస్మాత్తుగా కన్పించిన మార్పును గమనించిన సుబ్బరాజు–

"సత్తిబాబూ, ఏంటినాన్నా అలా వున్నావ్!" అన్నాడు.

తండ్రికి తెలియకుండా తను చేసిన పనులకు గిల్టీగా ఫీల్ అవుతున్నాడు. తను చేసింది తప్పుకాకపోయినా తండ్రికి తెలియకుండా తన యేర్పాట్లు తను చూసుకోవడం నేరంగానే అతను భావిస్తున్నాడు. సత్తిరాజు ఎంతకి పెదవి కదపక పోవడంతో సుబ్బరాజు కల్పించుకుని

"చెప్పునాన్నా ఏమయింది నీకు. ఇలాంటి సమయంలో సంతోషంగా వుండాలి గాని, అలా నీరసించి పోతున్నావేమిటి?" అన్నాడు ఆదుర్దాగా.

"నాన్నగారూ... నేను...."

"ఊఁ చెప్పవయ్యా నా దగ్గర నీకు ఆ భయమెందుకు"

"నాన్నగారూ అమెరికా వెళ్ళి అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసి వద్దామనుకుంటున్నాను. దానికి అవసరమైన పరీక్షల్లో కూడా మంచి ర్యాంకులు సంపాదించాను. పాస్‌పోర్టు కూడా వచ్చేసింది. కాని, ఇప్పుడు మీరు ఏమంటారోనని నాకు భయంగా ఉంది!" అన్నాడు కాస్త బెరుకుగా.

"హుఁ పెద్దవాడివి అయ్యావు కదా నాన్నా, నీకు స్వంత ఆలోచనలు రాక తప్పదు. అది నీ తప్పుకాదు. నిండా మునిగిన వాడిని నాకు ఇంకా చలియేటి సత్తిబాబూ..." అన్నాడు కాస్త బాధగా.



March 2010_Prasthanam.pmd 14 2/25/2003, 12:37 PM

"మీరు ఊహిస్తున్నట్లు నేను ఎట్టి పరిస్థితులలోనూ అక్కడ స్థిర పడబోను నాన్నగారు. అలాగే మన ఈ అమూల్యమైన పసిడి భూములను వృధా చెయ్యను. నా మాట నమ్మండి" అన్నాడు.

తండ్రి కొడుకుల సంభాషణను నిశ్శబ్దంగా ఆలకిస్తుంది సరస్వతమ్మ. తను పెదవి విప్పితే వాతావరణంలో ఎలాంటి మార్పు వస్తుందో నన్న భయంతో మిన్నకుండిపోయింది. సుబ్బరాజు, భార్య ముఖంలోకి సావధానంగా చూడడం మొదలుపెట్టాడు. 'నేను ఊహించినట్లుగానే జరుగుతుంది చూశావా' అన్నట్లున్నాయి ఆయన చూపులు. భర్త ముఖంలోకి సూటిగా చూడలేని సరస్వతమ్మ క్షణం పాటు తలదించుకుంది. ముగ్గురి మధ్య నిశ్శబ్దం రాజ్యమేలుతున్న సమయంలో సుబ్బరాజు కల్పించుకుని,



"చూడు సత్తిబాబు, నవ్వు నా కొడుకవయినా, నువ్విప్పుడు చిన్నపిల్లాడివి కాదు. పరిపక్వత చెందిన మనస్సు నీది. నేను ఊహించిన దానికి భిన్నంగా మానసికంగాను, శారీరకంగాను నువ్వు ఎంతో ఎత్తుకి ఎదిగిపోయావు. ఇప్పుడు నీకు సలహాలిచ్చే పరిజ్ఞానం నాకు లేదు. అలాగే, నేను నీ భవిష్యత్తుకి అభివృద్ధి నిరోధకుడిని కాలేను. నీకు ఇప్పుడు నేను ఏ రకంగా ఉపయోగపడగలనో చెప్పు. నీ యేర్పాట్లు వేగవంతం చేయి. నీకు శుభం కలగాలని కోరుకుంటున్నాను"

"చాలా థాంక్స్ నాన్నగారూ..." అన్నాడు తలపైకెత్తిన సత్తిరాజు.

తండ్రి కోప్పడితే తనలోని టెన్షన్ తీవ్రత కొంత తగ్గి ఉపశమనం లభిస్తుందని ఊహించిన సత్తిరాజు ఆలోచన తలక్రిందులయింది.

-----------

కాలం తెచ్చిన మార్పులతోపాటు, సత్తిరాజు ఆమెరికా వెళ్ళడము, ఎం.ఎస్ పూర్తిచేసిన వెంటనే రీసెర్చి చేయడము, యీ మధ్యకాలంలో రెండుమూడుసార్లు స్వదేశానికి వచ్చి వెళ్ళడము కూడా జరిగిపోయాయి. అంతేకాదు, ఉద్యోగంలో స్థిరపడ్డ కొడుక్కి పెళ్ళి ప్రయత్నాలు తలపెట్టగ తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తన కంపెనీలో పనిచేస్తూ పరిచయమైన ఒక బెంగాలీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ తర్వాత అతని రాకపోకలకు ఊహించినట్లుగానే అంతరాయం కలిగింది. సత్తిరాజు చర్య ఆ వృద్ధ దంపతులకి తమ శిరస్సులు రోట్లో పెట్టి రోకలితో దంచినట్లయింది. దీనికి తగ్గట్టు ఇరుగుపొరుగు వచ్చి పలకరింపు పేరుతో కొడుకు గురించి రకరకాల ప్రశ్నలు సంధించడం, సూటి-పోటి మాటలు మాట్లాడడం వాళ్ళని మరింత బాధించడం మొదలుపెట్టింది.

ఆదిలోనే అడ్డుకోకుండా కొడుకును ప్రోత్సహించానన్న శంక సరస్వతమ్మ గారి మనస్సులో సూదిలా గుచ్చడం మొదలుపెట్టింది. పరోక్షంగా భర్తను తానే మానసికంగా కృంగదీస్తున్నానన్న అపరాధభావం ఆమెలో చోటుచేసుకోవడం మొదలయింది. క్రమక్రమంగా ఆమె ఆరోగ్యం క్షీణించి ఒకరోజు తెల్లవారుఝామున సుబ్బరాజుని ఒంటరిని చేసి, సరస్వతమ్మ శ్వాస విడిచింది. సుబ్బరాజు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది. కొడుకుకి వర్తమానం అందించాడు. కనీసం తల్లి మరణం విన్న వెంటనే రెక్కలు గట్టుకొని వాల్తాడని భావించాడు. ఆయన ఆశలన్నీ నిరాశలయ్యాయి. అయినవాళ్ళు, ఆప్తుల సహకారంతో సరస్వతమ్మ గారి అంత్యక్రియలు ఘనంగా నిర్వహించాడు సుబ్బరాజు.

నెలరోజుల పాటు భార్య పేరుమీద పంచభక్ష్య పరమాన్నాలతో పేదలకు అన్నదానం చేయించాడు. జనసంఖ్యను లెక్క చేయకుండా స్త్రీలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయించాడు. అయినా ఆయనకు తృప్తి కలగలేదు. ఆయనలో తెలియని కసి బయలుదేరి తన త్యాగ గుణానికి పదును పెట్టించింది. అతను చేయవలసిన పని మెదడులో తళుక్కున మెరిసింది. కొందరి అంచనాలను తారుమారు చేస్తూ సుబ్బరాజు ఒక గట్టి నిర్ణయం తీసుకున్నాడు.

-------------

"సుబ్బరాజు గారూ.... ఇంట్లో అలా ఆలోచిస్తూ కూర్చుంటే ఎలా?" ఒక మంచి నిర్ణయం తీసుకున్నారు. ఇక పదే పదే దాని గురించి ఆలోచించి ఉపయోగం లేదు. పదండి మంత్రిగారు వచ్చే వేళయింది" అన్నాడు సర్పంచ్.

సర్పంచ్ మాటలతో ఉలిక్కిపడ్డ సుబ్బరాజు తన ఆలోచనల నుండి తేరుకుని "ఆఁ వస్తున్నా పదండి" అంటూ బంధు, మిత్రులతో కలిసి బయలుదేరాడు సుబ్బరాజు.

సుబ్బరాజు వంద ఎకరాల కొబ్బరి తోట జనంతో కిటకిటలాడుతుంది. తోట మధ్యలో పెద్ద వేదిక ఏర్పాటు చేయబడింది. వచ్చిన వారందరికి పెద్ద మొత్తంలో భోజన ఏర్పాట్లు చేయబడ్డాయి. సుబ్బరాజు మనస్సు విషాదఛాయల్లో మునిగి వుంటే, అక్కడకు చేరిన ప్రజల్లోనూ, రాజకీయ నాయకుల్లోనూ, గ్రామ పెద్దల్లోనూ పండగ వాతావరణం నెలకొని ఉంది.

నిర్ణయించిన సమయానికి రెండుగంటలు ఆలస్యంగా మంత్రిగారు వచ్చారు. సభావేదిక పెద్దలతో నిండిపోయింది. వేదపండితుల మంత్రపఠనంతో అక్కడి వాతావరణం పూర్తిగా మారిపోయింది. సభా ప్రారంభానికి సూచనగా సర్పంచ్ దీప ప్రజ్వలన కార్యక్రమం పూర్తిచేసిన తరువాత అధికారుల సమక్షంలో సుబ్బరాజు పక్షాన, ప్రభుత్వ పక్షాన ముఖ్యమైన సంతకాల కార్యక్రమం పూర్తయింది. వేదిక ప్రక్కన ఉన్న సరస్వతమ్మ గారి పెద్ద తైలవర్ణ చిత్రాన్ని ఆవిష్కరించిన తరువాత మంత్రిగారు వేదిక గోడను కప్పి ఉంచిన తెరను తొలగించారు. అందమైన పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాసిన బ్యానరు బయటకు కన్పించింది.

అది చూసిన సుబ్బరాజుకి కన్నీళ్ళ పర్యంతం అయింది.

ఆ బ్యానరు మీద -

'శ్రీమతి సరస్వతమ్మ మెమోరియల్ ప్రభుత్వ కొబ్బరి పరిశోధనా కేంద్రం' అని వ్రాసి ఉంది.

■



March 2010_Prasthanam.pmd 15 2/25/2003, 12:37 PM

## కవిత

# పిడికిలి ఎత్తాల్సిందే

బద్దినాగేశ్వరరావు



తూరుపు రేకలు విచ్చుకోకముందే
కాకుల్ని తట్టిలేపే
తొలికోడి కూతవయ్యేవు
ఉడుపులకీ కోతలకీ
ఉడుంపట్టువయ్యేవు
ఏడాది చెమటనీ
కల్లంలో రాశిగా చూసుకొని
సంతృప్తి తేన్పుతో
తన్మయత్వం చుట్టవయ్యేవు
తాడి పెండికీ చింతతోపుకీ మాగాణీకీ
మకుటంలేని మారాజువయ్యేవు
పెళ్లిళ్ళకీ చావులకీ బీదా బిక్కీ
కోరుకున్న చెట్ల కానుకవయ్యేవు
లెవీదారుడిగా నాడు కీర్తిపతాకం
ఇప్పుడు బతుకు బొంగరం గిరికీలతో
నీ మనుగడ హెవీ భారం
నాడు చినుకు చకోరానవి
నేడు బతుకు తెరువుకోసం పడిగాపులు
అయ్యో నా దేశపు వెన్నెముకా
పడమటి తంత్రాల గాలిలో
కాలికింద నేలమంచులా కరిగి
నిట్టనిలువునా ముంచేసిందా
భూమిని చిత్తడి చేయాల్సిన చినుకులు
భూమి కానక
నీ హృదయాన్ని ఆశ్రయించేయా
అయినా గానీ నీధైర్యం పతాకని
అవనతం చెయ్యొద్దు
కన్నీటిని పన్నీటిగా మార్చేదిశగా
అందరం పయనిద్దాం
ఆశల వరివెన్ను వెన్నుదన్నుగా విరియాల్సిందే
అందుకోసం అందరం ఏకొన్ముఖంగా
పిడికిలి ఎత్తాల్సిందే

---

# సైనికుడు

పి. లక్ష్మణ్‌రావు



కెరటాల్లా ఎగిసిపడే వాడి ఉచ్ఛ్వాసతో
ఒంటరితనం
సరిహద్దుల్లో ఆత్మ విశ్వాసమై
కాపలా కాస్తుంది
నిప్పులు చెరిగేవాడి నిశ్వాసతో
అక్కడ చల్లగాలి
వెచ్చని దుప్పటి కప్పుకుంటుంది
బంధూకాల సందులగుండా
వాడుచేసిన కవాతు
మరఫిరంగై శత్రుగుండెల్ని ఛేధిస్తుంది
హద్దుల రేఖలపై
వాడిచూపుల తూటాలు
అప్రమత్తంగా యుద్ధతంత్రాన్ని
లిఖిస్తూనే ఉంటాయి
అలసిన ఒక వీరజవానుకు విశ్రాంతినిచ్చి
చప్పుడు చెయ్యని కంటిరెప్ప
మరో వీరజవానై బాధ్యతను మోస్తుంది !
చక్రభ్రమణ కాపలా క్రమంలో వాడు
జనజీవనంపై శాంతి రేఖల్ని గీసే
ప్రత్యక్షదైవం నేడు !

---

# నానీలు

అనూరాధ రామకృష్ణ

సూర్యుడు
సిగరెట్ తాగుతున్నాడు,
పొగ మేఘాలు – మేఘాలుగా !

పూలల్లో –
మధువులు నిండాయి
మైకంగా తలలూపుతున్నాయి !

తీర్థయాత్ర,
పుణ్యానికి
అదో మాత్ర !

ఆకాశంలో
పచ్చని పైరు
చిలుకల గుంపు !

చెట్టును ఎవరు –
తడిమారో,
సిగ్గుతో తీగమెలికలైంది !



చెట్టును ఎవరో
ముద్దాడారు,
ఎర్రని ముద్ద మందారాలుగా!!

చెట్టు పరిమళం
రాసుకుందేమో,
పూల నుండి సువాసన !



# శ్రీశ్రీ కి పిల్లలంటే ప్రాణం

## సరోజా శ్రీశ్రీ ఇంటర్వ్యూ

***మీరు ఎక్కువగా అమెరికాలోనే ఉంటున్నారా?***

అబ్బాయి అక్కడే ఉంటాడు. మరి నేను ఇంక అక్కడే కదా ఉండాల్సింది. ఈ మధ్య అక్కడ కూడా పరిస్థితులు ఏమీ బాలేదు. వెళ్ళిపోదాం రా అంటున్నాను.

***మీ పిల్లల గురించి చెప్పండి?***

మాకు నలుగురు పిల్లలు. ముగ్గురు కూతుర్లు. ఒక కొడుకు. పెద్దమ్మాయి మంజుల. రెండో అమ్మాయి మంగళ. ఆ తర్వాత కొడుకు వెంకటరమణ. శ్రీశ్రీ వాళ్ల నాన్నగారి పేరు వచ్చేటట్టుగా శ్రీరంగం వెంకటరమణ అని అబ్బాయికి పేరు పెట్టారు. శ్రీశ్రీ పేరుమీద వెబ్‌సైట్ కూడా నిర్వహిస్తున్నాడు. ఇక చివరి అమ్మాయి మాల.

***పిల్లలు ఇప్పుడేం చేస్తున్నారు?***

మా పెద్దమ్మాయి మంజుల ఐ.ఎ.ఎస్. రెండో అమ్మాయి మంగళ, అల్లుడు ఇద్దరూ అమెరికాలో కంపెనీలలో డైరెక్టర్స్‌గా ఉన్నారు. కొడుకు వెంకటరమణ అక్కడే మంచి హోదాలో ఉన్నాడు. ఇక చిన్నమ్మాయి మాల చెన్నైలో హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తుంది. పాండిచ్చేరి ప్రభుత్వానికి కూడా న్యాయవాదిగా ఉంది. పిల్లలంతా కూడా బాగానే ఉన్నారు.

***మీ కుటుంబ వివరాలు చెప్పండి?***

మేము ఆరుగురం అక్కచెల్లెల్లం. నేను 1942లో పుట్టాను. నేను రెండో దాన్ని. నా తర్వాత రాజబాబు భార్య, అమ్ములు, గాయని రోమోల. మాకు ఒక తమ్ముడు కృష్ణారావు. వాడికి శ్రీశ్రీ అంటే విపరీతమైన ఇష్టం. వాడిని కదిపితే ఇప్పుడు మనల్ని మాట్లాడనియ్యడు.

***శ్రీశ్రీ దినచర్య ఎలా ఉండేది?***

ఆయన్ని ఉదయం 8 గంటల నుండి లేపుతూనే ఉండేదాన్ని. 11 గంటలకు లేచేవారు. టిఫిన్ ముగించి సినిమా కంపెనీలకు వెళ్ళేవాళ్ళు. మధ్యాహ్నం భోజనం కోసం పెద్దావిడ దగ్గరకు ఒంటిగంటకు వెళ్ళేవారు. అక్కడే భోజనం చేసి పనిచూసుకుని సాయంకాలం వచ్చేవారు. పగలంతా కష్టపడే వారు. తాగి రాసేవారు కాదు. ఆయన ఎక్కువగా డైరెక్ట్ సినిమాల పాటలకు పనిచేసేవారు. నేను డబ్బింగ్ పిక్చర్స్ పని చూసేదాన్ని. డబ్బింగ్ సినిమాలకు సంబంధించి స్క్రిప్ట్ రాయటం వంటి పనులన్నీ వారే నాకు పర్‌ఫెక్ట్‌గా నేర్పించారు. సావిత్రి, జగ్గయ్య, రంగారావు, భానుమతి, కన్నాంబ, పద్మనాభం, రాజబాబు వాళ్ళ క్యారెక్టర్స్ వాళ్ళే డబ్బింగ్ చెప్పేవారు. ఆ పని నేను చూసేదాన్ని. పదివేలతో ప్రారంభమయి ఇరవై వేలపైదాకా ఇచ్చేవారు. ముందు శ్రీశ్రీ గారు ఇల్లు కొనుక్కున్నారు. తర్వాత కారు. ఆ తర్వాత నేను కూడా ఇల్లు కారు కొనుక్కున్నాను.

***మీ పరిచయం గురించి...?***

మా దగ్గర బంధువులయిన సంగీత దర్శకులు చలపతిరావు గారి దగ్గర నేను గాయనిగా పనిచేసేదాన్ని. ఒకసారి పాటరికార్డింగ్ చేస్తుండగా నేను ఒక చరణంలోని 'తలకాయ' అనే పదాన్ని తలకయ్య అని పాడుతుంటే అది విన్న శ్రీశ్రీ గారు సిగరెట్ దమ్ములాగుతూ నా దగ్గరకు వచ్చారు. నాకు శ్రీశ్రీ గారు అప్పటికి తెలియదు. నేను పాడే పాట వారే రాశారట. ఆయన గట్టిగా అరిచేసరికి నేను బేర్‌మన్నాను. అప్పుడు శ్రీశ్రీ గారు డబ్బింగ్ సినిమాలకు స్క్రిప్టు రాసేవారు. చలపతిరావు గారు, శ్రీశ్రీ గారితో మాట్లాడి నన్ను తనకు అసిస్టెంట్‌గా పెట్టుకోమని అడిగితే ఆయన సరే అని భగవద్గీత, భాగవతం స్క్రిప్టు రాయమన్నారు. అది ఐదువందల పేజీల స్క్రిప్టు. పని ప్రారంభించిన మొదటిరోజు నా దగ్గరకు శ్రీశ్రీ వచ్చారు. అప్పటికి నేను పేపర్లు, కాగితాలు టేబుల్ మీద సర్దాను. రాయటం ఇంకా ప్రారంభించలేదు. "ఏంటీ ఇంకా మొదలే పెట్టలేదు. ఇలా అయితే ఎప్పటికి రాస్తావు' అని విసుక్కున్నారు. నాకు ఏడుపు వచ్చేసింది. మొత్తానికి పట్టుదలతో నిద్ర, తిండికూడా లక్ష్యపెట్టకుండా మూడురోజుల్లో కష్టపడి మూడు కాపీలు రాసేశాను. చలపతిరావుగారితో 'ఆ అమ్మాయి పని విషయంలో పట్టదలగల మనిషిలా ఉందే. చాలా బాగా రాసింది. తిండి, నిద్రాలేక నీరసించిపోయింది. కాస్త రెస్ట్ తీసుకోమనండి' అని శ్రీశ్రీ అన్నారుట. నాకు భలే సంతోషం కలిగింది. ఆ ముక్క ఏదో నాతో అంటే ఇంకా ఎంత బావుండు అనుకున్నాను. గంధర్వ కన్య సినిమాకు ఆయన దగ్గర అసిస్టెంట్‌గా చేరాను. ఆ తర్వాత మా ఇద్దరికీ అలా కలిసిపోయింది. అదే ప్రేమనుకున్నాం. మా నాన్నతో 'సరోజకు' వేరే పెళ్ళి చేయడానికి



March 2010_Prasthanam.pmd 17 2/25/2003, 12:37 PM

వీల్లేదు. సరోజ నాది' అన్నారు శ్రీశ్రీ. అలా మా పెళ్ళి అయిపోయింది. 1959లో మా పెళ్ళి జరిగింది.

***శ్రీశ్రీ పిల్లలతో ఎలా ఉండేవారు?***

ఆయనకి పిల్లలంటే పంచప్రాణాలు. ఇంట్లో పిల్లలతో చాలా సరదాగా ఉండేవారు. పిల్లలు చిన్నప్పుడు వాళ్ళ నాన్న తలమీద కెక్కి శివతాండవం ఆడేవారు. పిల్లలను ఎప్పుడూ బీచ్‌కి తీసుకెళుతుండేవారు.

***ఆర్థిక పరిస్థితుల గురించి చెప్పండి?***

నా పరిచయం ముందు చాలా ఆర్థిక ఇబ్బందులు పడేవారు. వారు చిన్నప్పుడు ఐశ్వర్యంలో బ్రతికారనుకోండి. నేను వచ్చింతర్వాత ఇద్దరం బాగా కష్టపడేవాళ్ళం. తను బాగా సంపాదించేవారు. లక్షలు తెచ్చి నా చేతిలో పోసేవారు. ఎప్పుడూ ఆ డబ్బులు ఏవి? అన్న ప్రశ్న వేయలేదు. తన జేబులో ఎప్పుడూ రెండు, మూడు వందలు తన జేబులో ఉంచేదాన్ని. ఎప్పుడూ వేలు ఇచ్చేదాన్ని కాదు. తను ఏమీ అనేవారు కాదు. కానీ 'సరోజా నాకు పిల్లల చదువు, వాళ్ళ బాధ్యత ఏమీ తెలియదు. అన్నీ నువ్వే చూసుకోవాలి' అనేవారు. చివర్లో ఇల్లు తాకట్టుపడి అప్పుల పాలయ్యినప్పుడు మాత్రం శ్రీశ్రీ గారి అభిమానులే మమ్మల్ని ఒడ్డున పడేసారు. ముఖ్యంగా వనపర్తి బాలకృష్ణ గారి గురించి చెప్పుకోవాలి. పెద్ద సభ జరిపి శ్రీశ్రీకి సన్మానం చేసారు. అలాగే హైదరాబాద్‌లో ఆయన అభిమానులు సభ జరిపితే ఒకావిడ తన చేతి బంగారు గాజులు అక్కడ ఉంచిన హుండీలో వేసింది.

***శ్రీశ్రీ దానధర్మాలు చేసేవారంటారు...***

ఎవరైనా చదువుకునే పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో వస్తే, తను నా దగ్గరకొచ్చి అడిగేవారు. ఏవో చిన్న చిన్న సహాయాలు చేసేవాళ్ళం. కానీ, వేలు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. కానీ, ఒకసారి ఒకాయనకి ఇరవైవేలు ఇచ్చాం. నేను ఇవ్వనంటే శ్రీశ్రీ గారే 'సరోజా అతను చాలా ఇబ్బందుల్లో ఉన్నాడు. ఎప్పుడూ అడగలేదు' అంటే నా గాజులు తాకట్టు పెట్టి డబ్బు తెచ్చి ఇచ్చాం. ఆ బాకీయే చివరికి మా తలమీదకొచ్చింది. వడ్డీల మీద వడ్డీలై అది తీర్చడానికి నానా కష్టాలూ పడ్డాం.

***శ్రీశ్రీకి మతిభ్రమణం గురించి....?***

నేను కలిసింతర్వాత అలాంటిదేమీ లేదు. అయితే మీరన్నట్టు అంతకుముందు అలాంటిది జరిగిందని విన్నాను. ఆ సమయంలో ఆరుద్ర కాదు కానీ అనిసెట్టి గారు సహాయపడ్డారని శ్రీశ్రీ ఒకసారి చెప్పారు.

***శ్రీశ్రీకి అతి సన్నిహితంగా ఉన్నవాళ్ళ గురించి ....?***

పద్మాలయ హనుమంతరావు గారు, అన్నపూర్ణ పిక్చర్స్, మధుసూదనరావు గారు, విశ్వశాంతి విశ్వేశ్వరరావు గారు. అలాగే జగపతి పిక్చర్స్ వారు ఇంకొందరు.

***శ్రీశ్రీ గారి విదేశీ ప్రయాణాలగురించి...?***

శ్రీశ్రీ గారికి చైనా అంటే చాలా ఇష్టం. ఎంతిష్టం అంటే చైనా వెళ్ళడం కోసం మూడుసార్లు తీవ్రంగా ప్రయత్నం చేసారు. రెండుసార్లు వీసా రాక తప్పిపోయింది. ఆఖరుకి మూడోసారి ప్రయత్నం ఫలించింది. చైనాకు సంబంధించి 'చైనా యానం' పుస్తకం కూడా రాసారు.

***శ్రీశ్రీ ఆఖరి రోజులు?***

శ్రీశ్రీ గారు మరణించిన తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు నన్ను జీవితాంతం బాధపడేటట్లుగా చేసాయి. వాటి గురించి చెప్పాలి. అందరూ కాదు కానీ, ఒక పత్రికలో ఆస్పత్రిలో శ్రీశ్రీ దిక్కులేకుండా పడి ఉన్నాడని రాశారు. నిజానికి ఆ రోజు ఆయన చనిపోయిన రోజు. మద్రాసులోని జనరల్ హాస్పిటల్‌లో మినిస్టర్ వార్డులో ఉంచాం ఆయన్ని. చిట్టూరు సత్యనారాయణగారి రికమండేషన్‌తో అక్కడ చేర్పించాం. మా పెద్దమ్మాయి క్యారియర్ తెచ్చేది హాస్పిటల్‌కి. నేను ఆయన దగ్గరే ఉండేదాన్ని. ఆ రోజు తను 'కాస్త బాగానే ఉన్నాను కదా నువ్వు ఒకసారి ఇంటికెళ్ళి రా' అన్నారు. మిమ్మల్ని ఇలాగుంచి నేను ఇంటికి వెళ్ళను' అన్నాను. 'నాకేమీ కాదు. గుండెసి కాల్చినా శ్రీశ్రీ అప్పుడే చావడు' అన్నారు. 'లేదు. నేను వెళ్ళను' అన్నాను. ఆయన కోపంగా 'నా మాట కూడా వినవా. ఎలా తయారయ్యావో చూడు. వెళ్ళు' అని గదమాయించారు. ఇక ఆయన మాట కాదనలేక మా అమ్మాయి కాంప్లెయిన్ తెస్తే అది తాగించి నేను ఇంటికి వెళ్ళాను. స్నానం, భోజనం అదీ చేసి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాల్సిన సామానంతా హాలులో ఉంచి బాత్‌రూమ్‌కి వెళ్ళాను. 'అమ్మా అప్ప చనిపోయాడని అరిచింది. నేను షాక్‌తో అక్కడే పడిపోయాను. తలకి దెబ్బ కూడా తగిలింది. ఆయన అనారోగ్యంతో మేము బాధలో ఉంటే, ఆయన చనిపోయినప్పుడు ఈ పత్రిక రాసిన రాతలకి నేను చాలా బాధపడ్డాను. అలా అని నేను మీడియాను విమర్శించడం లేదు.

***శ్రీశ్రీ తన మాటల్లో చాలా పుస్తకాల్లోని విషయాలు కంఠోపాఠంగా చెప్పేవారు కదా? అంటే పుస్తకాలని చాలాసేపు చదివేవారా?***

అదేం లేదు. ఆయన తన మహాప్రస్థానాన్ని తనే ఇంగ్లీషులో అనువాదం చేసారు. సమయం చాలేది కాదు. పుస్తకాలు చాలా ఎక్కువగా చదివేవారు.

**సినిమాలు బాగా చూసేవారా?**

తెలుగు సినిమాలు తక్కువ. ఎక్కువగా ఇంగ్లీషు సినిమాలు బాగా చూసేవారు.

**ఆయన మరణం గురించి...?**

శ్రీశ్రీ చివరి కోరిక తన మరణం తర్వాత తన శరీరాన్ని విశాఖ జనరల్ హాస్పిటల్‌కు ఇవ్వాలని వీలునామా కూడా రాశారు. అయితే నేను, మా పిల్లలు కూడా దానికి ఒప్పుకోలేదు. ఆయన శరీరాన్ని ముక్కలు చేయడం మాకు ఇష్టం లేకపోయింది. అది ఒక్కటే ఆయన జీవితంలో నేను ఆయన్ని ధిక్కరించిన విషయం.

***శ్రీశ్రీ చివరి రచనలు...***

నేటి భారతం సినిమాలోని 'భారతమాతను నేను బందీనై పడి వున్నాను' అనే పాట మంచం మీద ఉండే రాసి ఇచ్చారు.

***శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాలపై మీ స్పందన...***

మరోసారి తెలుగు ప్రజలు శ్రీశ్రీపై వారి అభిమానాన్ని చాటుకుంటున్నారు. వారి అభిమానం ముందు నేను చాలా చిన్నదాన్ని. శ్రీశ్రీ ప్రజల గుండెల్లో గొప్ప స్థానం పొందారనడానికి ఈ శతజయంతి సంవత్సరంలో జరుగుతున్న శ్రీశ్రీ సభలూ, సమావేశాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

***- వీరప్రసాద్***



March 2010_Prasthanam.pmd 18 2/25/2003, 12:37 PM

## కవితా సౌందర్యం




# వసంతంతో కవిత్వ సంభాషణం !

డాక్టర్ రాధేయ

*మనిషి చైతన్యశీలుడై ఉజ్వలమైన తెలివితేటలతో లోతుగా ఆలోచించగల స్వభావంతో జీవించమని 'ఉగాది' సందేశమిస్తుంది. పాతబడ్డ భావాలను, మురికి కంపు ఆలోచనలను మనిషి వదిలించుకోవాలని నిర్మాణాత్మక, ప్రగతిశీల భావాలతో కొత్తదనానికి స్వాగతం పలకాలన్నది ఉగాది అంతరార్ధం.*

ఒక జాతి జీవనం ఆయాకాలాల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతిరూపంగా సాగిపోతుంది. మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార, వ్యవహారాలు మన పండుగలు. నిరంతరం ఒత్తిళ్ళతో, బాధ్యతలతో విసిగి వేసారే మనిషి ఈ యాంత్రిక జీవనం నుంచి కొత్త మార్పును, స్వేచ్ఛను, సంతోషాన్ని వెదుక్కునే ప్రయత్నం చేస్తుంటాడు. ఈ క్రమంలోనే పండుగలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాడు.

తెలుగు పంచాంగం ప్రకారం మొదటి రోజుగా పరిగణించే చైత్రశుద్ధ పాద్యమినాడు జరుపుకునే పండుగ 'ఉగాది' కొత్త సంవత్సరంలో వచ్చే తొలిపండుగ ఉగాది. కనుక ఉగాదికి ఎంతో ప్రాధాన్యత వుంది.

మానవ జీవనగమనంలో ఒక్కొక్క ఉగాది ఒక్కొక్క మైలురాయి. మానవునితో పాటు యావత్ జీవరాశిని, ప్రకృతిని చైతన్యం చేసేది ఉగాది. ఉగాది మన తెలుగువారి సాంస్కృతిక ఉదాత్త భావనగా పరిగణిస్తారు.

వసంత ఋతువులో ఉగాది వస్తుంది. ఈ ఋతువులో ప్రకృతి యావత్ నవనవోన్మేషమై శోభిల్లుతుంది. సమస్త వృక్ష జాతులు, లతలు, కొత్త చిగుళ్ళు తొడుగుతాయి. ఫలపుష్పాలచేత విరాజిల్లుతాయి. వసంత గమనంతో పృధ్వీతలం యావత్తూ పులకిస్తుంది. ఆమని ఏమని పలకరిస్తుందోనని సకలప్రాణి కోటి వేయికళ్ళతో నిరీక్షిస్తుంది. గున్న మామిడి కొమ్మమాటున కోకిల వసంత గాన మాలపిస్తుంది. ప్రకృతిలోని అందమైన మార్పుని సొగసుగా స్వాగతించడం ఈ పండుగ ప్రత్యేకత.

మనిషి చైతన్యశీలుడై ఉజ్వలమైన తెలివితేటలతో లోతుగా ఆలోచించగల స్వభావంతో జీవించమని 'ఉగాది' సందేశమిస్తుంది. పాతబడ్డ భావాలను, మురికి కంపు ఆలోచనలను మనిషి వదిలించుకోవాలని నిర్మాణాత్మక, ప్రగతిశీల భావాలతో కొత్తదనానికి స్వాగతం పలకాలన్నది ఉగాది అంతరార్ధం.

''వసంత సుఖం యథాతథా అస్మిన్నితి'' అనగా వసంతకాలంలో ప్రజలందరూ సుఖంగా ఉంటారని అర్ధం.

సంప్రదాయ బద్ధమైన 'ఉగాది' వర్తమాన తరానికి విచిత్రంగా తోచవచ్చు. ఈ ఉగాది శోభ గ్రామసీమలలో ఎక్కువగా కనిపిస్తుంది. జనవరిలో వేసే పంటలు ఇంటికి వచ్చేపండుగగా రైతులు ఉగాదిని భావిస్తారు.

తిధి, వార, నక్షత్ర యోగ, కరణాలు ఈ ఐదింటిని పంచాంగం అంటారు. కొత్త సంవత్సరంలో జరగబోయే విశేషాలను పంచాంగ శ్రవణంలో చెప్పుకుంటారు. ఉగాది రోజున సేవించే 'ఉగాది పచ్చడి'లో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ఆయుర్వేద శాస్త్ర రీత్యాకూడా ఉగాది పచ్చడికి ఎంతో విశిష్టత వుంది. తెలుగు సాహిత్యంలో ఉగాది ప్రస్తావన ప్రముఖంగా ఉంది. వసంతాన్ని ఉగాదితో జతచేసి కవులెందరో వర్ణించారు. ఆది కవి నన్నయ నుండి ఆధునిక కవుల వరకూ ఈ వసంత శోభను తమ కావ్యాలలో వర్ణించారు. వర్తమాన కాలంలో పద్య, గేయ, వచన కవితలతో ఉగాది, వసంత వైభవాన్ని ఎలా వర్ణిస్తున్నారో వివరించే ప్రయత్నమే ఈ వ్యాసం. విరోధికి వీడ్కోలు 'వికృతి'కి స్వాగతం పలికే కవుల కవిత్వాన్ని ఓసారి గుర్తుచేసుకుందాం! ఆశాజీవులు కొందరు, ఆవేదనా పరులు మరికొందరూ, ప్రగతిశీలవాదులు ఇంకొందరు. వైవిధ్యం ఉగాది కవిత్వం.

"వగరు చివురుల మెక్కి / ఎలకోయిలలు / వలపురాగాలు ప్రకృతికి నేర్ప / చిగురుటాకులు తొడిగి / ప్రతి తరువు పచ్చదనాలు మెరయ / విరిసిన పూల నెత్తావుల పులుముక / రంగు పుట్టముల తొడిగి / నిన్న ఎరుగని వన్నె చిన్నెలు / నేడు తొంగిచూడ / చైత్రరథమెక్కి / సొగసుల సౌదామినిగా / ఆమని అరుదెంచె / "

**జి.కె. సుబ్రహ్మణ్యం**




March 2010_Prasthanam.pmd 19 2/25/2003, 12:37 PM

ఈ ఉగాది వసంతంలో తన జ్ఞాపకాల మూలాల్లోకి ప్రయాణం సాగిస్తున్నాడు కవి. జీవితం తన పరిధిని తానే నిర్ణయించుకొంటుంది. నీళ్ళ చినుకు ముత్యాలు అలంకరించుకున్న ముగ్ధ కన్యలా గోచరిస్తుంది.

"ఋతువు ఆకులకు రంగులు వేయడం / ఒక ప్రకృతి శిల్పం / ఇప్పుడు రంగులు నూత్న కావ్యాలు / నీటి బుగ్గల శ్రుతుల్లోంచి కొత్త రంగులు పుడుతున్నాయి / తొట్టి నిడివిని బట్టి వేరుపాకుతున్నట్టే / జీవితం తన పరిధిని తానే నిర్ణయించుకుంటుంది / నీళ్ళ చినుకు చినుకుగా ఆకుకొసల్లో నిలబడినప్పుడు / ముత్యాలు అలంకరించు కున్న ముగ్ధలా అనిపించింది / అందుకే జ్ఞాపకాల మూలాల్లోకి నా ప్రయాణం / "

**– డా॥ కత్తి పద్మారావు**

ఈ కవి 'తారణ' ఉగాదిని ప్రశ్నిస్తున్నాడు. ఓ చిన్న ప్రశ్నవేసి పెద్ద జవాబును రాబట్టాలని ఆశిస్తున్నాడు. ఎందరినడిగినా సమాధానం రాలేదు అయినా విసుగు చెందడం లేదు. ప్రతిఏటా ప్రతి ఉగాదినీ ప్రశ్నిస్తూనే వున్నాడు.

"తారణాఖ్య ఉగాది పురుషా ! చిన్న ప్రశ్న : జవాబు చెప్తావా ? / అ – ఆలు నేర్పే అయ్యవార్లకు డిగ్రీలు ట్రైనింగ్ అవసరమట / దే–శాన్ని ఏలే నాయకులకు అలాంటివక్కరలేదు, ఎందుకు ?/ వయసు మళ్ళిన ప్రభుత్వోద్యోగులకు ఓపికలుడిగెనంటూ / తీసివేసే ప్రభుత్వానికి ముసలి మంత్రులు కానరారా / ఈ కులంలో పుట్ట బట్టే మాకు చదివే అవకాశం / దొరకలేదని పిల్లలంటే భరత భూమికి క్షేమమా / మందిరమ్మో, మసీదో, ఏదైననేమి, అటుండనీ / రాముడికి అల్లాకు మానవరక్త తర్పణ మవసరమ్మా /

**– డా॥ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి**

ఈ కవయిత్రి వసంతలక్ష్మి అందాల శోభను అభివర్ణిస్తూ పరవశిస్తోంది. ఆమె మంజీరనాదాలు మంగళవాయిద్యంలా వినిపిస్తున్నాయి. విరిసిన ప్రతికుసుమం వినూత్నకాంతులతో మెరిసిపోతున్నది. గులాబీలు, మల్లెలు, మందారాలు, చామంతులు, కనకాంబరాలు, ముద్దబంతులు, సన్నజాజులు ఒకటేమిటి ప్రతి పుష్పరాజం తోటలో ఇంద్ర ధనస్సులా మెరిసిపోతుంది.

"పచ్చ చీర కట్టుకున్న వసంత ఋతువు / ఉగాది లక్ష్మిలా / నాతోటలో విహరిస్తూ కనిపించింది / ప్రతి పుష్పరాజం / నా తోటకి కొత్త అందాలను సంతరిస్తుంది / మామిడి కొమ్మలమాటున / గానం చేస్తున్న కోయిలమ్మ / కొత్త ఉగాదికి / సన్నాయి రాగాలను వినిపిస్తున్నది / ఆమని అందాలతో / నిండిన నా తోటంతా / ఇంద్రధనుస్సులా మెరిసిపోతున్నది /"

**– పాతూరి అన్నపూర్ణ**

ఉగాదికి శుభ స్వాగతం పల్కుతున్నాడీ కవి. భవిష్యత్ ఆశలకు స్వాగతం పల్కుతున్నాడు. ఈ కవికి ఉగాది సోయగాల ఆమనిగా అమృత వర్షిణిలా గోచరిస్తున్నది. మధుర భావ కవితల సౌదామినిగా, మధుర తరంగ సుమభామినిగా ఉగాది గోచరించిది వీరికి "భవితాశల పునాదీ స్వాగతం / భవ్య ఊసు ఉగాదీ సుస్వాగతం / చూతకొమ్మ – పూత పూసె / కోకిలమ్మ – కూతకూసె / వేపరెమ్మ – విందుచేసె / వెన్నెలమ్మ – వెలుగు నింపె / ప్రభవించిన సోయగాల ఆమనీ / పచరించిన మధురామృత వర్షిణీ / స్వాగతం – శుభ స్వాగతం /"

**– ఆచార్య శ్రీవత్స**

ఈ కవికి ఉగాది గ్రీష్మ హేమంతాల నిప్పులనడక. శ్వాసిస్తున్న చోటే తొంగి చూసే భయం. రుతువుల చక్రభ్రమణంలో సృష్టిలయల జీవనక్రీడ

"గ్రీష్మ హేమంతాల / నిప్పుల నడకలో / పెనవేసుకున్న / చలి చీకటిలో / ముంచెత్తిన / వర్షాలింగనంలోంచి / చిరుగాలి సవ్వఇకే / కదలిన / అంతరంగాల లోగిలిలో / అనేక వసంతాలు శిశిరాలు / శ్వాసించిన చోటే తొంగి చూసే భయం / ఒక్కోరుతువులో / తరతరాల నిరంతర / అనుభవయాత్ర / కొత్తరుతువుకు ప్రాణంపోసే / జీవనోత్సవ సంచలనం /"

**– నిఖిలేశ్వర్**

పల్లె సీమల కరువుతో వలసబోయిన వసంతుని కోసం కోయిలమ్మ వెదుకుతూ వుంది. మామిడాకుకు గిరాకీ. వేపపూత అమెరికా వాడి పేటెంటు గుర్తుకొస్తుంది. సంసార సాగరంలో ఆటు పోట్లు అయినా దిగులు పడొద్దని ఉగాది ఆశల పునాదిగా సాగిపొమ్మంటున్నాడు ఈ కవి –

"పల్లెలో కరువు కరాళనృత్యం చేస్తూంటే / వలసబోయిన వసంతునికోసం / కోయిలమ్మ వెదుకుతూంది / పూటకూలీ కోసం పాట్లు / పొట్ట తిప్పల కోసం అగచాట్లు / సగటు జీవితాలు అడ్డాల పాలైనాయి / మామిడాకుకు ఈ రోజు భలే గిరాకీ / వేపపూత కోద్దామంటే / ఆమెరికా వాడి పేటెంటు గుర్తొచ్చింది"/

**– కొలనుపాక మురళీధర రావు**

ఈ కవికి శృతి తప్పిన లయ గీతం ఉగాది. వసంత రాగంలో విషాదగీతం. స్వార్థం ఏనాటికీ సహజీవనం సాగించలేదు. అంతరాలు వీడి ఆంతర్యాలు ఒకటిగ చేసి కలిసికట్టుగ ముందుకు సాగినప్పుడే నిజమైన ఉగాది. అప్పుడే కోకిలమ్మ పాట శ్రావ్యంగా వినిపిస్తుంది. –

"కోకిలమ్మ గొంతులో / జీర వినిపిస్తున్నదెందుకో / వసంతరాగాలు వినిపించే వేళలో / విషాద గీతం వినిపిస్తోంది / కేలండర్లే మారినా, తిథులే మారినా / అంతరంగంలో మార్పు రావడం లేదు / మనిషి మనిషిగా ఎదగడంలేదు / సాటిమనిషిని సజావుగా మననీయడం లేదు / స్వార్థంతో రగిలే మనిషి / సహజీవనం సాగించేదెన్నడు / ఈ ఉగాది శుభవేళ / అంతరాలు వీడి / ఆంతర్యాలు ఒకటిగ చేసి / కలిసికట్టుగ ముందుకు సాగుదాం / అక్రమాలకు, అన్యాయాలకు స్వస్తి పలుకుదాం / అప్పుడే శృతి తప్పిన కోకిలమ్మ గొంతు / అమృతధారలు కురిపిస్తుంది /"

**– జింబో**

నా కలల ప్రపంచం మీద దాడి చేసింది ఈ ఉగాది. మావసంతం వలసబోయింది. అనుభూతుల ఆనవాళ్ళు లేవు. మా గ్రామీణ జీవన సౌందర్యాన్ని కాలరాస్తున్న ఈ కరువులో కొట్టుమిట్టాడుతున్నాం అంటున్నాడీ కవి –



March 2010_Prasthanam.pmd 20 2/25/2003, 12:37 PM

"డియర్ ఉగాదీ / నీకు మనసంటూ ఉంటే మా స్వగతం విను / కాలం కన్నెర్రజేసి మా కలల ప్రపంచమ్మీద / కరువు దాడి చేసింది / రుతువులన్నీ ప్రతిపక్షాలై / మా వసంతం వలసబోయింది / అనుభూతులే మిగలని జీవన వైరుధ్యాల మధ్య / పూలతెనెలన్నీ చేదెక్కినాయి / కరుడు కట్టిన ఈ కసాయి కరువు ముందు / మేం ఓడిపోక తప్పటం లేదు / కాలం కక్షగట్టి ఏటేటా మానుదుట / కరువును తిరగరాస్తూంటే / వసంతుడైనా, మన్మథుడైనా / మాగడపల్లోంచీ వాకౌట్ చెయ్యాల్సిందే /"

**–డా॥ రాధేయ**

ఆ వసంతం మళ్ళీ రాదు. రెప్పలు విప్పార్చుకున్న రాగాలు పాటల పల్లవులు లేవు. కోకిల స్వరం వినిపించదు. పండుగంటే ఇల్లంతా ఓ పూల రుతువు. ప్రపంచ విహారంలో కవిత్వపు కలనేత. చెట్టు, పిట్ట, ఆకాశం, వసంతం, వెలుగు రేకల్లో పరవశించి పోతాయి.

"ఉగాది ఉదయాన మామిడి తోపులో కోకిలలు కూసే నాటికి / తెల్లటి పల్చటి ఆ కాగితపు పొరమీద / అందమైన నీలిపువ్వుల అక్షరాల దొంతరలు / కవిత్వంగా ఆవిర్భవించేవి / ఆమె యిప్పుడు లేదు / ఆ కవి కోకిల యింట వసంతమూ లేదు / ఇంటి ముంగిట మామిడి చెట్టు / ఆకుల్ని మాత్రమే రాలుస్తూ నిలబడి ఉంది. చెట్టు మీద కోయిలకు ఏ పాట పాడాలో తెలియక / మౌనంగా దిగులుగా దిక్కులు చూస్తోంది /"

**– ఆదూరి వెంకట సీతారామమూర్తి**

మనదంతా అమాయికత్వమే. కొత్త వాగ్దానాలు నమ్ముతాం. కోకిలగానాన్ని బట్టి వసంతమని సంబరపడతాం. ఎన్ని ప్రభవలైనా, ఎన్ని అక్షయలైనా అమాయికంగా మోసపోతూనే వుంటాం. ఈ ఊరడింపుల కోసమే ఈఉగాదులు అంటున్న ఈ కావయిత్రి ఉగాది సందేశం ఇలా ఉంది –

"కొత్త వాగ్దానాలు విని వచ్చేదంతా / ప్రజాస్వామ్యమని / కోకిలగానాన్ని విని సంవత్సరమంతా ఇక / వసంతమేనని / ఎంత అమాయకంగా నమ్ముతాం మనం / ఎన్ని ప్రభవలు అక్షయల్దాకా గడిచినాఈ / మాయా గమనంలోనే నడుస్తూంటాం మనం / శ్రీముఖ వచ్చిందన గానే కొత్త ముఖం / వచ్చిందేమోనని ఆశగా అద్దంలో చూస్తాం / 'భావ' అంటే హమ్మయ్య ! ఇక / అంతా సద్భావనే అని సంబరపడతాం / ఈ ఊరడింపుల కోసమేనేమో ఉగాదులు / మోడల్లేరాలిన కొత్త చివుళ్ళు తొడగమని / వెన్ను పుట్టకముందే చెరకు తీపి చిక్కించుకున్నట్లు / వెన్ను వంగకముందే బ్రతుకు తీపి దక్కించుకోమనీ / మొగ్గ తొడిగే మొక్కలే దూతలుగా / ప్రకృతి పంపే సందేశమే ఉగాది / ప్రయత్నమే కదా మన వర ప్రసాది /"

**– పాటిబండ్ల రజని**

ఏడుపు గొట్టు పాపాయి మాదిరిగా వెక్కిళ్ళు పెడుతూనే వెళ్ళిపోయింది. నిన్నటి ఏడాది వేపపూత వేళ ఇక కొత్త సంవత్సరం నేడే విడుదల. అయోమయంగా నిన్నటి గాయాల్ని నిమురుకుంటూ మనమున్నాం. ప్రతి ఏడాదీ కొత్త ఆశ చిగురిస్తుంది జీవన వ్యామోహాన్ని పెంచుతుంది. కృశించిన సుఖాలు మకరందం కోసం ఆశపడతాయి –

"ఈ ఉగాది / జనార్ణవంపై కాలం విసిరిన చెటికెడు ఆనందపు విబూది / గతించిన తీపి సౌరభాలు / కృశించిన సుఖాల సుమసమూహాలూ / మన కోసం మకరందాన్ని మళ్ళీ అందిస్తాయా చెప్పు / ఇంత జరిగినా / ఏటికేడాదీ కష్టాలూ కన్నీళ్ళ కషాయాలూ తప్పవని తెలిసినా / పురిటి ఖర్చుకి నొచ్చుకుంటూనే / లేత నవ్వుల చిన్నారి బాలసారెకి ప్రణాళిక వేసే బంగారు తల్లిలా / శ్యామవతి భూమి వెదజల్లుతున్న వేపపూతను స్వాగతించక తప్పదు / షోకిల్లా కొత్తవత్సరం మన అనుమతితో కోయిల గళాన్ని విప్పదు /"

**– ఘంటశాల నిర్మల**

ఉగాది ఎప్పుడు ? రోజు రోజుకూ ధరలు పెంచేస్తూ జనాన్ని ఉగాది పచ్చడి చేస్తున్నప్పుడా? లెక్చరర్లూ, భవనాలు, పుస్తకాలు, సామాగ్రి లేకుండా కాలేజీలు నడుపుతున్నాం జనాన్ని నిలువునా ముంచేసి బొజ్జలు నింపుకోవడమే ఉగాది అంటున్నాడీ కవి –

"కోయిల పాడటం లేదు / గొంతు పట్టుకుపోయింది / పక్షులకు ఆశ్రయమిచ్చిన మామిడిచెట్ల మీద / ఇపుడు సోదా లెక్కువైనాయి / పంచాంగాల్లో, తిథుల్లో, నక్షత్రాల్లో / ఉగాది లేదురా నాయనలారా / కబ్జాసురుల పొట్టలు చీల్చుకొని / మైదానాలూ కొండలూ అడవులూ బయటపడ్డరోజు ఉగాది / ఈశాన్య నరమేధానికి శిక్షపడిన రోజు ఉగాది / విద్య వైద్యం ప్రతి మనిషికీ అందినరోజు ఉగాది / పూర్ణ వ్యక్తిత్వంతో కలం ఎత్తిన రోజు కవికి ఉగాది / సొంత గొంతుతో ఉద్యమించిన రోజు మనిషికి ఉగాది /"

**– డా॥ రావిరంగారావు**

తిండికి మొగం వాచినవాడికీ, కడుపు నిండా బిడ్డలుగలోనికి ఉగాది ఎట్లుంటదో తెలవదు. వాడికి దరిద్రం తప్ప సిగురాశలు, సిర్నవ్వులూ యాడుంటయ్. పండగొచ్చిందని ఎవరైనా గ్యాపకం సేత్తే తప్ప. వాడికేమీ తెలవదు. రాయలసీమ పేదోడి ఉగాది ఎలాగుంటదో కవి మాటల్లోనే –

బతుకు బాటలో / ఒగురుసూసి నోన్నేగానీ తీపు ఎరుగను / సేదు సూసినోన్నే గానీ సుగం ఎరగను / పులుపు జూసినోన్నే గాని పులకింత ఎరుగను / ఇంగనాకు తేర్లకి తిర్నాల్లకీ / పండగలకీ పబ్బాలకీ అరతమేం తెలిస్తింది / సెమ దోసుకోకుండా / ఇంగిర్సిన సెవట బొట్టుకు ఇలవ గడతాండాదా? / పెత్తనాలు మారతాండాయ్ గాని పేదోల్ల తల్రాతలు మారతాండాయా ? / ఉన్నోన్నీ లేనోన్నీ ఒగటి జెయ్యకపోతే / ఎన్ని వొగాదులొచ్చినా యాడిదిరా సిర్నవ్వు /"

**– వేంపల్లి అబ్దుల్ ఖాదర్**

వికసించిన మామిడిపూతలో కవి ఊహలు వాస్తవ దర్పణాలు అనుభూతులూ అభివ్యక్తులూ అన్నీ మారాల్సిందే పరిణామం అనివార్యం. విస్తరించే కాంక్రీటు కట్టడాలు పల్లెటూళ్ళను మింగేసన్తూంటే కోకిలపాటలెక్కడ? మావిచిగురు లెక్కడ? ఆమని ఆనవాళ్ళు లేవు అన్నీ మార్కెట్ సరుకులే నంటున్నాడు ఈ కవి –

"మావి పూతలున్నాయా? / వేపపువ్వులున్నాయా? / ఆమని అరుదెంచిన ఆనవాళ్ళు కనబడుతున్నాయా? / అన్నీ మార్కెట్ సరుకులే



March 2010_Prasthanam.pmd 21 2/25/2003, 12:37 PM

# పురాస్మృతులు

**ఏ. సూర్య ప్రకాశ్**

నా ప్రియమైన అలనాటి గ్రామం
నేను విడిచి వెళ్ళినప్పుడు ఎలా ఉందో
అచ్చు ఇంకా అలాగే ఉంది !

సూర్యోదయాలు సూర్యాస్తమయాలు మారలేదు
బాల్య స్వప్నాలన్నీ మళ్ళీ సాకారం చెంది
వరుసగా ఒకదాని పక్కన ఒకటి నిలిచి
నన్ను మురిపెంగా పిలిచినట్లనిపించింది
నా కళ్ళను సాదరంగా నిమిరినట్టనిపించిం
చెట్టూచేమా వాగూవంకా ఊరూవాడా
నా చెవుల్లో గుసగుసలాడి
నాకు కితకితలు పెడుతున్నట్లనిపించింది
ప్రతి వీధీ ఒక వీధి గాయకుడై
పురాస్మృతులు వినిపిస్తున్నట్లుంది
ఊరు మొగలో కోవెల
స్వాగతగీతం పాడింది
తొలివలపుల స్వీట్ నథింగ్స్ గుర్తొస్తున్నాయి
మల్లెల పరిమళాలు తోటంతా గుబాళిస్తున్నాయి



తొలికోడి కూసి నిద్రలేపుతున్నది
నా చిన్న నాటికలలన్నీ నన్ను కికురిస్తున్నాయి
ఎంకిపాటలోని బరువు మళ్ళీ
నా మాటకి తిరిగివచ్చింది
నేను ఈతలు నేర్చిన చెరువు మళ్ళీ నన్ను
తన అక్కున చేర్చుకుంది
శ్మశానంలో సమాధులైన మా పూర్వీకులందరూ
మళ్ళీ నన్ను ఆర్ద్రంగా పలకరించారు
చిన్ననాటి స్నేహాలన్నీ పురులు విప్పాయి
బడిపిల్లవాడి మేధస్సులో అల్లుకున్న గిజిగాని గూడు
పిల్లగాలికి అల్లనల్లన అటు ఇటు ఊగింది
పొంగమంచు నా కళ్ళను అలరిస్తున్నది
నాడు నాటిన మొక్కలన్నీ చెట్లై
పూలతో తలలూపుతున్నాయి.
నేను పోగొట్టుకున్న బాల్యం, ఆరంభ యవ్వనం
మళ్ళీ నన్ను చేరి కితకితలు పెడుతున్నాయి
నేను జుర్రుకున్న ఆనందంతో జ్ఞాపకాలుగా మిగుల్చుకొని
నేను పుట్టిన పల్లెపట్టును వదిలి
మళ్ళీ నగరారణ్యంలోకి ప్రవేశిస్తున్నాను !

---

/ ఉగాది పచ్చడిని కూడా / బహుళ జాతి కంపెనీల యాడ్‌లో చూడాల్సిందే / గోడపై వేలాడుతున్న పెయింటింగ్‌లోనే / పండుగ సంబరాన్ని వెదుక్కోవాల్సిందే / అడ్రస్ కోల్పోయిన పొలాలు / వలస కూలీలుగా పట్నం పోయిన రైతన్నలు / ఇంకెక్కడి వ్యవసాయం / ఎక్కడుంది మధుమాసం / ఇంకా ఎందుకు పాత పద్యాలనే రాస్తావు కవీ / పండగొచ్చిందని పులకిస్తావు కవీ /"

**డా॥ ఎస్వీ సత్యనారాయణ**

ఈ కవి కోయిలను వెదుక్కొంటూ బయలుదేరాడు. చెట్టూ పుట్టా ఊరు, వాడా, నగరం అంతటా గాలిస్తున్నాడు. వసంతంతో సహాచెట్టును, చెట్టుతో సహా కోయిలను సంతలో అమ్ముకునే వాళ్ళందర్నీ విచారిస్తున్నాడు. వివరాలు సేకరిస్తున్నాడు –

బాబూ ! గుబురు పూతల చిన్న చిన్న పిందెల చిగురుటాకుల మామిడి చెట్టును ఎక్కడైనా చూశారా / ఆ చెట్టు మీద నేను చిగురుమేతల కూతల / కోయిలను వెతుక్కోవాలి / ఎక్కడి చెట్టు / ఎక్కడి కోయిల / చెట్టులేని కాలమిది / కోయిల అవశేషాలు మ్యూజియంలో దొరుకుతాయేమొ / కూతను సి.డి.లో విని వసంతానందాన్ని పొందు / ఈ పాడుకాలంలో / కవి అరుదే / కోయిలా అరుదే /"

**– కందాళై రాఘవాచార్య**

కొత్త ఉదయం కోసం, కోయిల పాటకోసం ఈ కవి ఎదురుచూస్తున్నాడు. పరుగే జీవితమైన మనిషి పండుగల్ని మర్చిపోయాడు. కంప్యూటర్ ముందు మోకరిల్లిన మనిషికి కోయిలపాట వినే తీరికెక్కడ. మన సంస్కృతిని మనకు మర్చిపోకుండా రేపటి తరానికి సంస్కృతి బీజాల్ని మనమే నాటాలి ! "ఒకరు పిలిస్తే ఉగాది రాదు / ఎక్కడో గొంతెత్తితే కోయిల కూయదు / మన నరనరాల్లో సంస్కృతి ప్రవహించినప్పుడు / ఉగాది కొత్త వేకువై మనముందుంటుంది / వేల గొంతుల్ని ఒక్కటిగ కలిపి / కోయిల సంగీత ఝురుల్ని మన కోసం తెస్తుంది / ఆ కొత్త ఉదయం కోసం / ఆకోయిల పాట కోసం / మనమంత కళ్లల్లో ఇళ్లు కట్టుకొని ఎదురుచూద్దాం /"

**– చొక్కర తాతారావు**

ఇలా రాసుకుంటూ పోతే 'ఉగాది కవిత్వం' పేజీలకు చాలదు. పుస్తకాలకు పట్టదు. ఉగాది మీద రాయని కవి ఎవదూ లేదు. ప్రతి కవీ తన అనుభూతుల్ని, అనుభవాల్నీ ఉగాదితో పంచుకున్నవాడే. వసంతంతో స్నేహంచేయాలని ఆరాటపడినవాడే. కలలు కొందరివి, కన్నీళ్ళు కొందరివి. ఆశలు కొందరివి, గాయాలు మరికొందరివి, నిజానికి మానవ సంబంధాలన్నీ సంతోష, దుఃఖానుభూతుల సమ్మేళనాలే !

"వసంతాన్ని వర్ణించని కవి జీవితం వ్యర్థం" అన్నాడో ప్రాచీనకవి వసంత ఋతువులో కోయిల పాటతోనే తెలుగు సంవత్సరాది ఆరంభమవుతుంది. ఆంధ్రుల మనసుల్లో వసంతానికి, ఆమని కోయిల పాటకు, మావిచిగురు పూతలకు ఓ ప్రత్యేకత కూడావుంది.

ఇలా తెలుగునాడు సకలవిధ సంతోషాలతో ఉగాదిని జరుపుకోవడం శతాబ్దాల తరబడి కొనసాగుతూ వస్తున్న ఒక విశిష్ట సంప్రదాయం. ఒక్క మాటలో చెప్పాలంటే ఉగాది పర్వం తెలుగు ప్రజల సంస్కృతీ వైభవానికి ఒక కాంతి దీపం.

■



March 2010_Prasthanam.pmd 22 2/25/2003, 12:37 PM

కబీర్‌వాణి

## రెక్కల లోగిలి

**కిరణ్‌బాబు**



గతాన్ని
తిరస్కరించకు
దానిని
గౌరవించు–

ఆది
నీగురువు !

మనం
చేయాల్సింది చేస్తే
రావల్సింది
అదేవస్తుంది–

పిండికొద్దీ
రొట్టె !

ప్రకృతి అన్నీ
ప్రసాదిస్తుంది
గ్రహించే
సామర్థ్యం
మనది–

కిటికీ తెరిస్తేనే
సూర్యుని వెలుగు

మనలోపలికి
మనంచూడం
బయట వున్న
చెడును చూస్తాం–

ద్వేషం
విషం!

నిజంగా
జీవించిన వారెవరు?
పరులకోసం
పాటుపడిన వారు–

మిగిలిన వారు
జీవచ్ఛవాలు!

విద్యా గ్రంథాలు
ఇచ్చేది జ్ఞానమే
ఆత్మ గ్రంథం
తెరిస్తే వికాసమే

ఆన్వేషణే
తపస్సు !

## నేను ఆడదాన్ని



బెంగాలీ: **మనిదీపా ముఖర్జీ**

తెలుగు: **వేదుల రామకృష్ణ**

విముక్తి పాటలు వింటున్నా
తెంచాలింకా సంకెళ్ళు
ఈనాటికీ తొడిగే ఉన్నా
పూర్వీకుల బేడీలు కాళ్ళకు
కావల్సింది ఎంతో ఉన్నా
అల్పంగా సంతోషిస్తా
ఎదలో ఆశలు మగ్గ ఎదలోనే
హృదయంలో పెరుగుతున్న
వేయి బాధలు, వ్యధలూ
ఎవడూ లేడు తోడుగా
దుఃఖాన్ని దిగమింగి

ఆనందంలో మునిగి తేలుతా
ఎవడిని చూసినా మతలబుగాడే
తీయని మాటల మాయలగాడే
తెలియదు నేటికి కూడా
ఎక్కడ ఉన్నదో నా గూడు.

## ఆహ్వానం

**చల్లగాలి బాబూరావు**

న్యాయాన్ని త్రోసి అన్యాయం
అహింసను చంపి హింస
సత్యాన్ని మ్రింగి అసత్యం
క్రమతను చీల్చి అక్రమం
విషపు కోరలతో
విలయతాండవం చేస్తున్నాయి
బ్రతుకు తివాసీ మీద
ఆశల పూలను 'ఎర'గా పరిచి
ఆశయాల కళ్ళను
భ్రమింపచేస్తున్నాయి
ఓకవీ రా ! రవిలాగ !
నీ రాకతోనైనా
మలినం కరుగుతాదేమో !
కలం పోటుకి
కొత్తదనం ఉదయిస్తాదేమో !!





March 2010_Prasthanam.pmd 23 2/25/2003, 12:38 PM

స్మృతి

**మార్చి 11 కె.ఎన్.వై. పతంజలి ప్రథమ వర్ధంతి**



# 'మోటు మనిషి' - కె.ఎన్.వై. పతంజలి

**డా॥ నీరజ జవ్వాజి**

***ఒక మధ్యతరగతి విద్యాధికుడి మనస్తత్వాన్ని, సంస్కారాన్ని, ఆ పక్కనే పల్లె మనిషిని కూర్చుండబెట్టి బేరీజు వేస్తుందీ కథ. పల్లెటూరి మనిషిని మోటు మనిషిగా, అనాగరికుడిగా, అసహ్యంగా చూసే పట్నం మనుషుల 'నాగరికత'ను ఎత్తి చూపుతుంది. కథలో ప్రధానంగా ఒక బస్సు ప్రయాణికుడి తీరని కోరిక, అసంతృప్తి, విసుగు, శాపనార్థాలు స్వగతంలో వినిపిస్తాయి. ఆ స్వగతానికి నవ్వుకుంటున్న మనల్ని చివరలో ఉలిక్కిపడేట్లు చేస్తాడు రచయిత.***

తెలుగు కథాసాహిత్యంలో కథా సంపుటి వెలువడకముందే ప్రాథమిక దశలో రాసిన కథతోనే ప్రత్యేకమైన గుర్తింపు పొందిన రచయిత కె.ఎన్.వై. పతంజలి. ఆ కథ 'మోటు మనిషి' ప్రముఖ కథారచయిత చాసో ప్రశంసలు పొందిన కథ ఇది. ఒక మధ్యతరగతి విద్యాధికుడి మనస్తత్వాన్ని, సంస్కారాన్ని, ఆ పక్కనే పల్లె మనిషిని కూర్చుండబెట్టి బేరీజు వేస్తుందీ కథ. పల్లెటూరి మనిషిని మోటు మనిషిగా, అనాగరికుడిగా, అసహ్యంగా చూసే పట్నం మనుషుల 'నాగరికత'ను ఎత్తి చూపుతుంది. కథలో ప్రధానంగా ఒక బస్సు ప్రయాణికుడి తీరని కోరిక, అసంతృప్తి, విసుగు, శాపనార్థాలు స్వగతంలో వినిపిస్తాయి. ఆ స్వగతానికి నవ్వుకుంటున్న మనల్ని చివరలో ఉలిక్కిపడేట్లు చేస్తాడు రచయిత. మన సంస్కారంపై, మానవత్వంపై, మధ్యతరగతి మనస్తత్వంపై ఆత్మవిమర్శ విషాదంగా అలముకుంటుంది. ఇందులోని ప్రత్యేకమైన కథాశిల్పమే తదనంతర రచనలలో విస్తరించి పతంజలి రచనలకు విశిష్టత చేకూర్చింది. తొలిదశలోని ఈ కథలోనే వ్యంగ్యం మొనదేలి పదునుగా గుచ్చుకోవడం పతంజలి రచనాశక్తికి నిదర్శనం.

ఒక మధ్యతరగతి విద్యాధికుడైన నాగరికుడు బస్సు ఎక్కి కిటికీ పక్కన సీటు కావాలని అక్కడ కూర్చున్న పల్లెటూరి ఆసామిని అడుగుతాడు. అందుకతడు ఒప్పుకోడు. దీంతో నాగరికుడు పలురకాలుగా గొణుక్కోవటం మొదలుపెడతాడు. చూడగానే 'పొలానికి సరిపడే ఎరువు అతని ఒంటినే ఉంది' అనుకుంటూ వయసును, బరువును అంచనావేస్తాడు. 'రాను.. నాను సుట్ట కాల్చుకోవాలి' అని నిర్మొహమాటంగా తన కోరికను తిరస్కరించిన మోటుమనిషి నాయుడిపై కోపం పెంచుకుంటాడు. ఇక అక్కడి నుండి నాయుడి ప్రతి కదలికను వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తూ ఎన్నో అభిప్రాయాలు వెలిబుచ్చుతాడు.

నాయుడు చుట్టకాల్చుకుందామని ప్రయత్నించి నప్పుడల్లా వీణ్ణి చుట్ట కాల్చుకోనివ్వకూడదనే పట్టుదలతో, బస్సులో పొగ తాగకూడదని అభ్యంతరం చెప్పి తన పగ తీర్చుకోవాలని ఎదురు చూస్తుంటాడు. కిటికీలోనుండి కనిపిస్తున్న చెట్లు చేమలను నాయుడు దీక్షగా చూస్తుంటే, వీడి దృష్టి తగిలితే అవి చటుక్కున చచ్చి ఊరుకుంటాయని, వాడివి పాపిష్టి కళ్లని నిర్ణయించుకుంటాడు. నాగరికుడిని తలనెప్పి వెంటాడుతుంది. దాన్ని కూడా చాలా వింతగా తిట్టుకుంటాడు. 'దరిద్రపు తలనొప్పి తెలుగు సినిమాలాగన్నా వచ్చిన వెంటనే తిరిగిపోదు... పనిలేని పెళ్లాంలాగ, పనున్న స్నేహితుడిలాగ వచ్చేసి నెత్తినెక్కి కూర్చుంది. దిక్కుమాలిన తలనొప్పి' అని విసుక్కుంటూ, ఈ సమయంలో కిటికీ పక్క సీటయితే ఎంత హాయిగా పడుకోవచ్చో ఆయా భంగిమలను తలచుకుంటాడు. నాయుడు మధ్యలో దిగిపోతే కిటికీ పక్క కూర్చోవచ్చని ఆశపడ్తాడు. కానీ అతడు చివరివరకు తనతోపాటే ప్రయాణిస్తాడని తెలుసుకుని "చచ్చాం. వీడు నన్ను చివరివరకూ వదలడు' అని చిరాకుపడతాడు. అందుకే ఎక్కడికి వెళ్తున్నావనే నాయుడి ప్రశ్నకు 'వెస్ట్ జర్మనీ' అనే తలతిక్క సమాధానం చెప్తాడు.

ఎడమపక్క ఆసామిని వీక్లీ అడిగితే ఇవ్వనని ఖచ్చితంగా చెప్తాడు. ఖంగుతిన్న నాగరికుడు అతణ్ణి దుర్మార్గుడని, కోఎడ్యుకేషన్ లేని కాలేజికి ప్రిన్సిపాలుగా ఉండతగ్గవాడని అనుకుంటాడు. అతడికంటే నాయుడే బెటరని, అడిగితే చుట్టన్నా ఇచ్చేలా ఉన్నాడని, వారిద్దరి మధ్య కూర్చున్నందుకు అసహనంతో 'పరీక్షహాలులో మూడు గంటలు తెల్లకాగితం వాడకుండా ప్రయత్నం మీద కూర్చోవచ్చు. తెలుగు నాటకం కాని, సినిమా కాని కదలకుండా చూడొచ్చు. కానీ ఈ దుర్మార్గులిద్దరి మధ్య' కూర్చోవడమే కష్టమనుకుంటాడు.

నాయుడు వేరుశెనక్కాయలు ఒలిచి తింటుంటే నాగరికుడి కష్టాలు మరింత పెరిగాయి. 'ఒలుస్తున్న చప్పుడు, నములుతున్న మెత్తని, అసహ్యకరమయిన శబ్దం... క్షణాలు గడుస్తున్న కొద్దీ అన్‌బేరబుల్‌గా, పెయిన్‌ఫుల్‌గా ఉంద'నుకుంటాడు. తలనొప్పి ఎక్కువైంది. దానికి తోడు



March 2010_Prasthanam.pmd 24 2/25/2003, 12:38 PM

## దేవుల్లాట!

యస్. షంషీర్ అహ్మద్



ఆలోచనా క్షితిజం
మనః క్షేత్రమ్ము జొచ్చి
నింగి దిగని వాన చినుకుపై కినిసి
అంతర్ముఖమై వరుణజపం చేస్తున్నది
కర్షక రుషి హలధారియై
ధరణి జడపాయలను
ఎండిన ఎద కనుమల కన్నీటి చాళ్ళను
నాగట వెదుకుతున్నట్లున్నది
మొలిపించేందుకు కాదు
మెలితిరిగి పడ్డ విత్తన శిశువు
వెలికి రానందుకూ కాదు
సశరీరంగా, సజీవంగా వుందేమోనని
ఆత్రంగా తన కడుపును తానే
దేవుకొని దేవుల్లాడుకొంటున్నట్లున్నది

## కడగండ్లు

ఇల్ల ప్రసన్నలక్ష్మి



నా గరీబుతనానికి జవాబు ఎవరని?
నా కడగండ్లకు ఖరీదుకట్టే షరాబులెవరని....?
గుక్కెడు గంజి తాగి గజాల కొద్దీ భూదేవిని
గుక్క తిప్పకుండ దున్నితే మిగిలింది ఏదని?
చేరెడు నూకలు... పిడికెడు బియ్యం
చేరబిలిచిన భూస్వామి నిర్వాకం...!
ఆకలి కేకలకు ఆగలేక... ఆలిబిడ్డలతో పట్నం పోతే
పంచెపోయి పంట్లాం వచ్చిందే గానీ
పైసల్ మాత్రం రాలే
నా నరాల సత్తువను దోచుకుంది కార్ఖానా
తరాలు మారుతున్నా... తనువులు చాలిస్తున్నా...
నా శ్రమశక్తితో యాజమాన్యం నింపుకుంది తన ఖజానా
నేతలు మైకులు పట్టి కోతలు కోస్తుంటే...
మా రాతలు మైలుదూరం కదిలి మళ్ళీ మొదటికొస్తున్నాయి
నివురు గప్పిన నిజం పేదరికం
ఉప్పెనగా మారే రోజొకటొస్తుందనే ఒక వాస్తవం!

---

నాయుడు జంతికలు కొనుక్కుని కరకరా నమిలేస్తున్నాడు. ఎడమపక్క ఖాళీ అయిన సీటులో కూర్చున్న బెల్‌బాటమ్ కుర్రాడు స్నేహపూర్వకంగా నవ్వి వక్కపొడి ఆఫర్ చేశాడు. ఆ కుర్రాడు అతిమంచివాడుగా, సంస్కారవంతుడుగా భావించాడు నాగరికుడు.

ఈ విధంగా కిటికీ పక్కసీటు ఇవ్వలేదని నాయుడిని, వీక్లీ ఇవ్వలేదని ఆసామిని కోపంతో పలు విధాలుగా నాగరికుడు తిట్టుకునే తిట్లు మనకు నవ్వు తెప్పిస్తాయి. దీనికి తోడు తన తలనొప్పి, చిరాకును స్వోత్కర్షతో మిళితం చేసి "జీనియస్సులు పరాకుగాను, కాదలుచుకునే నాలాంటి జీనియస్సులు చిరాకుగాను ఉంటారు కామోసు" అనుకుంటాడు. బస్సు అక్కడక్కడ ఆగుతూ జిడ్డుగా ముందుకెళ్తోందని తన చిరాకును బస్సు మీద కూడా ప్రదర్శిస్తాడు.

ఇదంతా ఒక పార్శ్వమయితే నాగరికుడి తలనొప్పి మరోముఖ్య పార్శ్వం. అంతకంతకూ పెరిగిపోతున్న తలనొప్పికి తోడు కడుపులో తిప్పుతూ, నోట్లో ఊరుతున్న ఉమ్మి, వాంతయ్యేట్టుగా ఉంటుంది. మెలికలు తిరుగుతున్న బస్సు ప్రయాణంలో కడుపులో తిప్పడం ఎక్కువై భళ్లున వాంతి చేసుకుంటాడు. అరిగీ అరగని అన్నం మెతుకులు అతని మీదా, నాయుడి పాదాల నిండా అసహ్యంగా పడ్డాయి. "ఏక్"... పక్కనున్న అబ్బాయి అసహ్యించుకుని లేచి ముందుకెళ్లి నిల్చుంటాడు. కండక్టరు విసుక్కుంటాడు. నాయుడు తన అంతుచూస్తాడని అనుకుంటాడు నాగరికుడు. ఇక్కడే ఒక అద్భుతం జరుగుతుంది. నాయుడి గుండెల్లో దాగున్న మానవత్వం కథలో ఆవిష్కృతమౌతుంది. "అర్రరే...పాపం..." అంటూ నాయుడు నాగరికుడిని జాలిగా, అప్యాయంగా పట్టుకుని ఆదరిస్తాడు. తన ఒడిలో పడుకోబెట్టుకుంటాడు. ఎవరినైతే తను ఇంతవరకూ అసహ్యించుకుంటూ, శాపనార్ధాలు పెట్టాడో ఆ అనాగరికుడు, మోటుమనిషి అనుకున్న నాయుడి మోటు చేతులే తనను దగ్గరకు తీసుకున్నాయి. "నా తలని గడ్డి తవ్వడానికీ, కట్టెలు చీల్చటానికీ, వేరుశనగ మోటుగా ఒలవటానికి పుట్టాయనుకున్న మోటు చేతులే జాలిపడి అప్యాయంగా పట్టుకుని, దుమ్ముపట్టిన, తెగమాసిన అసహ్యకరమయిన ఒడిలోనే పడుకోబెట్టుకున్నాయి. నాకాలిపోతున్న నుదుటిని నెమ్మదిగా నిమిరి, నాకళ్లని మెత్తగా, చల్లగా మూసినవి ఆ మోటు మురికి చేతులే..." ఈ విధంగా ఆ మోటు చేతులే నాగరికుడి బాధను పంచుకుంటాయి. గొప్ప మానవత్వాన్ని చూపుతాయి.

పాఠకులు ఊహించని కుదుపుకు గురయ్యేది ఇక్కడే. "కథ చివరి కొచ్చేసరికి ఒక పిడుగు పడుతుంది. జీవమూలంలో ఒక పెద్ద కుదుపు. నాభిలో కలవరం పడక్కుర్చీలో పడుకుని రచయిత శిల్పాన్ని ఎంజాయ్ చేస్తున్న మనం హటాత్తుగా నిలబడతాం. ఆందోళన, అపరాధ భావం" మనల్ని వెంటాడుతుందని విమర్శకుడు చిత్ర విశ్లేషించారు. సంస్కారం, మానవత్వం అనేవి చదువుకు, వేషభాషలకు సంబంధం లేని ఉదాత్తమైన అంశాలని అర్ధమవుతుంది. సంస్కారమనేది సహజ స్వభావంలా ఉండాలని, ఈ స్వభావం పల్లెటూరి మోటు మనుషుల్లోను ఉంటుందని బలంగా చెప్తుందీ కథ. మానవత్వమనేది మనసుకు, గుణానికి సంబంధించింది. ఈ విలువైన అంశాన్ని పతంజలి "మోటు మనిషి"లో శక్తివంతంగా చిత్రీకరించారు. మధ్యతరగతి విద్యాధికుడి మనస్తత్వం, అంచనాలు ఎంతగా దిగజారిపోయి ఉన్నాయనే మరో పార్శ్వాన్ని చూపిస్తుంది. అప్పటి వరకు మనం నవ్వుకున్నది, వేళాకోళమాడుకున్నది మోటుమనిషిని చూసికాదు. మనల్ని మనమే చూసుకున్నామనే చేదునిజం ఒక్కసారిగా మనల్ని కలవరపరుస్తుంది. సరికొత్త మానవీయ విలువలను ఆచరించి చూపిన గుణాత్మక కథగా 'మోటు మనిషి' నిలుస్తుంది.

ఈ విధంగా మోటుమనిషి కథ సమకాలీన కథారచయితలచే ప్రశంసించబడి కథా రచయితగా పతంజలికి ఆత్మ విశ్వాసాన్ని, గుర్తింపును తెచ్చిపెట్టింది. ఉత్తమ పురుష కథనంతో, కథకుడి స్వగతాలతో హాస్య ప్రధానంగా కనిపిస్తుంది. "70వ దశకంలో వచ్చిన ఒక మంచి కథ మోటుమనిషి. "రావిశాస్త్రి గారి వెన్నెల ఒక రకం ఈస్తటిక్స్ అయితే ఈ మోటుమనిషి ఒకరకం ఈస్తటిక్స్‌ని కన్యాశుల్కంలాగే హాస్యప్రధాన బీభత్సాంతంగా చిత్రించింద"ని ఉత్తరాంధ్ర 'తెలుగుకథ – ఒక అవగాహన'లో ప్రత్యేక ప్రశంసలు పొందింది. ■



March 2010_Prasthanam.pmd 25 2/25/2003, 12:38 PM

**పరిచయం**

# రారా మార్గంలో సింగమనేని

**రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి**

***కొల్లాయిగట్టితేనేమి, జానకి విముక్తి వంటి నవలల మీద, చాసో, రారా, రాజారాం మొదలైన కథకుల మీద సింగమనేని చేసిన విమర్శలు తెలుగు సాహిత్య విమర్శలోని ఆరోగ్యకర ధోరణికి, నిబద్ధతకు నిదర్శనాలు. సమాజ సాహిత్య సంబంధాల పట్ల, సాహిత్య ప్రయోజనం పట్ల, సాహిత్యకారుల కర్తవ్యాల పట్ల స్పష్టమైన అభిప్రాయాలు గల సింగమనేని సాహిత్య విమర్శలో నిక్కచ్చితనం కనిపిస్తుంది.***

సింగమనేని నారాయణగారు కథకులు, నవలా రచయిత, సాహితీ సామాజిక అంశాల మీద స్పష్టమైన అవగాహనతో, విస్పష్టమైన వాచకంతో శ్రోతలకు అనుమానంరాని పద్ధతిలో మాట్లాడే వక్త. తెలుగు సాహిత్యం తీరు తెన్నులను గురించి ఆయన సభలలో సదస్సులలో మార్గ పద్ధతిలోనూ, మిత్రులతో దేశీ పద్ధతిలోను మాట్లేడేది అపరిమితం. రాసింది పరిమితం. ఏ రూపంలోనైనా ఆయన సాహిత్య విమర్శకుడుగా చేసేది ఒక్కటే పని. ఉత్తమ సాహిత్యాన్ని, అధమ సాహిత్యాన్ని వేరు చేయడం. కథా నవలా రచయిత అయిన సింగమనేని సాహిత్య విమర్శలో కూడా ఆ రెండు ప్రక్రియలపైనా దృష్టి పెట్టారు. నాబోటి వాళ్లను కవిత్వ పక్షపాతులు అంటుంటారుగాని, ఆయనకు కొన్ని వేల పద్యాలు, కొన్ని వందల కవితలు నోటికొచ్చు. కొల్లాయిగట్టితేనేమి, జానకి విముక్తి వంటి నవలల మీద, చాసో, రారా, రాజారాం మొదలైన కథకుల మీద సింగమనేని చేసిన విమర్శలు తెలుగు సాహిత్య విమర్శలోని ఆరోగ్యకర ధోరణికి, నిబద్ధతకు నిదర్శనాలు. సమాజ సాహిత్య సంబంధాల పట్ల, సాహిత్య ప్రయోజనం పట్ల, సాహిత్యకారుల కర్తవ్యాల పట్ల స్పష్టమైన అభిప్రాయాలు గల సింగమనేని సాహిత్య విమర్శలో నిక్కచ్చితనం కనిపిస్తుంది. సాహిత్య విమర్శలో కరుకుదనం–కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం రారా వారసత్వమని పేరు బడిపోయింది. అదొక్కటే కాదు. ఇంకొకటి కూడా ఉంది రారాలో. రచనను పాఠకుణి దృష్టికోణం నుండి అంచనా కట్టడం. రచన పాఠకునిపైన ఎలాంటి ప్రభావ ముద్ర వేస్తుందో చెప్పడం సింగమనేని నారాయణగారిలో నిర్మొహమాటమి ఉంది. పాఠకునివైపు నుండి సాహిత్యాన్ని మదింపు చేసే లక్షణముంది. అందుకే సింగమనేని (శ్రీశ్రీ రారాలో ఉందనుకునే క్రూరత్వం లేదుగాని) మరో రారా అనాలనిపిస్తుంది. కట్టమంచివంటి సామాజిక వాదులలో పుట్టి శ్రీశ్రీ, కుటుంబ రావు, ఎంఆర్ చంద్ర, పుచ్చలపల్లి సుందరయ్య సొదుం రామ్మోహన్, రారా, త్రిపురనేని మధుసూదనరావు వంటి వాళ్లలో మార్క్సియ స్వభావాన్ని సంతరించుకున్న తెలుగు సాహిత్య విమర్శకు సింగమనేని ఈ రెండు మార్గాలలో పాఠకుని దృష్టి కోణం నుంచి మాట్లాడడం, నిర్మొహమాటంగా ఉండడం–సుసంపన్నం చేశారు. వాస్తవికతా బాటబట్టిన సింగమనేని విమర్శ ఆలోచనాత్మకం.

రారా సాహిత్యం పాఠకుని సంస్కారం మీద ప్రభావం చూపిస్తుందని బాగా ప్రచారం చేశారు. సింగమనేని ఆయన మార్గంలోనే ఈ అభిప్రాయాన్ని అనేక సందర్భాలలో పేర్కొంటూవచ్చారు. "రారా కథలన్నీ చదివిన తర్వాత పాఠకుని సంస్కార స్థాయి ఒక మెట్టు అయినా పెరుగుతుందని నమ్మకంగా చెప్పవచ్చు" (పాఠకుని సంస్కార స్థాయిని పెంచే రారా కథలు) "స్త్రీవాద కథలు ముఖ్యంగా పురుష పాఠకులను చాలా డిస్టర్బ్ చేశాయి. (తెలుగు కథ 1990 తర్వాత) "చాసో గారి 'ఎందుకు పారేస్తాను నాన్నా' కథలో పన్నెండేళ్ల కృష్ణుడి అంతరంగం, ఆ తండ్రి సంఘర్షణ, ఆర్థిక అసహాయత పాఠకుణ్ని కలచివేస్తాయి' (చాగంటి సోమయాజుల కథలు) "కల్లేటి వంక" కథలోని అనైతిక సంబంధాల చిత్రణను గురించి చెబుతూ, వాటిని చదివిన "పాఠకులు మూర్ఛపోవలసిందే" అంటారు. వి.చంద్రశేఖరరావు 2002లో రాసిన కథలలోని శిల్పాన్ని గురించి చెబుతూ "పిడికెడు విమర్శకుల మెప్పుకోసమే కథలు రాస్తూ అనంతమైన పాఠకుల్ని మరచిపోయారు" (తెలుగు కథ 2002) అన్నారు. రచయిత సమాజాన్ని డేగకన్నుతో కనిపెడ్తుండాలి. సాహిత్య విమర్శకుడు కూడా సాహిత్యాన్ని డేగకన్నుతో గమనిస్తూ ఉండాలి. ఎవరిని ఉద్దేశించి రచన చేయాలనుకున్నారో వాళ్లను సాహిత్యం ఏమి చేస్తున్నదో గుర్తించడం సాహిత్య విమర్శకుని కర్తవ్యం. సింగమనేని ఆ కర్తవ్యమే నిర్వహించారు. రచయిత సమాజం తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడితే, సాహిత్య విమర్శకులు పాఠక సమాజం తరఫున వకాల్తా పుచ్చుకొని మాట్లాడతారు. విభిన్న మార్గాలలో ప్రజలకు చేరువైన రంగనాయకమ్మ, చంద్రశేఖరరావు గోపిని కరుణాకర్ వంటి రచయితలలోని గుణదోషాలను నిజాయితీగా విశ్లేషించారు సింగమనేని.

సింగమనేని సాహిత్య విమర్శలోని అభిప్రాయాలు ఇటు సాహిత్య విమర్శకులకు, అటు సాహిత్య కర్తలకు ఇద్దరికీ మార్గదర్శకాలుగా ఉంటాయి. ఆయన సాహిత్య విమర్శలో పూర్వ, వర్తమాన రచయితల పఠనానుభవమూ, పూర్వ విమర్శకుల వివేచనా స్వభావమూ కలగలిసి



March 2010_Prasthanam.pmd 26 2/25/2003, 12:38 PM

ఉంటాయి. సింగమనేని సాహిత్యంలో వస్తువులోనే గాదు, శిల్పంలోనూ వాస్తవికతే ప్రధానంగా ఉండాలని భావిస్తారు. పాఠకుడిని బోల్తా కొట్టించే మలుపులను, ప్రయోగాల పేరుతో పాఠకులకు వస్తువును అందకుండా చేసే శిల్పాన్ని సింగమనేని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారు. “స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం ఉంటే మెలోడ్రామా లేకుండా వస్తువును ఆవిష్కరించవచ్చు” (రాయలసీమ కథాచిత్రం) అన్నది ఆయన అభిప్రాయం. ‘స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం’ అంటే విస్తృత సమాజం పట్ల బాధ్యత వహించటమని. ప్రపంచ బాధను రచయిత తన బాధగా భావించడం. స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం లేకపోవడమంటే, రచయిత తన బాధను ప్రపంచ బాధగా మార్చేయడం. కొడవటిగంటి కుటుంబరావులాగే సింగమనేని సిద్ధాంతాల కోసం రచన చెయ్యటాన్ని వ్యతిరేకిస్తారు. రచయితలు సామాజిక మూలాలు తవ్వితీయాలిగాని రచనల్లో సిద్ధాంతాలు వల్లించ కూడదంటారు. రచయితలు సాధించదలచుకున్న ప్రయోజనాల కోసం పాత్రల్ని బలిపెట్టకూడదన్నది ఆయన అభిప్రాయం. రచనలో కళాధర్మాలను అతిక్రమించి, మధ్యలో రచయిత పనిగట్టుకొని ఉపన్యాసాలివ్వడాన్ని సింగమనేని పూర్తిగా తిరస్కరిస్తారు. శిల్ప మర్యాదాతిక్రమణను ఏమాత్రం ఆమోదించని నిబద్ధ విమర్శకులు సింగమనేని. అందుకే ఆయనకు క్లుప్తత అంటే మహా ఇష్టం. అట్లని ఆయన సాహిత్యంలో ప్రయోగాలకు వ్యతిరేకి కాదు. సాహిత్యంలో నిరంతరం ప్రయోగాలు జరుగుతూ ఉండవలసిందేనన్నది సింగమనేని అభిప్రాయం. అయితే ఆ ప్రయోగాలు ఎక్కువ మంది పాఠకులకు సాహిత్యాన్ని చేరవేసేదిగా ఉండాలన్నదే ఆయన వాదం. “ఏ కథలో కూడా (చాసో) రచయిత ప్రవక్త స్థానంలో కూచోడు” అంటారు చాసోను గురించి. కథలో రచయిత ప్రవక్త వేషం వేశాడంటే, పాఠకున్ని అవమానించినట్లేనని ఆయన అభిప్రాయం. సినిమాలలో లాగే కల్పనా సాహిత్యంలో కూడా రచయితలు ఆదర్శీకరణ అనే బలహీనతకులోనై పాత్రల చైతన్య స్థాయికి విరుద్ధంగా, పెద్ద పెద్ద మాటల్ని చెప్పించడం, అసంబద్ధమైన త్యాగాలను చేయించడం వంటి ధోరణులను వాస్తవికతావాదులెవ్వరూ ఆమోదించరు. అది అతి పాత్రీకరణ. ఈ అతి పాత్రీకరణ వ్యాపార రచయితలలోనే కాదు, ప్రజా రచయితలలో ఉన్నా వాస్తవికతావాద విమర్శకుడుగా సింగమనేని ఉపేక్షించలేదు. అల్లం రాజయ్య ‘అతడు’ కథలో మితిమీరిన వీర పూజను చూపడం ఆ దృష్టితోనే.

విస్తృతంగా రచనలు చేసే వాళ్లు పునరుక్తులు చెయ్యడం, మూస ధోరణిలో పడిపోవడం ఉపేక్షించదగినది కాదని, సహజత్వం, అనివార్యత, వైవిధ్యం- ఇవి ఏ రచయితకైనా ప్రాణ సమానమైన లక్షణాలని సింగమనేని భావిస్తారు. ఇవి లోపిస్తే విశ్వసనీయత దెబ్బతింటుందని ఆయన హెచ్చరిక. రచనంతా చదివిన తర్వాత రచనలో రచయిత ఏమి చెప్పదలచుకున్నాడో పాఠకుడికి తెలియకపోతే ఆ రచన దండగమారిదని ఆయన ఉద్దేశం.

***ఈ అతి పాత్రీకరణ వ్యాపార రచయితలలోనే కాదు, ప్రజా రచయితలలో ఉన్నా వాస్తవికతావాద విమర్శకుడుగా సింగమనేని ఉపేక్షించలేదు. అల్లం రాజయ్య ‘అతడు’ కథలో మితిమీరిన వీర పూజను చూపడం ఆ దృష్టితోనే.***

***విస్తృతంగా రచనలు చేసే వాళ్లు పునరుక్తులు చెయ్యడం, మూస ధోరణిలో పడిపోవడం ఉపేక్షించదగినది కాదని, సహజత్వం, అనివార్యత, వైవిధ్యం- ఇవి ఏ రచయితకైనా ప్రాణ సమానమైన లక్షణాలని సింగమనేని భావిస్తారు.***



**సింగమనేని నారాయణ**

వర్తమాన సాహిత్యంలోని సవ్యాపసవ్యాకర ధోరణులను ఎత్తిచూపి పాఠకులను జాగృతపరచడం సాహిత్య విమర్శకుని కర్తవ్యం. సామాజిక, సమిష్టి దృష్టి గల సింగమనేని చేసింది ఆ పనే. ‘జానకి విముక్తి’ నవలను గురించి “పాఠకుల్ని భ్రమల్లో ముంచే రంగు రంగుల ప్రేమలనుండి మన సాహిత్యం విముక్తి చెందాలి అన్న స్ఫూర్తినిస్తుంది’’, యద్దనపూడి సులోచనారాణి ‘కీర్తికిరీటాలు’ నవల గురించి “ప్రజావ్యతిరేక సాహిత్యాన్ని తిప్పి కొట్టగల చైతన్యం పాఠకుడు సాధించినప్పుడు ఇలాంటి నవలలు తుక్కుకుండీలలో చేరుకుంటాయి” అని వ్యాఖ్యానించడం ఈ దృష్టితోనే. ప్రేమ విషయంలోనే కాదు, ప్రజల జీవితంలోని ఏ అంశం పట్ల కూడా రచయితలు పాఠకులలో భ్రమలు పెంచడం మంచిది కాదంటారు సింగమనేని. కాల్పనిక సాహిత్యంలోని ఈ బలహీనతను ఆయన పూర్తిగా వ్యతిరేకిస్తారు. ‘‘రంగుల ప్రపంచం నుండి వాస్తవిక ప్రపంచంలోకి పాఠకుణ్ణి నెట్టుతాయి” అని కేతు విశ్వనాథరెడ్డి కథలను నిర్వచించడంలోని సూత్రమిదే. పాఠకులను ఏడిపించి కన్నీళ్లు తెప్పించడం సాహిత్య కర్తవ్యం కాదన్నది మార్క్సీయ సాహిత్య సిద్ధాంతం. సామాజిక వాస్తవాల పట్ల, మానవ కార్యం పట్ల అవగాహన కలిగించే క్రమంలో దుఃఖాన్ని వేదనను వర్ణించడం అవసరమే అయినా స్త్రీల దుఃఖాన్ని చావుల్ని వర్ణించి మహిళల జీవితాన్ని దుఃఖభాజనం చెయ్యడం సాహిత్యం ద్వారా సమాజానికి నష్టం చేయడమేనని కొడవటిగంటి కుటుంబరావు వంటి మార్క్సిస్టుల అవగాహన. సింగమనేని ఆ తానులో పోగే. చావును వర్ణించి పాఠకులకు కన్నీళ్లు తెప్పించడం చాసో దృక్పథం కాదు” అని చాసోను గుర్తించడంలో ఉద్దేశమిదే. రచయితకు పాఠకుడిని చెడు పట్ల అయిష్టతను, మంచి పట్ల ప్రేమను కలిగించడమే ముఖ్య కర్తవ్యమని ఆయన ఉద్దేశం.

రచయితలు రచనలో ఎన్ని కల్పనలు చేసినా ఎన్ని పాత్రలను, సంఘటనలను, సన్నివేశాలను సృష్టించినా వాటి మధ్య అంతర్గత ఐక్యత ఉండాలి. రచన మొత్తం మీద రచయిత ప్రతిపాదించదలచుకున్న ప్రధాన ప్రయోజనానికి అవి దోహదం చెయ్యాలి. ఇది సంప్రదాయ అలంకారికుల నుండి ఆధునికులదాకా అందరూ చెప్పిందే. ప్రాచీనులు ఆధునికులు సంవాదించిన ఈ ఒక్క విషయంలోనే అనుకుంటాను. సింగమనేని కూడా శిల్పకల్పనల జిలుగు వెలుగులతో



March 2010_Prasthanam.pmd 27 2/25/2003, 12:38 PM

## గాథ



**ఆచార్యకొలకలూరి ఇనాక్**

పాప
నీళ్ళతో
ఆడితే
పైకి లేచి
పోతున్నాయ్
సీతాకోక చిలుకలు

నిప్పులు
అమ్మే
మంటల
వ్యాపారి
రోహిణి
కార్తె

చెక్కిలి
పలకమీద
పసి వేళ్ళు
దిద్దాయి
నిద్ర
అక్షరాలు

ప్రాంసరీ
నోట్లు
వేలిముద్రల
ఆకలితో
మింగేశాయ్
బొటినేలును

చంద్ర
వంకను
సిలువవేసి
పొడిచితినే
ఫోర్కు
త్రిశూలం

చెరువెండితే
వేట కొడవలి
జాలిపడి
ప్రవహించింది
కాలువల
రక్తం

ఉన్నతినిచ్చి
నడకను
నడతను
నేర్పే
దేవత
పాదరక్ష

## సింగారి చెంగు !

**యద్దల లలిత**

ఇంట్లో ఉక్కపోత
పొలాల్లో పచ్చదనంకోత
రాకడపోకడ తెలియని కరంటుతో
చాలీచాలని నిద్రతో
గెనిమ మీదే కునికిపాట్లు పడుతున్నా !
రెండు దఫాల కరంటుతో
కాలువలు మాత్రమే పుష్కలంగా
నీరు త్రాగి బలిసిన తుంగ
ఠీవిగా తలూపుతూంటే
దిగులుగా చూస్తున్నా !
పైరుకు ఊపిరందివ్వని
అరకొర తడికలుపుని
పట్టుకుచ్చులా మెరిపిస్తూంటే
కృంగి కృశించి పోతున్నా !
నీరెంత కరువో
కూలీలంత భారమని
గుడ్లనీరు కుక్కుకుంటున్నా !
పాడుబడిన గుంటలు కూడా నింపే
సింగారి చెంగు పడమర దిక్కున పరిస్తే
ఆనందంతో ఆ ఏడురంగులూ
నా ముఖాన్నే ప్రతిబింబిస్తాయి !



సామాజిక ప్రయోజనం దెబ్బతినకుండా రచయితలు జాగ్రత్త పడాలని సూచించారు. బెజ్జారపు రవీందర్ "నిత్య గాయాలనది" కథల్లోని లోపాన్ని ఎత్తి చూపుతూ "వక్తవ్యాంశాల మధ్య ఐక్యత లేకపోవడం ఈ కథలలోని బలహీనత" అన్నారు. (కథ 2002).

సమాజం పట్ల తనకొక బాధ్యత ఉన్నది అనిభావించే విమర్శకులెవ్వరూ సాహిత్య విమర్శకు రచనే తప్ప రచయిత స్థల కాలాలు ప్రమాణాలు కావని వాదించరు. సింగమనేని రచనను ఒక సామాజిక బాధ్యతగా భావిస్తారు గనక రచనను స్థల కాలబద్ధమైన మానవ జీవిత ప్రతిఫలంగా భావిస్తారు గనక రచయిత జీవితంతో ముడిపెట్టి రచనను విశ్లేషిస్తారు. కొల్లాయి గట్టితేనేమి నవల మీద రాసిన వ్యాసంలో మహీధరను గొప్ప రాజకీయ నవలా రచయితగా నిర్వచిస్తూ ఆ నవల కథాకాల స్థల నేపథ్యాన్ని సమన్వయించారు.

ఒక రచయితను గురించో ఒక రచనను గురించో విమర్శ రాయడం, సులువైన పని. ఒక ప్రాంతపు సాహిత్యాన్ని, ఒక కాలపు సాహిత్యాన్ని విశ్లేషించడం కొంత కష్టంతో కూడుకున్న పని. విస్తృతమైన అధ్యయనం, శాస్త్రీయమైన ఆలోచన, విభిన్న కాలాల, ప్రాంతాల జన జీవన విధాన పరిజ్ఞానం వంటివి ఇక్కడ చాలా అవసరం. రాయలసీమ కథా చిత్రం, తెలుగు కథ–1999 తర్వాత, తెలుగు కథ 2002 వంటి వ్యాసాలతో సింగమనేని పైన పేర్కొన్న అన్ని లక్షణాలను ప్రదర్శించారు.

సాహిత్యం భావ ప్రచారానికి బలమైన సాధనమనే అభిప్రాయంతో సింగమనేని పూర్తిగా ఏకీభవిస్తారు. అయితే రచన ముందు రచన కావాలని, రచనలో ప్రచారగుణంతోపాటు, కళాత్మకత కూడా ముఖ్యం అనే రారా వాదమే సింగమనేని వాదం కూడా.

సాహిత్య రచన సామాజిక సమస్యల్ని, వాటి మూలాలను ఆవిష్కరించి పాఠకులలో ఆలోచనలు రేకిత్తించాలి తప్ప, వాటి పరిష్కారాలు చెప్పడం పనిగా పెట్టుకోరాదు అని కొడవటిగంటి కుటుంబరావు అభ్యుదయ రచయితగా చెప్పిన అభిప్రాయాన్ని సింగమనేని గౌరవిస్తారు. రచయితలు సమస్యల్ని ఆవిష్కరించడమే కాదు పరిష్కారాలను కూడా చెప్పాలి అని నాబోటి వాళ్లు చేసే ప్రతిపాదనలను ఆయన ఔత్సాహికుల అభిప్రాయాలుగా కొట్టిపారేస్తారు. సులభమైన, సుందరమైన భాష, పదునైన వాక్యం, చదునైన ఆలోచన, సింగమనేని సాహిత్య విమర్శలోని సుగుణాలు.

తెలుగులో సాహిత్య విమర్శ ఎదిగిందా? అని రచయితలు, సాహిత్యం ఎదిగిందా? అని విమర్శకులు అని అప్పుడప్పుడు తెలుగు వాళ్లం కుస్తీపడుతుంటాం. సాహిత్యం ఎదుగుతున్నది, సాహిత్య విమర్శా ఎదుగుతున్నది అని సింగమనేని సాహిత్యమూ ఆయన సాహిత్య విమర్శా చదివితే అర్థమౌతుంది.

■



March 2010_Prasthanam.pmd 28 2/25/2003, 12:38 PM

## 19వ న్యూఢిల్లీ ప్రపంచ పుస్తక మహోత్సవ విశేషాలు

# వెల్లివిరిసిన పుస్తక సంస్కృతి

**గుడిపూడి విజయరావు**



పుస్తక ప్రదర్శనలో సందర్శకులు

కంప్యూటర్ల ప్రవేశంతో పుస్తకాల శకం అంతరించి పోతుందన్న భయాందోళనలు నిజం కావని ఇప్పటికే రుజువయింది. అంతే కాదు ఈ కంప్యూటర్ల ప్రవేశం పుస్తకాలకు ఒక వరంగా సైతం మారింది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పుస్తక ప్రచురణను ఎంతో తేలిక చేసింది. చౌకగా మార్చింది. ఫలితంగా రక రకాల పుస్తకాలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి. అలాగే వాటిని ఆదరించే వారూ అంతకంతకూ అధికమవుతున్నారు. పుస్తకాల పరిధి విస్తరిస్తున్నది, పరిమాణం ఇనుమడిస్తున్నది.

2010 జనవరి 30 నుండి ఫిబ్రవరి 7 వరకు న్యూఢిల్లీలో కొనసాగిన 19వ ప్రపంచ పుస్తక మహోత్సవం ఈ అంశాలను విస్పష్టంగా నిరూపించింది. ఓ బ్రహ్మాండమైన పుస్తక ప్రపంచాన్ని సందర్శకుల ముందుంచింది. పుస్తక ప్రియులతోను, ప్రచురణ కర్తలు, విక్రేతలతోను ప్రగతి మైదానం కిక్కిరిసి పోయింది. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహోత్సవంలో అనేక ప్రత్యేకతలున్నాయి. 37 భాషలలో పుస్తకాలను ప్రచురిస్తున్న భారత దేశం ఇంగ్లీషు ప్రచురణల్లో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. ఇలాంటి దేశంలో నిర్వహిస్తున్న ఈ పుస్తక మహోత్సవం ప్రపంచంలోనే రెండవ అతి పెద్దది. ఆఫ్రికా, ఆసియా ప్రాంతంలో ఆయితే ఇదే అతి పెద్ద ప్రదర్శన. 42,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ మైదానంలోని పలు ప్రాంగణాలలో ఈ ఏడాది 2400 స్టాళ్లు ఏర్పాటయ్యాయి. మొత్తం 1199 మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఐఎల్ఓ, డబ్ల్యుహెచ్ఓ, యునెస్కో, ప్రపంచ బ్యాంకులతో పాటు 35 దేశాలనుండి విదేశీ ప్రదర్శకులు పాల్గొన్నారు.

ఈ సారి పుస్తక మహోత్సవంలో ప్రధాన ఇతివృత్తం 'క్రీడలు'. భారత దేశానికి క్రీడా సంప్రదాయంలో విలువైన సుదీర్ఘ సంప్రదాయం ఉన్నది. పైగా ఈ ఏడాది చివరిలో కామన్ వెల్త్ క్రీడలకు భారత దేశం ఆతిధ్యం ఇస్తున్నది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎన్‌బిటి పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో క్రీడలను పుస్తకాలను అనుసంధానం చేసే విధంగా ఒక ప్రత్యేక హాలును ఏర్పాటు చేసింది. దీనిలో ఇంగ్లీషు, అన్ని భారతీయ భాషలలోని క్రీడలకు సంబంధించిన దాదాపు 700 పుస్తకాలను ప్రదర్శించారు. అలాగే సంప్రదాయ గ్రామీణ క్రీడలు– కబడ్డీ, కుస్తీ, దాగుడుమూత, కుంటాట, వైకుంఠపాళి, గాలిపటాలు, గోళీలు మొదలైన వాటిని ఆకట్టుకునే అందమైన వర్ణ చిత్రాల రూపంలో సంబంధించిన వివరణతో సహా అక్కడ ప్రదర్శించారు. ప్రతిరోజు ఆ హాలులో మిల్కా సింగ్, విశాల్ శరీన్, జాఫర్ ఇక్బాల్ లాంటి ప్రసిద్ధ భారతీయ క్రీడాకారులతో బాలలకు, యువతీయువకులకు పరిచయోపన్యాసాలను ఏర్పాటుచేశారు. క్రీడా జర్నలిస్టులతో క్రీడా జర్నలిజంపై ఉపన్యాసాలు ఇప్పించారు. క్రీడలపై పలు డాక్యుమెంటరీలను ప్రదర్శించారు.

ఈ మహోత్సవంలో మరొక ప్రత్యేక ఆకర్షణ– జవహర్ లాల్ నెహ్రూ రచించిన, ఆయనపై రాసిన పుస్తకాల ప్రదర్శన. ప్రత్యేకంగా ఏర్పాటయిన హాలులో మొత్తం 213 టైటిల్స్‌ను దీనిలో ప్రదర్శించారు. వీటిలో 144 ఇంగ్లీషులోను, 69 అనేక భారతీయ భాషలలోను ఉన్నాయి. ఈ ప్రదర్శనలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నెహ్రూపై రాసిన గ్రంథం కూడ చోటుచేసుకున్నది. ప్రసిద్ధ కార్టూనిస్టు శంకర్ నెహ్రూపై గీసిన కార్టూన్ల పుస్తకం ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించింది. పుస్తక ప్రదర్శనతో పాటు నెహ్రూపై డాక్యుమెంటరీ చిత్రాలను కూడ ఇక్కడ ప్రదర్శించారు.

పుస్తక ప్రారంభోత్సవ సభలో బిపన్‌చంద్ర, కపిల్‌సిబాల్, ఇర్ఫాన్ హబీబ్




ఈ పుస్తక మహోత్సవం ఆరంభమే నిజానికి ఓ ఆసక్తికరమైన సంఘటన. విద్యారంగంలో నయా ఉదారవాద విధానాలను గట్టిగా సమర్థిస్తూ, విదేశీ పెట్టుబడులను సైతం ఆరాటంగా ఆహ్వానిస్తున్న కేంద్ర



March 2010_Prasthanam.pmd 29 2/25/2003, 12:38 PM

మానవ వనరుల శాఖామంత్రి కపిల్ సిబాల్ ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తే, ఈ విధానాలను గట్టిగా వ్యతిరేకించే ప్రముఖ మార్క్సిస్టు చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ ఈ ప్రారంభ సభలో గౌరవ అతిథి. ఇర్ఫాన్ హబీబ్ తన ప్రసంగంలో లేవనెత్తిన అనేక అంశాలకు సిబాల్ స్పందించారు. మనం ఇంకా పరీక్షలవిధానాన్నే పట్టుకుని వేళ్లాడుతున్నామని ఆయన చెప్పారు. విద్యార్థి సామర్థ్యాన్ని వార్షిక పరీక్షలలో వారి మార్కులను బట్టికాకుండా, నిరంతరమైన, సమగ్రమైన రీతిలో విద్యార్థి సామర్థ్యాన్ని బేరీజు వేయాలని, దీనికి టీచరుకు కావలసిన శక్తిని పెంపొందించాలని అన్నారు. ఈ పుస్తకాల వల్ల పిల్లల్లో పుస్తక పఠనం తగ్గుతున్నదదేమోనన్న ఆందోళనను ఆయన వ్యక్తం చేశారు. పుస్తకాలను చదవడానికి, రాయడానికి, కొనుగోలు చేయడానికి ప్రజలను ఆకర్షించేందుకు ఏర్పాటుచేసిన ఈ పుస్తక మహోత్సవాన్ని ఆయన ప్రశంసించారు. మంచి పుస్తకాలను రూపొందించాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంలో ఆయన నొక్కిచెప్పారు. దేశంలో పబ్లిక్ లైబ్రరీల సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరాన్ని కూడ ఆయన వివరించారు. ఎన్‌బిటి చైర్మన్ బిపన్ చంద్ర వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

ఈ మహోత్సవంలో పుస్తక సంస్కృతిని పెంపొందించడంలో అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనల పాత్ర, పుస్తకాల ఎగుమతి మార్కెట్ తీరుతెన్నులు లాంటి అంశాలపై సెమినార్లు జరిగాయి. వివిధ భాషలకు చెందిన ఎన్నెన్నో పుస్తకాలను ఆవిష్కరించారు. పలువురు రచయతలతో ఇష్టాగోష్టులు నిర్వహించబడినాయి. బిపిన్ చంద్ర మూడు రచనలు మోడర్న్ ఇండియా, ఇండియాస్ స్ట్రగుల్ ఫర్ ఇండిపెండెన్స్, ఇండియా ఆఫ్టర్ ఇండిపెండెన్స్ పుస్తకాల తమిళ అనువాదాలను కేంద్ర మంత్రి మణిశంకర్ అయ్యర్ ఆవిష్కరించారు. ఈ సభలో బిపన్ చంద్ర ఆసక్తికరమైన అంశాలను వెల్లడించారు. ఎన్‌సిఇఆర్‌టికి పాఠ్యగ్రంథంగా రాసిన మోడర్న్ ఇండియా రాతప్రతిని నలుగురు ప్రముఖ చరిత్రకారులు– సర్వేపల్లి గోపాల్, నూరుల్ హసన్, రోమిలా థాపర్, ఆర్ఎస్ శర్మలతో కూడిన కమిటీ 80 సిట్టింగ్‌లలో ఆమోదించిందని తెలిపారు. కెఎన్




**గ్రామీణ క్రీడలపై నిర్వహించిన పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌లో పెయింటింగ్**



**నేషనల్ బుక్‌ట్రస్ట్ తెలుగు విభాగం సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్‌తో ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ సాదినేని శ్రీనివాస్, ప్రస్థానం మేనేజర్ కె. లక్ష్మయ్య**

పణిక్కర్ చరిత్ర పాఠ్యగ్రంథాలపై వ్యాఖ్యానించినట్లు తన మోడర్న్ ఇండియా ఒక టెలిఫోన్ డైరెక్టరీ మాదిరిగా లేకుండా జాగ్రత్త వహించానని అన్నారు. ఎందుకు, ఎక్కడ, ఎప్పుడు అనే మూడు ప్రధాన అంశాలను తన పుస్తకంలో వివరించడానికి ప్రయత్నించానని బిపన్ చంద్ర తెలిపారు.

ముందే చెప్పినట్లు ఈ ప్రదర్శన దేశంలోని పుస్తక ప్రచురణ, పంపిణీ, విక్రయాల తీరుతెన్నులను పరిశీలించడానికి ఒక వేదికగా ఉపయోగపడింది. ప్రత్యేకించి వివిధ భాషలకు చెందిన ప్రచురణ కర్తలు దీనిని ఒక అధ్యయన వేదికగా ఉపయోగించుకున్నారు. మన రాష్ట్రం నుండి కూడ పలు ప్రముఖ ప్రచురణ కర్తలు ఈ ప్రదర్శనకు హాజరయ్యారు. వీరితో పాటు చాల కాలంగా విజయవంతంగా పుస్తక ప్రదర్శనలను నిర్వహిస్తున్న హైదరాబాదు, విజయవాడ పుస్తక ప్రదర్శన సొసైటీలకు చెందిన వారు ఈ ప్రదర్శనను సందర్శించారు. తమ పుస్తక ప్రదర్శనల నిర్వహణలను మరింత మెరుగుపరుచుకునే దృష్టితో వారు ఈ ప్రదర్శనను పరిశీలించారు. హైదరాబాదులో వచ్చే ఏడాది జరగబోయే 25వ పుస్తక ప్రదర్శనకు ఎన్‌బిటి ప్రాయోజిత సంస్థగా వ్యవహరించాలని హైదరాబాదు పుస్తక ప్రదర్శన సొసైటీకి నేతృత్వం వహిస్తున్న బృందం చేసిన విజ్ఞప్తికి ఎన్‌బిటి చైర్మన్ బిపిన్ చంద్ర సానుకూలంగా స్పందించారు.

దాదాపు ప్రతి ప్రముఖ ఆంగ్ల ప్రచురణ కర్త తన ప్రచురణలను ప్రాంతీయ భాషలలోకి అనువదింపచేసి ఆ మార్కెట్లలోకి ప్రవేశించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నిస్తున్న విషయం ఈ ప్రదర్శనలో స్పష్టంగా వెల్లడయింది. వారే స్వంతంగా ప్రాంతీయ భాషల్లో ప్రచురించడం, లేదంటే ప్రాంతీయ భాషల్లో తమ పుస్తకాల హక్కులను విక్రయించడం పట్ల వారు ఎంతో ఆసక్తితో ఉన్నారు. ఒక పెద్ద హాలులో ప్రాంతీయ భాషల ప్రచురణలు ప్రదర్శించబడినాయి. దీనిలో హిందీ ప్రచురణలది సహజంగానే అగ్రస్థానం. పైగా మనం సాధారణంగా వూహించుకునే దానికి భిన్నంగా హిందీలో అభ్యుదయ, మార్క్సిస్టు

సాహిత్యం ప్రచురించబడుతున్నది. ఇంత పెద్ద ప్రాంతీయ భాషల హాలులో ఒక్క తెలుగు స్టాలు కూడ లేకపోవడం శోచనీయం. ఈ ప్రదర్శనలో మరొక ముఖ్యమైన అంశం- జర్మనీ, ఫ్రాన్స్ తదితర భాషల ప్రచురణ కర్తలు తమ పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువదింప చేసి భారత దేశంలోని ఇంగ్లీషు పుస్తక మార్కెట్‌లోకి ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడి మార్కెట్‌లోకి ప్రవేశించడం సులువుగాను, చౌకగాను ఉండటంతో, ముందుగా తమ పుస్తకాల ఇంగ్లీషు అనువాదాలకు ఇక్కడ లభించే ఆదరణను ఆధారంగా చేసుకొని అమెరికా, ఇంగ్లండు లాంటి దేశాల మార్కెట్లలోకి ప్రవేశించాలన్నది వారి వ్యూహం.



ప్రస్తుత ప్రపంచ పుస్తక ప్రదర్శన భారత దేశంలో నిస్సందేహంగా పెద్దదే. అయినప్పటికీ 1200 మంది పాల్గొన్న ఈ ప్రదర్శన గత ఏడాది 7300 మంది పాల్గొన్న ప్రపంచంలోని అతిపెద్ద ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శనతో పోల్చుకుంటే చాల చిన్నదే. అనేక లోటుపాట్లు కూడ ఈ ఢిల్లీ ప్రదర్శనలో కనిపించాయి. ఈ ప్రదర్శనకు సంబంధించిన వెబ్‌సైట్‌ను సైతం పూర్తి స్థాయిలో నిర్వహించలేకపోయారు. పాల్గొంటున్న వారందరి వివరాలు కూడ వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు. అప్‌డేటింగ్ కూడ అంతంత మాత్రమే. ఈ ప్రదర్శనను ప్రధానంగా పుస్తక వాణిజ్యం దృష్టితో నిర్వహించారా, సాధారణ పాఠకులను ఆకర్షించే దృష్టితో నిర్వహించారా అన్నది అర్థం కాలేదు. ప్రతి సారీ ఉచిత ప్రవేశం ఉండే ప్రదర్శనకు ఈ ఏడాది రు.20 ప్రవేశరుసుము పెట్టారు. దీనితో సాధారణ సందర్శకుల సంఖ్య తగ్గింది. వాణిజ్య దృష్టితో వచ్చిన వారూ ప్రదర్శన నిర్వహణ తీరు పట్ల పెదవి విరిచినట్లు వార్తలొచ్చాయి. పుస్తక వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి అనుగుణమైన కార్యక్రమాలను తగువిధంగా, తగినంతగా నిర్విహించలేదన్న అభిప్రాయం వ్యక్తమయింది. ఇతర అంతర్జాతీయ ప్రదర్శనలలో మాదిరి పుస్తకాల హక్కులు కొనుగోలుచేయడానికి ఒక ప్రత్యేక వేదికను ఇక్కడ ఏర్పాటుచేయలేదు. పుస్తక ప్రచురణకు, వాణిజ్యానికి సంబంధించిన సెమినార్లను కూడ తగినన్ని ఏర్పాటు చేయలేదు. ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ఈ ప్రదర్శనకు ఎన్‌బిటికి శాశ్వత ప్రాతిపదికన ఒక ప్రత్యేక యంత్రాంగం లేదు. ఇలాంటి లోటుపాట్లను సరిదిద్దుకుంటే ఈ పుస్తక ప్రదర్శన కచ్చితంగా ప్రపంచ ప్రమాణాలను అందుకుంటుంది. ■


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**

**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-** **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**

**అయిదేళ్లకు : రు. 500/- — పదేళ్లకు : రు. 1000/- — విడి ప్రతి : రు. 10/-**

**చందా దారులకు విజ్ఞప్తి** చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.

మేనేజర్

ప్రస్థానం

ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20

వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in





March 2010_Prasthanam.pmd 31 2/25/2003, 12:38 PM

## కవిత

# అదృశ్య హస్తాలతో సహకారం

జి. లెనిన్ శ్రీనివాస్



విడమర్చి చెప్పకుండా విలువలు దోచే
కలుగులో దాగిన కుతంత్రం యిది...
కష్టకాలాన్ని యిష్టంగా స్వీకరించి
కన్నీళ్లతో కాలువలు మళ్లించి
తొలిపొద్దు సంధ్యారాగ సమర్థులు
గొంగట్లో అన్నంపెట్టి
వెంట్రుకలు ఏరేపని సర్కార్ పురమాయిస్తుంది
తరతరాలుగా ఆత్మీయత పెంచుకుని
నేలల్లో నందనం సృష్టించిన
మట్టిముద్దలతో మల్లెతీగలా అల్లుకుని
ఆకలితీర్చిన అన్నదాతలకు
కాయకష్టం చేసే చేతులకు కళ్లెం యిది...
కార్పోరేటు ఉక్కు కవచాలకు
ధారదత్తంలో ఎత్తుగా
సాగుజీవుల సంకట పరిణామం
పెట్టుబడి దారుల నీలినీడలు
అధికారం అంగబలం వెంటాడుతూ
అమాయక జనులను వేటాడే క్రమం
అదృశ్యహస్తాలు అంటిపెట్టుకుని
సాధింపుల సహకారం నెగ్గాలని
అడుగడుగునా అవరోధాల అడ్డుగోడలు
ఊహల ఉనికిని గమనించలేని
మంచితనం వంచనకు గురికాబోతోంది
ఈ సంఘర్షణ, సంగ్రామానికి
సమిధలు రైతే రాజులు
తీయని మాటల మాటున దాగిన
స్వార్థ స్వాహాకారాన్ని సారించాలి
స్వార్థం ఎరుగని స్వేదం చిందించి
ఆశల మెతుకుల నందించే దాతకు
నమ్మకాల నీలిమేఘాలు కమ్ముతున్నాయి
మట్టితో పెనవేసుకున్న మమకారం
సహకారం సంధి పురుగుతో సందిగ్ధమై ముసురుతుంది
ఆదరణ కోల్పోయి అనూహ్య బ్రతుకుల
వ్యవసాయం పరపతి పెంచక
సహకారం సాధించలేక
పట్టిపోయిన వెట్టి జీవులపై
అప్పుడప్పుడు అక్రమకేసులు
ఎప్పటికప్పుడు లారీల లాలింపులు
సమగ్రయోచన ముద్దుపేరు
ఊహల ఊసుల్లో ఉత్పత్తుల ఊరట
స్వార్థానికి సేద్యం బలికాబోతోంది
సహకార వ్యవసాయం సమస్యల వలయం
కమతాలు కనుమరుగు కుట్ర
తాతలనాటి మట్టి మాగాణం
గొలుసుల సంకెళ్ల ఘోష కాబోతుంది
మేడిపట్టిన చేతులు తడిమి తట్టి
చిలపతొక్కిన కాళ్ళు నిలతొక్కోని
పిడికిళ్ళు బిగించి రణగర్జన చేయాలి
హక్కులు హరించుకుపోకుండా
ముసురుతున్న ముప్పును పసిగట్టి
రాబందుల రాక్షస ఆలోచనలు తిప్పికొట్టాలి !



March 2010_Prasthanam.pmd 32 2/25/2003, 12:38 PM

కథ

# అగాధం

నోముల చక్రపాణి



***విజయవాడ బస్సు స్టాండు బయట సిగరెట్ కాలుస్తూ నిలుచున్నాడు జనార్ధన్. బడ్డీకొట్టు ముందరి కాయిన్ బాక్సు ఫోన్లో నెంబరు కలుపుతున్నావిడనే చూస్తున్నాడు. రాత్రి పది కావస్తున్నది.***

***"జగ్గయ్ పేట్ జగ్గయ్ పేట్ ..........సార్ వస్తారా నాన్ స్టాప్ ఎక్కడ ఆగేది లేదు" డ్రైవర్ కుర్రాడు.***

రాను అన్నట్లు తల ఊపాడు జనార్దన్

కొత్త బండిసార్ అంబాసిడర్.... ఆర్టీసీ రేటే రండి"

నేను సూర్యా పేట వెళ్ళాలి "వెళ్ళు అన్నట్లు విసుక్కు న్నాడు.

"మరి ఆ విషయం ముందే చెప్పొచ్చుగా "....సనుక్కుంటూ వెళ్తున్నాడు....

ఆమెకు ఇరవై ఐదు ఏళ్ళుంటాయేమో ఎత్తుకు తగ్గలావు అందగత్తే.. ఫోను కలవనందుకో తనను అదే పనిగా చూస్తున్నాడనో విసుగ్గా అటువేపు తిరిగి ఫోన్లో కలుపుతోంది. ఊదా అంచు, నీలిరంగు చీర ఆమెకు అందగా నప్పింది. జాకెట్ రంగు పోల్చుకోటానికి బట్ట కంటికి ఆనటంలేదు అంతా వీపే కనిపిస్తున్నది. లోనెక్కులో ఆమె వీపు క్రిష్నా నదితీరంలో ఇసుక తిన్నెలా మెరుస్తోంది. శ్రీమతి గుర్తొచ్చింది... పండగకి కొత్త బట్టలేసుకొని దేవుని పటానికి మొక్కి తనకీ మొక్కి "ఎలావుంది డ్రెస్సు" అంటు పైట లేపి మోడల్ లా చుట్టూ తిరిగి" బాగుందా! అడిగింది.

"అదేంటి బాగాలేదా నాకు"

"ఏదో ఒకటి చెప్పొచ్చుగా మాట్లాడకుండ మొఖం మాడిస్తే ఏమన్నట్లు"

"అబ్బ అది కాదు చీర బాగుంది.. గొణిగాడు."

"జాకెట్ మ్యాచ్ అవలేదా"

తల అడ్డంగా ఊపుతూ "నాకు లోనెక్కంటే ఇష్టం ఉండదు"

"మరి రోడ్డు మీది లోనెక్కులను మెడలు విరిగేదాకా మళ్ళీ మళ్ళీ చూస్తారుగా

అయినా నా అందాన్ని వోర్వరు లెండి మీరు" మూతి విరుచుకుంటూ వెళ్ళింది.

"జగ్గయ్ పేట్ జగ్గయ్ పేట్" తనముందుకు రాగానే గట్టిగా అరుస్తు వెళ్తున్నాడు.

కుర్రనా కొడుకులకు పొగరెక్కువ. సనుక్కున్నాడు.

ఆమె తనకు పదడుగుల దూరంలో ఉంది క్రీ గంట చూస్తున్నాడు. మెడలో నగలు చేతులకి గాజులు ఉన్నవారింటి దాన్లా ఉంది. ఇటుకేసి చూస్తోంది.

తన చేతి వేళ్ళ ఉంగురాలు ఆమె ద్రుష్టిలో పడేట్లు ఫోజుకొడ్తూ చెంప నిమురుకుంటున్నాడు. హమాలీ వీరయ్య పెళ్ళాం గుర్తొచ్చి సడన్‌గా చెయ్యి తీసి జేబులో పెట్టుకున్నాడు. హమ్మో ఎంత గండం తప్పింది. మొన్న గోడౌనులో ఊడుస్తుంటే ఒంటరిగా చూసి దగ్గరకి లాక్కున్నాడు... ఎంత బలవో దానికి ఒక్క తోపు తోస్తే గోడకి కొట్టుకుని సంభాలించుకున్నాడు తను.

సూడూ సేటూ.. నీ సంగతి నాకు ముందే సెప్పింద్రు... మొగుడు సచ్చిన దాన్ని ఈడొచ్చిన బిడ్డను ఇంట్ల బెట్టుకోని నువ్విట్ల చేస్తే లొల్లి చేసి నలుగుర్లపడి బద్నామ్.. కాను"..

"అయ్యో పోనీలేవే.. తప్పయింది ఎవ్వరితో అనకు" ఉంగరం తీసి ఇవ్వచూపాడు.

బతకటానికి కూలిపని చేసుకుంటాం లేకుంటే వుపాసాలుంటం ఉంకోసారి నా జోలికొస్తే సంపుత ఆ ఉంగరం నీ పెళ్ళానికిచ్చుకో " ఇంకా ఏదో తిడుతుంటే జారుకున్నాడు తను. అట్లాంటి కూలిపని చేసుకునేదే తన ఉంగరాలకి లొంగ లేదు డబ్బున్నావిడలా వుంది ఈమె మీద అలాంటి ట్రిక్కులు పనిచేస్తాయా. రంభ సొగసులన్ని ఈమెకున్నాయి.. సడెన్‌గా ఇటేవస్తోంది.. సర్దుకుని చూపులుమళ్ళించాడు.

ఏవండి ఎక్స్క్యూజ్‌మి" తననేపిలుస్తోంది...

గాభరాగా చూసాడు.

ఏవండీ నేను జగ్గయ్యపేట వెళ్ళాలి. ఒంటరిగా ఆ కార్లో వెళ్ళాలంటే.. భయం.. మిమ్మల్ని చూస్తే మంచివారులా ఉన్నారు...



March 2010_Prasthanam.pmd 33 2/25/2003, 12:38 PM

అందుకే అడుగుతున్నా మీరూ జగ్గయ్యపేటే వెల్తున్నారా...

తననే అడుగుతోంది.. ఫ్యామిలీ లేడీ.. ఎర్రటి పెదాలు పెద్దకళ్ళు ఒంటరిగా అమాయకంగా.. తనను సహాయంగా రమ్మంటోంది.

"నేనా.. ఔను... జగ్గయ్యాపేటే వెళ్ళాలి.." ఎంత చక్కగా అబద్ధం ఆడాను తనని తానే మెచ్చుకున్నాడు.

"హమ్మయ్య" చాతి మీద చెయ్యివేసికుని రిలాక్స్‌గా నిట్టూర్చింది.." అయితే రండి.. అంటూ కారువైపు వెళుతోంది కళ్ళతోపిలుస్తోంది. ఈ హటాత్పరిణామానికి గుండె దగదగ కొట్టుకుంది... తనని తోడుగా రమ్మంటోంది కలిసిప్రయాణం కార్లో కుదుపులతో రాసుకుంటూ పూసుకుంటూ.. మనసు పరుగులు తీస్తుంటే కారువైపు వెళ్ళాడు.



ఆమె పక్కనే కూర్చున్నాడు.

''థాంక్సండీ.. ఒక్కదాన్ని ఎలవెళ్ళాలి అని భయపడ్డా తోడుదొరికారు.. అన్నయ్య జగ్గయ్యపేటలో వేట్ చేస్తానన్నాడు.."

పర స్త్రీ అంత దగ్గర్నుంచి మాట్లాడుతుంటే గుండెల్లో తీయని దడ. పెళ్ళై పదేళ్ళు... ఇద్దరు పెళ్ళాలు. ఇలాంటి యవారాల్లో అంతా కొత్త కొత్తగా ఉరకలు వేస్తాడు తను మురుస్తున్నాడు.

"జగ్గయ్ పేట్ జగ్గయ్ పేట్".. అరుస్తూ తన వేపే చూస్తున్నాడు డ్రైవర్ కుర్రాడు.. ఇందాకా అడిగితే సూర్యాపేట అన్నావు కదరా.. నీ యవ్వారం తెలిసిందేలే అన్నట్లున్నాయి వాడి చూపులు.

జనార్ధన్ దృష్టి మరల్చుకున్నాడు.

ఇంతలో పక్కసీట్లో దడాల్న ఎవరో కూలపడ్డాడు. లుంగీ మల్ మల్ లాల్చీ గిరజాల జుట్టు బుగ్గ వుబ్బి వుంది. ఏదో నములుతున్నాడు. అదో వాసన. ఓ డ్రైవర్ కుర్రాడా.. ఇంగ పోదాం పద ఎదర సవారీలు దొరికుతారు.. పా... పా".. అరిచాడు నమలటం ఆపకుండానే.

"జగ్గయ్ పేట్.. జగ్గయ్ పేట్" రెండు కేకలు వేసాడు.

లైటాపి స్టార్టు చేసాడు... కుదుపుతో వేగం అందుకుంది... కారులో చీకటి హెడ్ లైట్లు ముందుకురుకుతున్నాయ్.

ఆమె మెత్తగా తనవైపు వాలింది నిద్రలోకి జారినట్టుంది.. ఎవరిదో ఆస్తి దక్కినంత ఆనందం. గాలికిరేగుతున్న ఆమె ముంగురులు జనార్ధన్ ముఖంపై పడుతూ గిలిగింతలు రేపుతున్నాయి. కొంచెం డేర్ చేద్దామనుకుని పక్కతన్ని క్రీగంట గమనించాడు.. బుగ్గ అలా ఉబ్బే ఉంది కళ్ళు మూసుకుని నములుతున్నాడు.. నిద్రనటిస్తూ ఆమె మీదకు వొరిగాడు.. తన వడిలోకి జారిపోయింది... ఎవరో ఏమో ఫ్యామిలీలో అసంతృప్తి కావచ్చు.. ఆమె నెత్తిలో శాంపూ వాసన ఘాటుగా వస్తోంది.. ఆమె అందం తనవడిలో కరిగిపోతోంది. జగ్గయ్యపేట వరకు ఇలా.. తరువాత తనదారి తనది.. చూద్దాం.. జగ్గయ్యపేట రాకుంటే బాగుండు...

"దిగండి దిగండి జగ్గయ్‌పేట వచ్చింది..." డోర్లు తెరిచాడు డ్రైవరు కుర్రాడు.

ఆమె పర్సు వెదికి" చేంజి లేనట్టుంది. అందాకా మీరివ్వండి.. నోటు మార్చి ఇస్తానండి".. అన్నది.

"ఫర్వాలేదు... ఫర్వాలేదు..." ఇద్దరి డబ్బులు ఇచ్చేసాడు. లుంగీ అతను డబ్బులిచ్చేసి నములుకుంటూ వెళ్లిపోయాడు.

"... అన్నయ్య కనపడ్డంలేదేంటి.. వచ్చేదాకా ఉండండీ ప్లీజ్.." జనార్ధన్ చుట్టూ చూసాడు తెలిసిన వారెవ్వరూ లేరు.. ఆమెతో అంతసేపు అతుక్కుని ప్రయాణం చేసాకా వళ్ళంతా తిమ్మిరిపట్టి నాలిక పిడుచకట్టుకపోయింది.

''ఏమైపోయాడో అన్నయ్య.. చాలాసేపయింది.. ఒక్కసారి అన్నయ్యకి ఫోన్ చేసివస్తానండి... ప్లీజ్".. కాయిన్ బాక్స్ ఫోన్ వైపు వెళ్తోంది.. "ఆగండి.." సెల్ తీసాడు.." నంబర్ చెప్పండి.

ఆమె మొహమాటం పడుతూ'' వద్దండీ"

"ఫర్వాలేదు చెప్పండి"...

చెప్పింది.. నంబర్ కలిపి...'' పటండి రింగవుతోంది" సెల్ ఇచ్చాడు

"హలో అన్నయ్యా" ఆందోళనగా కళ్ళు విప్పారించి మాట్లాడుతోంది. చెదిరిన పైట బొడ్డుకిందికి జారిపోతున్న చీర కట్టుపట్టించుకునేలా లేదు. ఎక్కడున్నావన్నయ్యా... నేను జగ్గయ్యపేట సెంటర్లో దిగేసా.. ఏంటి నువ్వు సూర్యాపేటలో ఉన్నావా రావటం కుదరదా నేను బావగారింటికి వెళ్ళాలా... అక్కయ్య ఊళ్ళో లేదుగా.. హలో హలో.. సార్జింగ్ అయిపోయిందట.. ఫోన్ కట్టైంది. బావగారింటికి వెళ్ళమంటున్నాడు."

"వెళ్తారా పదండి దిగపెడ్తా" అయిష్టంగా అన్నాడు.

"అమ్మో.. అక్కయ్య ఊర్లోలేదు. బావ తాగుతాడు.. తాగితే మడిసి కాదండి ఇప్పుడెలాగ" తనవైపు అసహాయంగా చూస్తోంది వచ్చింది ఛాన్సు "చూడండి ఇంత రాత్రప్పుడు ఇలా రోడ్డుపై ఉండటం మంచిది కాదేమో.. మీకభ్యంతరం లేకపోతే ఏదన్నా లాడ్జింగుకి వెళ్దాం పొద్దున్నే వెల్దురులెండి" పాచిక వేసినంత ఆనందం.

ఆమె అటూ ఇటూ కలయగ చూసి భయం భయంగా సరే అన్నట్టు తలఊపింది.

కాళ్ళు తడబడుతూ వుంటే తప్పటడుగులు వేస్తూ లాడ్జింగ్ వైపు నడిచాడు జనార్దన్...

"ఎయ్ డ్రైవర్ సూర్యాపేట పోనీ, నిన్నే సూర్యాపేటకు పోనీ".. కలవరిస్తున్నాడు

"ఏవండీ ఏవండీ.. ఏంటా కలవరింతలు" శ్రీమతి పిలుపు...

''ఏం లేదోయ్ రాత్రి పనిమీద జగ్గయ్యపేట వెల్దామనుకున్న..."

కళ్ళు తెరిచి చూసాడు ఒక్క ఉదుటున లేచాడు. లాడ్జింగు గది. తెల్లారింది మాసిన కిటికీ పర్దాలకు ఈగలు ముసురుతున్నై.

ఆమె చీర కుచ్చిళ్ళు దోపుకుంటూ కొంటెగా నవ్వుతోంది.

రాత్రి రంభలా ఉండె ఇప్పుడు ఇలా భయపెడ్తూందేంటి. తాగిన నోరు ఆముదాలు బుక్కిందంటే ఇదే మరి అనుకుంటున్నాడు. దగ్గరగా వచ్చి "ఏవండి.. కాస్తా హుక్కులు పెట్టండి" అడుగుతోంది.

అంత అందంగా ఉన్న వీపు బండలా ఉందేంటి.

"నాకు రాదు" దూరం జరిగాడు.



March 2010_Prasthanam.pmd 34 2/25/2003, 12:38 PM

"మీ మగాళ్ళకి ఊడ దీయటమే వచ్చులేండి"

క్షణంలో బ్యాగుతో నిలుచుంది. కాలివేళ్ళు నేలకు రాస్తూ" రాతిరి మీరలా చేసింది ఎవరితో చెప్పకండి నేనలాంటి దాన్ని కానండి థాంక్సండీ వస్తా" వెళ్ళిపోయింది.



అరగంట తర్వాత జగ్గయ్య పేట వీధుల్లో నడుస్తున్నాడు. ఖాళీపర్సు మిగిలింది. రాత్రి లాడ్జింగులో దిగగానే ఇంటినించి ఫోనువస్తుందని స్విచ్ఛాఫ్ చేసి మెత్త కింద పెట్టిన సెల్లు దాంతో పాటే ఉన్న కొన్ని డబ్బులు మిగిలాయి.

గుడిసెల ముందు కలాపి చల్లి ముగ్గులేస్తున్నారు.

తప్పుచేసినట్టు బాధ పడుతున్నాడు బుద్ధిగా ఉండాలను కొంటాడు... కుక్కతోకలా దారిమళ్ళుద్ది.

చాయ్ మరుగుతున్న వాసన చల్లటి గాలిలో కలిసి ఘుమఘుమ లాడుతోంది.

పాకా హోటల్ కుర్రాడు పిలుస్తున్నాడు" సార్ వేడి వేడి టీ"..

గరం చాయ్ గొంతులోకి జారుతుంటే తను దేన్లో నుంచో బయట పడుతున్నట్టుంది జనార్దన్‌కు

హోటల్ లోపలిగదిలో నుండి మాటలు వినిపిస్తున్నాయి.

"మామా ఎన్ని రోజులు ఈ ట్రిప్పు" స్త్రీ గొంతు

పదిహేను రోజులవుద్దే అస్సొందాకా ఎల్లిరావాలె" డ్రైవరులా వుంది.

అవును డ్రైవరే అనుకున్నాడు జనార్ధన్.. హోటల్ ముందు లారీ ఆపిఉంది. క్లీనర్ కుర్రాడు లారి మీద తార్పాలీను పై తాళ్ళు లాగి బిగుతుచూస్తున్నాడు.

"ఎళ్ళొస్త లక్ష్మి

"సరె ఈ సారి పదిహేను మార్లు ఆ తప్పుడు పని చేసే వస్తావా" ఆమె.

"తప్పుడు పనేంటి నువ్వెప్పుడు లెక్కపెట్టినవు పదిహేను"

"అవి కొన్నది నేను నాకు తెల్వదా"

"ముందు నుంచీ నువ్వు కొనిస్తున్న వనే కద నేను తీసుకపోతున్నది" డ్రైవర్.

"ఇచ్చిన ప్రతిసారీ మొత్తుకుంటనే ఉన్న కద ఒద్దు మామా తప్పుచెయ్యొద్దని.. ఎంత బతిమిలాడినా ఇంటున్నవా"

"నేను మొగోన్ని నాకా సొతంత్రమున్నదే"

"ఎక్కడ రాసి ఉంది ఏ దేవుడు సెప్తాండు"

"దేవుడే సెప్తాండే ఆకాసవానంటే ఎనకట దేవుడే కద రోజుకు యాభైసార్లు ఆకాసవాని రేడియోల సెప్పుతుందా లేదా కండోం వాడండీ కండోం కొనండీ అని"

"ఓహో అట్లనా.. అవుకద మామా నేను మర్సేపోయిన ఆకాసవానిలా నాకూ సెప్పింద్రు ఇగో నేనూ కొనుక్కున్న"

"ఏయ్ ఏంటియే అవి దొంగ ముండ సంపేత్త, పారేయ్ వాటిని సిగ్గులేదే ఆడదానివైయుండి"

"ఆడోళ్ళు కొనొద్దు మొగోల్లే కొనాలె అని ఆకాసవానిల సెప్పింద్రా ఆడయినా మొగయినా చేస్తున్న తప్పుకు దీన్ని తొడుకున్నంత మాత్రాన తప్పు తప్పుకాకుండా పోతాదిర, రోగాలు రావేమో పోయిన శీలమొస్తాదిర నేను ఉత్తగ గీ కండోములు పట్టుకుంటనే గిల గిల కొట్టుకుంటున్నావు మరి లడీలకు లడీలు అవి మెడల ఏసుకోని లంగా పన్లు చేసొస్తున్నవు నీకు సిగ్గులేదుర.

"ఏయ్ బల్సిందా.. మరి ఎందుకు ఇవ్వటం అలవాటు చేసినవో చెప్పు" డ్రైవర్

"నా మీదకే మలుపుతున్నవా సిగ్గులేనోడ.. అప్పుడే మర్సినవా నీ అన్న నర్సిమ్మకు ఏడ్సు తగిలి పీనుగైపోయింది ఆని పెళ్ళానికీ ఆ రోగముందని బోరింగుతానికి రానీయకుండా బస్తీలకెల్లి ఎల్లిపోవాలని గుడిసె మీద రాల్లేస్తొటే ఏదారీలేక గ్యాసునూనే పోసుకొని అన్నెం పున్నెం ఎరుగని చంటి బిడ్డతో సహా కాలిబూడిదైన నీ వదిన సంగతి ఎట్ల మర్చినవ్. నీ వదినలాగ నేనూ సావాల్సివస్తదని కొనిస్తున్న మన బిడ్డనీ బాయిల పడేసో గ్యాసునూనె పోసో సంపాల్సి ఒస్తదని కొనిస్తున్న ఏం మొగోనివిరా నువ్వు" ఏడుస్తోంది శోకాలు పెట్టి.

"లచ్చిమీ పొరపాటయిందే.. బుద్ది తక్కువయిందే ఏడవకే"

"నీతి లేనోడ షరం లేనోడ. నువు.. గా లఫంగి పనులు చేసుకుంట ట్రిప్పుమీద పోయొచ్చిన ప్రతిసారి నీ దగ్గర పండాలంటే సంసారం లాగ లేదురా సావాలనిపిస్తది.. ఛీ ఛీ బతుకుల మన్నుపడ ఆడ దానికే అన్ని కష్టాలు ఈ భూమ్మీద. నాకొద్దు గీ సంసారం నేనుండ నీతాన పోత నా తల్లిగారింటికి పోయి గీ కష్టం ఆడ చేసుకుంట బతుకుతం" ఏడుస్తోంది.

"లచ్చిమీ తప్పయిందే ఇగో చెంపలేసుకుంటున్న ఇవి నాకనవసరం లేదే బుద్దొచ్చిందే" నేలకేసి కొట్టాడు. "మల్ల తప్పుడు పని సేయనే, నీ మీద పిల్లల మీద ఒట్టే, నన్ను నమ్మవే ఏడవకే, మన యాదగిరి సామి మీన ఒట్టు" బ్రతిమాలుతున్నాడు.

"అన్నా అన్నా" క్లీనరు తలపుబాదుతున్నాడు.

"ఏందిరా" డ్రైవర్ లోపల్నించే అరిచాడు.

"సేటు గుమాస్తాని పంపిచ్చిండు.. ఆర్.టీ.ఏ ఓల్లు ఏడుగంటలకే సెకింగు పెడ్తరట ఆ లోపల్నే లోడు ఊరు దాటించుకోని పొమ్మంటాండు." సిగరెట్ అంటించి బయల్దేరాడు జనార్ధన్. కరెంటు స్తంభానికి కట్టిన బోర్డు మీద" కండోం కొనండి" పెద్ద అక్షరాలు. కాళ్ళు వణుకుతున్నాయి.

అవును తనెందుకు కొనలేదు కండోం తన శ్రీమతి యెందుకు కొనివ్వలేదు డ్రైవర్ పెళ్ళాం కొనిచ్చిందిగా.

దూరంగా యెవరో వస్తున్నారు తెలిసినవారిలా ఉన్నారే.

సందులోకి నిలుచున్నాడు. ఎక్కడో చూసినట్టుందే. సిగరెట్ జారిపడింది. ఆమె రాత్రి తనతో లాడ్జింగులో...

పక్కనే తమతోపాటే కార్లో వచ్చిన లుంగీవాడు బుగ్గ అలా ఉబ్బే ఉంది నములుకుంటూ మాట్లాడుకుంటూ వెళుతున్నారు..

అంటే వాళ్ళిద్దరు ఒకటేనా.. గుండెలో దడ గొంతు ఆరిపోతోంది..

సెల్ తీసి రాత్రి ఆమె అన్నయ్యకు చేసిన నెంబరు వెదికి రింగ్ ఇచ్చాడు.

అవును లుంగీవాడు సెల్ తీసి చూస్తున్నాడు. ఎంత మోసం



March 2010_Prasthanam.pmd 35 2/25/2003, 12:38 PM

# మగ్గం మునిగింది

పున్న అంజయ్య



ఇప్పుడక్కడ
నిత్యం నృత్యం చేసే
మగ్గం చప్పుళ్ళు విన్పించవు

ఇప్పుడక్కడ
పట్టుచీరల
మడతలు కన్పించవు
మొగిలి రేకుల
గుభాళింపులసలే లేవు
సీతారాముల కళ్యాణాలకు
పట్టు వస్త్రాలల్లిన నేతన్నల
బతుకుదారం చిక్కుపడింది

వరద ఉగ్రరూపానికి
పట్టుచీరల ప్రసిద్ధి
గద్వాల్ గడగడ వణికింది
జాలి జాలిగా రాజోలి
నేల కూలింది

విరిగిన రాట్నం
కూలిన మగ్గం
వరదలో కొట్టుకుపోయిన
పట్టుచీరే సాక్ష్యం
ఇప్పుడు
నేతన్నకు మిగిలింది శాశ్వత నిద్రే.

***(వరద ఉధృతికి రాజోలిలో నేలమట్టమైన మగ్గాలషెడ్డు' వార్త చదివి)***

# దుమ్ము కమ్ముకుంటున్న వేళ....

జుగాష్‌విలి

నిన్నటి అనుభూతుల్ని పాతర తీసి పాతిపెట్టు
మళ్ళీ మొలకెత్తకుండా అరచేతితో అదిమి పట్టు

మరుపు నిన్నావరించనీ
పాత జ్ఞాపకాలేవో గుర్తుకొచ్చి నీ కాళ్ళకడ్డం పడొచ్చు



ప్రేమ చొరబడని కవచమేదో
గుండె నిండా కప్పుకో
వలపు తెమ్మెరతాకి నీవులిక్కిపడవచ్చు

అనవసర ద్వేషంతో నైనాసరే
నువ్వెప్పుడూ రగిలిపోతుండాలి
మనసెప్పుడన్నా వెనక్కి తిరిగి గింజుకోవచ్చు

నీవు నడిచే దారి నీకు నచ్చాలంటే
చూపులెప్పుడూ అంబరానికే అంటుకోనివ్వు
దుమ్ము కమ్ముకుంటున్న మర్మమేమిటో నీ మతిని కెలకవచ్చు.

నీ ఆలోచనల లెటు పరుగెడితే
నీ అస్థిత్వాన్నీ అటే పరుగెత్తనివ్వు
వెనక్కి తిరిగిచూడకు
నీ సహచరుడెప్పుడూ నీ వెనుకే వుండి నీకు అశాంతి నిస్తాడు.

---

వ్యభిచారం.

అమాయకుల్ని అసహాయుల్ని తన డబ్బుతో తెలివితో లొంగ తీసుకోవచ్చని అనుకున్నాడు గుండెలో భయం దడ తనకేదయినా రోగం తగిలితే..

ఇంటికెళ్తే ఎలా అందులో ఈ రోజు శుక్రవారం శ్రీమతి నైట్.. ఏదో కారణం చెప్పి దూరం పడుకోవాలి.

మరి తరువాతా...

సూర్యాపేటలో దిగి ఇల్లు చేరుకుంటున్నాడు ఇంటి ముందు కార్లు బైకులు ఆగి ఉన్నాయి... పెద్ద అరుపులు వినిపిస్తున్నాయి. అన్నయ్య హార్ట్ పేషెంట్.. ఏమన్న అయిందా.. దగ్గరికి వెళ్ళేసరికి గేటుకు పూలదండలు.. లోపల్నించి "సామియే య్.. శరణమయ్యప్పా..." హమ్మయ్య అన్నయ్య కొడుకు అయ్యప్ప దీక్ష పట్టిండన్న మాట.. ఈ నలభై రోజులూ ఇంట్లో అంతా విడి విడిగా పడుకుంటారు.. ఊరట కలిగింది. డాక్టర్ పరీక్ష చేయించుకోవాలె ఒక్కసారికే ఏ జబ్బు అంటదులే అనుకున్నాడు. అయ్యప్పా కాపాడు తండ్రి మొక్కుకున్నాడు. తను తప్పుచేస్తే దేవుడెలా కాపాడుతాడు నిట్టూర్చాడూ...

నలభై రోజుల దీక్ష పూర్తయింది.. ఆరునెలలైంది.. సంవత్సరమైంది.. జనార్ధన్ ఎప్పుడూ తన భార్య దగ్గర పడుకోలేదు. జానెడైనా లేని కండోం. (కొననందుకు) తను ఎన్నటికీ దాటలేని అగాదాన్ని తవ్వింది. కొన్ని నిమిషాల తప్పుడు కలయిక జీవితాంతం తన భార్యాను కలవకుండా చేసింది. సూర్యాపేట పాత బస్సు స్టాండు దగ్గర ఓ వ్యాన్ ఆగి ఉంది. ఆ వ్యానుకి నాలుగు వైపులా కటౌట్లు కట్టి ఉన్నాయి. ఆ కటౌట్లపై.. కండోం కొనండి కండోం కొనండి...

తప్పుడు పని చేయటానికి ఒకసారి ఆలోచించండి...

కాని కండోం కొనటానికి అలోచించకండి.. ఒక్కసారి కూడా ఆలోచించకుండ కండోం కొనండి... కండోం కొనండి.. కండోం కొనండి.. కటౌట్లపై రాసిన సందేశాన్ని రికార్డు చేయించి లౌడు స్పీకర్లో పదే పదే వినిపిస్తూ కొత్తమతం ఏదో ప్రచారం చేస్తున్నట్టు బస్సు స్టాండుళ్ళో మార్కెట్ దగ్గర లాడ్జింగుల దగ్గర రద్దీ స్థలాల్లో తిప్పుతుంటాడు జనార్ధన్

సూర్యాపేటలో దొరవారి పాత గిర్ని దగ్గర తమ స్థలంలో ప్రహరి గోడలో రెండు గదులు వేయించుకుని ఉంటున్నాడు

ఆయాను ఏర్పాటు చేసారు. అప్పుడప్పుడు వదినా, శ్రీమతీ, పిల్లలు వస్తుంటారు. దూరం దూరం మసులు తుంటారు.. కన్నీరు పెడుతుంటారు.. జనర్ధన్‌కు ఏయిడ్స్. జగ్గయ్యపేటలో భర్తకు కండోములు కొనిచ్చిన పాకా హోటల్.. లారీ డ్రైవర్ పెళ్ళాం గుర్తొస్తవుంటది.. తన భార్యవైపు చూస్తూ అడుగుతుంటాడు. "మీరైతే కండోం కొంటారా.. మీరైతే కండోం కొంటారా అని" అని. కుటుంబ సభ్యులు విస్తూ పోతుంటారు.

■



March 2010_Prasthanam.pmd 36 2/25/2003, 12:38 PM

## కవిత

# తోక - మీసం

హిందీమూలం: **అశోక చక్రధర్ (ఢిల్లీ)**

అనువాదం: **డాక్టర్ వెన్నా వల్లభరావు**



మీసమున్న వాడొకడు
తోకున్నవాడు మరొకడు
మీసమున్న వాడి గురించి ఎవరూ ఏమీ అనరు
తోకున్న వాడి గురించే అందరి గొణుగుడు

మీసమున్న వాడి వద్ద
నిలబడ్డ మీసపు ప్రశ్న
తోకున్న వాడి వద్ద
వంగిన తోక జవాబు
తోకకి
రెండు కొనలుండవు
ఉంటే భయపడి ముడుచుకుంటుంది
లేకుంటే ప్రేమతో ఊగుతుంది,
చంపుతుంది లేదా చస్తుంది
కాని ఒక్క సమయంలో
ఒకే పని చేస్తుంది
మీసం ఎందుకు బలహీనం?

ఎందుకంటే-
అది రెండుగా విడిపోయింది కాబట్టి!
ఒక వంగిన మీసంవాడు
వంగిన తోకవాడితో అన్నాడు-
'మిత్రమా!
నేను జీవితంలో పైకి రాలేకపోతున్నాను'

తోకగలవాడన్నాడు-
'అవును నువ్వు బొత్తిగా పైకిరాలేవు
కారణం క్షణంలో తెలిసేలా చేస్తాను
నువ్వు చెయ్యి వెయ్యకుండా
నీ మీసం పైకి లేపు చూద్దాం...

నేనైతే ముట్టుకోకుండా తోక లేపి చూపిస్తాను!'
ఏది తనంతట తాను లేవగలిగితే
అదే పైకి రాగలుగుతుంది...
అందుకే
తోకగలవాళ్ళదే ఎప్పుడూ అధికారం!'

# చెమట చిరునామా

**ఉదారి నారాయణ**



చెమట రూపాన్ని
చూపించగలవేమో !
కానీ...
చెమట స్వరూపాన్ని చెప్పగలవా !?
కంకరగా ముక్కలైన కొండల్లోంచి
ఆనకట్టగా ఒక్కటైన మట్టి పెళ్లల్లోంచి
పంటకాలువలై, తారు రోడ్లై
ఫ్లైఓవర్ బ్రిడ్జీని ఎత్తిన
పగటి సూర్యుళ్లై
పాలమూరు పచ్చిబాలెంతలై
నొసట మెరిసేది చెమట చుక్కలే !
ఎడారుల్ని
అడవి రహస్యాల్ని విప్పిన

ఆదిమ పాదముద్రలు
శ్రమశక్తికి తొలి ఆనవాలు
శరీర నదినుంచి పారే నీటిధార చెమట
దేహం కుండనుంచి చెమ్మగిల్లే
నిశ్శబ్ద ప్రవాహం చెమట
శ్రమ ఒక మనిషి సంస్కారం
చెమట శ్రమశక్తికి పూసిన
అపూర్వ సుగంధ పరిమళం
మనిషి చెమట మూటను మోస్తున్న
నిరంతర బాటసారి
సూర్య చంద్రులు, భూమి
చరచరా చలన రాశులన్నీ
శ్రమకు తొలి శ్వాసలు
చెమటకు చిరునామాలు

అది చేతుల అలల్లోంచి
ఎగిసి పడే నీటి ముత్యమే కాదు
అది తాజ్‌మహల్‌ని చెక్కిన
అద్భుత శక్తే కాదు
నియంతల కిరీటాల్ని
భూస్థాపితం చేసే మహాప్రళయం,



March 2010_Prasthanam.pmd 37 2/25/2003, 12:38 PM

# కొత్త పుస్తకాలు

## ఐఐటీలో అత్తెసరుగాళ్ళు




ఇంగ్లీషు: **చేతన్ భగత్**

తెలుగు: **ఆర్. శాంతసుందరి**

**పేజీలు : 253 వెల : 95/-**

**లభ్యత: 91-11-23262905**

చేతన్ భగత్ రెండు బ్లాక్‌బస్టర్ నవలలు ఫైవ్ పాయింట్ సమ్‌వన్ (2004), వన్ నైట్ @ కాల్ సెంటర్(2005) రాశారు. ఆ రెండూ అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాల్లో మొదటిస్థానంలో ఉంటూ వచ్చాయి. 2008 మార్చిలో న్యూయార్క్ టైమ్స్ అతన్ని భారతదేశ చరిత్రలో ఇంగ్లీషు భాషలో అత్యధికంగా అమ్ముడవుతున్న నవలాకారునిగా పేర్కొంది. అతని రెండు నవలలూ ఎన్నో బాలీవుడ్ సినిమాలను ప్రభావితం చేశాయి.

**ప్రచురణకర్తలు**

## ఠాగూరు గీతాంజలి




అనువాదం: **భూషి కృష్ణదాసు**

**పేజీలు : 106, వెల : 60/-**

**లభ్యత: విశాలాంధ్ర, ప్రజాశక్తి పుస్తకాలయాలు**

"టాగోర్ గీతాంజలికి భూషికృష్ణదాసుగారి అనువాదం నిర్దుష్టంగా, చక్కగా, హాయిగా సాగింది. సహృదయులైన పాఠకులకు మూలరచననే చదువుతున్నాము అనే అనుభూతి కలుగజేసేట్టుగా వుంది. వీరు ఈ అనువాద కృషిని రెండేళ్ళు దీక్షగా మనసు పెట్టి చేసి సత్ఫలితాన్ని సాధించినారు. తెలుగులో గీతాంజలికి చాలా అనువాదాలు వచ్చినవి, వాటిల్లో ఇది ఒకటి అని కాకుండా, ఒక్క చక్కటి అనువాదం, ఉత్తమ స్థాయికి చెందిన అనువాదం చదివాము అనే తృప్తి పాఠకులకు ఇవ్వగలిగిన రచన ఇది.

**దీవి సుబ్బారావు**

## హాస్యరచనలు




**డా॥ ద్వా.నా. శాస్త్రి పేజీలు : 54 వెల : 25/-**

**లభ్యత: 040-24744580/ 24735905**

ద్వా.నా. తన హాస్యంలో కూడా ఒక ప్రయోజనాన్ని ఆశించినవాడు. ఒక విమర్శకుడు, ఒక సమీక్షకుడు కాబట్టి తన హాస్య రచనల్లోనూ ఒక సంస్కరణ వైఖరి, ఒక వ్యంగ్య వైభవం, ఒక చమత్కారం కనిపిస్తుంటాయి. ద్వాదశి నాగేశ్వరశాస్త్రిలోని హాస్య చంద్రకళలు సంపూర్ణ పౌర్ణమి కాకున్నా 'ద్వాదశి' గొప్ప తిథే! ద్వా.నా. పాఠక హృదయాలకు సదా ఆత్మీయ అతిథే!

**సుధామ**

## మానవుడే నా సంగీతం




**(శ్రీశ్రీ శతజయంతి కవిత)**

**సంపాదకులు: హిమజ్వాల**

**పేజీలు : 92 వెల : 40/-**

**లభ్యత: 99497011207**

"డెరెక్ వాల్‌కాట్‌కి సముద్రమంటే ఎంత ఇష్టమో, శ్రీశ్రీకీ అంతే ఇష్టం. సముద్రాన్ని కోల్పోవటం చిన్న విషయం కాదు. 'సముద్రాన్ని కోల్పోయిన జీవితం దేహాన్ని కోల్పోయిన వస్త్రం లాంటిద'న్నాడు వాల్‌కాట్ చమత్కారంగా. శ్రీశ్రీని కోల్పోవటమూ అంతే. శ్రీశ్రీ లేని ఆధునిక తెలుగు కవితకు ఆత్మ లేని అక్షరం లాంటిది. నిజం చెప్పాలంటే శ్రీశ్రీ తెలుగు కవితకు ఆత్మనే కాదు. ఆకృతిని కూడా ఇచ్చాడు."

**సతీష్‌చందర్**

## ఊ కొడదాం.!




**బమ్మిడి సరోజిని • జగదీశ్వరరావు**

**పేజీలు : 55 వెల : 25/-**

**లభ్యత: 9290070987**

ఈ కతలన్నీ మనవి. మన వారసత్వ సంపద. ఇవి పెద్దలు పిల్లలకు చదివి చెప్పవలసిన కతలు. ప్రజల నాల్కల మీద చిత్రిక పట్టిన కతలు. కాలప్రవాహం మరుగున పడేస్తున్న కతలు. ఇప్పటికే చాలా కతలు చెరిగిపోయాయి. పాతతరంతో పాటే పోయాయి. అలా పోయినవి పోగా మిగిలినవి భద్రపరచుకోవాలనే ఆశతో చేసిన ప్రయత్నంలో భాగమే ఈ పుస్తకరూపం. ఈ కతలు కాలపరిమితికి లోబడి వున్నాయని మనవి.

**రచయితలు**

## నిసార్ పాట




**ఉద్యమ గీతాలు**

**నిసార్**

**పేజీలు : 112 వెల : 30/-**

**లభ్యత: 9490952285**

"నిసార్ జీవితం ఎంత వైవిధ్యమో, అంతే వైవిధ్యంగా, అద్భుతంగా రాస్తున్న ప్రతిభావంతుడు. అభివ్యక్తిలో, బాణీలలో, లయాత్మకంగా నాట్యమాడే చరణాలతో పల్లెను, మట్టి మనుషుల జీవితాన్ని అద్దంలో చూపించగల అతికొద్ది పాట కవుల సరసన నిలబడవలసిన కవి నిసార్. ప్రజా జీవితంలోని సుఖదుఃఖాలను, ఆనంద ఆవేశాలను, నిబద్ధతతో నిజాయితీ, శ్రామిక పక్షపాతంతో, కలంబట్టి పాటల పల్లవులను పలుగురాళ్ళవలె విసురుతున్న నిసార్ కవిమిత్రునికి జయహో!"

**గోరటి వెంకన్న**



March 2010_Prasthanam.pmd 38 2/25/2003, 12:38 PM

# కొత్త పుస్తకాలు

## వన్ నైట్ @ ద కాల్ సెంటర్




ఇంగ్లీషు: **చేతన్ భగత్**

తెలుగు: **ఆర్. శాంతసుందరి**

**పేజీలు : 239 వెల : 95/-**

**లభ్యత: 91-11-23262905**

"2004 చలికాలంలో ఒక రాత్రి రైలు ప్రయాణంలో ఒక రచయిత ఒక అమ్మాయిని కలుసుకుంటాడు. కాలక్షేపానికి, ఆమె అతనికి ఒక కథ చెప్తానంటుంది. కాని, దానికో షరతు పెడుతుంది: అతను దానిని తన రెండో పుస్తకంగా రాయాలి. అతను వెనకాడతాడు, అయినా ఆ కథ దేని గురించి అని అడుగుతాడు. ఆ కథ కాల్‌సెంటర్లో పనిచేస్తున్న ఆరుగురు వ్యక్తుల గురించి అని, అది ఒక రాత్రి జరుగుతుందని ఆ అమ్మాయి చెప్తుంది."

**ప్రచురణకర్తలు**

## తోలేటి కథలు




**తోలేటి జగన్మోహనరావు**

**పేజీలు : 192 వెల : 100/-**

**లభ్యత: 09810308998**

"1977 నుంచి కథలు రాస్తున్న తోలేటి 'తోలేటి జగన్మోహనరావు కథలు', 'లక్ష్మీకటాక్షం' పేరిట సంపుటాలుగా వెలువరించారు. ఈయన కథల్లో హాస్యం, వ్యంగ్యంతో పాటు గాంభీర్యం పాఠకుల్ని అబ్బురపరుస్తాయి. జీవితాన్ని గురించిన లోతైన అవగాహన, తాత్త్వికచింతన – ఆయన సొంతం. ఆయన రచించిన మరో గ్రంథం 'రెండో ప్రపంచయుద్ధంలో రష్యా' తోలేటి పరిశోధనా పటిమకు నిదర్శనం."

**తాళ్ళపల్లి మురళీధరగౌడు**

## అనగా వినగా చెప్పగా



**బమ్మిడి సరోజిని • జగదీశ్వరరావు**

**పేజీలు : 58 వెల : 25/-**

**లభ్యత: 9290070987**

"అందిస్తాం అంటూ కతలు చెప్తామంటూ కొంతమంది సంస్థలుగా – కార్పొరేట్ సంస్థలుగా అవతారమెత్తారు. ఈ పరంపర ఇక్కడితో ఆగదు. ప్రతిదాన్నీ వ్యాపారం చేసే ప్రభుత్వాల ప్రోత్సాహంతో... రిలయన్స్ లాంటి వ్యాపార సంస్థలు అన్నిట్లోకీ వస్తున్నాయి. ఆ పై విదేశీ సంస్థలొచ్చి స్వదేశీ కతల్ని చెపుతాయి. మరి రేపు మన స్వదేశీ కతలమీద విదేశీ వ్యాపారులు పేటెంట్ హక్కు పొందితే? కతలు మావి... చెప్పాలన్నా వినాలన్నా కప్పం మాకు కట్టండి అంటే? అప్పుడు కత ఇలా వుండదు!"

**బమ్మిడి జగదీశ్వరరావు**

## ఎడతెగని ప్రయాణం




**యాకూబ్**

**పేజీలు : 148 వెల : 60/-**

**లభ్యత: 9849156588**

"ఎన్ని రకాలుగా జీవితాన్ని, ప్రపంచాన్ని చూడొచ్చు, ప్రతి అంశాన్ని, విషయాన్నీ పట్టిపట్టి చూడటం – లోతుల్లోకెళ్ళి మాట్లాడటం – బహుశ యిది ఎవరి కవిత్వానికయినా, ఒక అథెంటిసిటీని, ఒక ఒరిజినల్ టచ్‌నీ ఇస్తుందనుకుంటా! 'ప్రవహించే జ్ఞాపకం' నుంచి 'సరిహద్దురేఖ'ను దాటి సువిశాల జీవనావరణంలోకి ఈ కవితాసంపుటి 'ఎడతెగని ప్రయాణం'తో ప్రవేశించాడు యాకూబ్"

**కె. శివారెడ్డి**

## దృక్పథాలు




**డా॥ ఎస్వీ సత్యనారాయణ**

**వెల : రూ. 80/- పేజీలు : 186**

**లభ్యత : 9908465631,9248032107**

ఆధునిక తెలుగు కవిత్వంపై ఇప్పటికే ఎంతో విశ్లేషణ జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. ఎప్పటికప్పుడు వినూత్న కవితా ధోరణులతో, ఉద్యమాలతో తెలుగు కవిత్వం బహుముఖాలుగా విస్తరిస్తూనే ఉంది. సుసంపన్నమౌతూనే ఉంది. ఈ క్రమంలోనే అనేక వినూత్న ఆవిష్కరణలు జరుగుతున్నాయి. కొత్త విషయాలు వెలుగులో కొస్తున్నాయి. నేటి యువతరానికి, విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు ఆధునిక కవితా దృక్పథాలను పరిచయం చేయాలన్న సంకల్పంతో రూపొందించిన గ్రంథమిది.

**రచయిత**

## స్వేచ్ఛ - సౌందర్యం




**పుప్పాల కృష్ణమూర్తి కథలు**

**వెల : రూ. 40/-**

**పేజీలు : 86**

**లభ్యత : 9912359345**

"భవిష్యత్ దార్శనికులయిన రచయితల బలగం ఎక్కువ లేనప్పుడు అది చేసే విధ్వంసం ఆపటం కుదరదు. నూతన సృష్టి జరపటం జీవితమంత కష్టమైనపని. విద్వేషాల్తో కనీసం ఓ ఆరోగ్యకర చర్చ కూడా కరువవుతుంది. రచయితల కంటే మామూలు మనుషులు ఎంతో ఉన్నతంగా కనిపిస్తారు. పుప్పాల కృష్ణమూర్తి సంచలనం కోసం రాసే రచయిత కాదు. అతని మూలాలు చాలా సాహిత్యంలో వున్నాయి. రేపటి పాఠకుల్ని తయారు చేసే ఇలాంటివారే రేపటి రచయితలు"

**పి. చంద్రశేఖర్ అజాద్**



March 2010_Prasthanam.pmd 39 2/25/2003, 12:38 PM

## నివాళి

# జానపద స్రష్ట బిరుదురాజు

తెలుగు జానపద సాహిత్యరంగంలో, పరిశోధనా రంగంలో, అనువాద సాహిత్యరంగంలో, ప్రబంధ కావ్యాల పరిష్కారంలో, అచ్చతెనుగు జానపద బాణీలు సేకరణ, కూర్పులో అవిరళ కృషిచేసిన అక్షర స్రష్ట – బిరుదురాజు రామరాజు. 1925 ఏప్రియల్16న లక్ష్మీదేవి, నారాయణరాజు దంపతులకు వరంగల్ జిల్లా, దేవనూరు గ్రామంలో జన్మించారు. 1949లో బి.ఎ. పూర్తిచేసిన రామరాజు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు పట్టాపొంది తెలుగు జానపద గేయాల మీద పిహెచ్‌డి చేసారు. 1960లో ఎం.ఎ. 1966లో భాషాశాస్త్రంలో పిజి డిప్లోమా చేసి తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యత సంపాదించారు. 1951–1957 వరకూ ఆంధ్రోపన్యాసకులుగా, 1968–1983 వరకూ వరంగల్‌లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతిగా పనిచేసారు. తెలుగు జానపద సాహిత్యంలో అనేక పరిశోధనలు చేసారు. వీరి మార్గదర్శకత్వంలో నలభైకి పైగా విద్యార్థులు పరిశోధనలు చేసి పిహెచ్‌డి పొందారు. వీరి గ్రంథ రచనలు ఒక ఎత్తు అయితే, సంస్కృత సాహిత్యానికి ఆంధ్రులు చేసిన విశిష్ట కృషి, సేవలపై వీరు పరిశోధన చేసి 'కంట్రిబ్యూషన్ ఆఫ్ ఆంధ్రాస్ టు 'సంస్క్రిట్ లిటరేచర్' అన్న గ్రంథాన్ని ఇటీవల ప్రచురించారు. ఇందులో మరుగు పడిన అనేక మంది తెలుగు కవుల సంస్కృత గ్రంథాలు – కృషిని, అక్షర బద్ధం చేసారు.



తెలంగాణ పల్లె పల్లె తిరిగి వేల జానపద గేయాలు, పాటలు, పలు కళారూపాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి విశ్వవిద్యాలయాలకు అందించారు. వీరు సేకరించిన అనేక అముద్రిత తాళపత్ర గ్రంథాలను ఉస్మానియా విశ్వవిద్యాలయ, సంస్కృత, తెలుగు పరిశోధక శాఖలకు, మరికొన్ని గ్రంథాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఓరియెంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీకి, కడపలోని సి.పి.బ్రౌన్ పరిశోధక కేంద్రాలకు అందించారు. తొలినాళ్ళలో పద్యకవిగా, సినారె వంటి వారితో కలిసి రామనారాయణ అనుపేర అశు కవిత్వాన్ని ఆలపించారు.

1960 ప్రాంతంలోనే 'త్రివేణి' పత్రికకు సంపాదకత్వం వహించి, తెలంగాణా పిల్లల పాటలు, 1968, 2008లలో తెలంగాణ పల్లెల పాటల పుస్తకాలకు సంపాదకత్వం వహించిన వీరు స్వయంగా పరిశీలించి, పరిశోధించి, సేకరించి విశ్వవిద్యాలయాలకు అందించారు. అరవై ఏళ్లక్రితమే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జానపద పరిశోధన ఆవశ్యకతను గురించి నొక్కి వొక్కాణించిన రామరాజు ఫిబ్రవరి 8న కన్నుమూసారు. ఆయన సాహిత్యాన్ని జనపరం చేయడం, జానపద సాహిత్యంపై మరింత లోతుగా, విస్తృతంగా కృషి కొనసాగించడం ఆయనకిచ్చే నిజమైన అక్షర నివాళి.

**తంగిరాల చక్రవర్తి**

# బాల సాహిత్య చంద్రుడు 'దాసరి సుబ్రహ్మణ్యం'

అచ్చ తెలుగు తనంతో బాలసాహిత్యాన్ని సృష్టించిన అపూర్వ తెలుగు కథకుల్లో అగ్రగణ్యుడు దాసరి సుబ్రహ్మణ్యం. బేతాల కథల సృష్టికర్త, చందమామ బాలల పత్రికను అర్ధ శతాబ్దం పాటు నిర్వహించిన వ్యక్తి దాసరి సుబ్రహ్మణ్యం. ఫిబ్రవరి 3 న విజయవాడలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 85 సంవత్సరాలు. విశ్వనాథ సత్యనారాయణ వంటి వారిచేత చందమామ పత్రికను చదివింపజేసిన కథామాంత్రికుడు దాసరి సుబ్రహ్మణ్యం. 1925, అక్టోబర్ 25న తెనాలి సమీపంలోని రేపల్లెలో జన్మించారు. ఆ రోజుల్లో ప్రఖ్యాతిగాంచిన 'చిత్రగుప్త' పత్రికలో వీరి తొలికథ ప్రచురితమైంది. అభిసారిక, కాగడా తదితర ఆనాటి పత్రికల్లో పలు అంశాలతో కూడిన వీరి రచనలు ప్రచురించబడ్డాయి. యుక్తవయస్సులో మార్క్సిజానికి ప్రభావితులై పలు ఉద్యమాల్లో పనిచేశారు. ద్వితీయ ప్రపంచ యుద్ధకాలంలో సైన్యంలో గుమస్తాగా పనిచేసారు. అరవింద ఆశ్రమంలో కొంతకాలం బైండర్‌గా, ప్రూఫ్ రీడర్‌గా పనిచేశారు. తెనాలి ప్రాంతవాసి, సినీనిర్మాత చక్రపాణి నడిపే చందమామ బాలల పత్రికలో 1952 జనవరి 1న చేరి 2006 వరకూ పనిచేసారు. సమాజంలో మార్పు రాజకీయాలతోనే సాధ్యమవుతుందని విశ్వసించే వీరు తోకచుక్క, మకరదేవత, కంచుకోట, జ్వాలాదీపం, రాకాసిలోయ, రాతిరథం, యక్ష పర్వతం, మాయాసరోవరం, భల్లూక మాంత్రికుడు తదితర సుమారు పన్నెండు సీరియల్స్ రాసారు. తన రచనలతో పిల్లలనూ, పెద్దలనూ కూడా ఆకర్షించిన అక్షర ప్రేమికుడు దాసరి సుబ్రహ్మణ్యం. చివరి వరకూ రచనలు చేస్తూనే ఉన్నారు. 'పట్టు వదలని విక్రమార్కుడు తిరిగి చెట్టెక్కి శవాన్ని భుజాన వేసుకుని' అనే వాక్యంతో భేతాళకథను ఉత్కంఠతో చదివించింది దాసరి కలం. చక్రపాణి, కొడవటిగంటి కుటుంబరావుల మరణం తర్వాత చందమామ పత్రిక నిర్వహణలో కీలకపాత్ర వీరు పోషించారు. బాలబాలికల్ని సమాజం మెచ్చే పౌరులుగా తీర్చిదిద్దేలా ఉత్తమ సాహిత్య సృజన చేసిన సుబ్రహ్మణ్యం నేటితరం రచయితలకి మార్గదర్శి. జానపద కథాసాహిత్యంలో, బాలసాహిత్య రచనా పద్ధతిలో వీరి నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మతోన్మాదం, డబ్బే సర్వస్వం అని చెప్పే నేటి కార్పోరేట్ విద్య, ఉపాధి సంస్కృతులకు వ్యతిరేకంగా అందరికీ అర్థమయ్యేలా తేట తెలుగు పదాలతో చక్కటి బాలసాహిత్యం సృష్టించిన దాసరి సుబ్రహ్మణ్యం మార్గంలో నేటి బాలసాహిత్య వేత్తలు కృషిచేయవలసి ఉంది. బాలల గేయాలు, కథలు, దేశభక్తిని, లౌకిక భావాలను పెంపొందించే అభ్యుదయ సాహిత్యసృజన విస్తృతంగా కొనసాగించడమే వారికి ఇచ్చే అక్షర నివాళి.





March 2010_Prasthanam.pmd 40 2/25/2003, 12:38 PM

నివేదిక

# సామూహిక శ్రమ నుండి భాషలు పుట్టాయి




## చీకటి దివాకర్

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సాహితీస్రవంతి ఆధ్వర్యంలో విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో, నెల్లిమర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ రెండుచోట్లా మాతృభాషపై చర్చా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సభలకు అధ్యక్షత వహించిన సాహితీస్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ ఒకజాతి భాష వారి సాంస్కృతిక సంపద అన్నారు. ప్రపంచంలో ఆరువేల భాషల్లో సగం ప్రమాదంలో ఉన్నాయని, అందులో తెలుగు కూడా ఉందని తెలిపారు. మానవుని సామూహిక శ్రమ నుండి భాషలు ఎలా పుట్టి పరిణామం చెందాయో వివరించారు. 1952లో బంగ్లాదేశ్‌లో పాకిస్తాన్ పాలకులు బెంగాలీ కాదని ఉర్దూ భాషను బలవంతంగా ప్రజలపై రుద్దడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన ఉద్యమంలో ముగ్గురు యువకులు బలయ్యారని అన్నారు. ఆ రోజునే యునెస్కో 'మాతృభాషా దినోత్సవం' గా ప్రకటించిందని తెలిపారు. మాతృభాషకు మొదట ప్రాధాన్యతను ఇచ్చిన తరువాత ఎన్ని భాషలు నేర్చినా అభ్యంతరం ఉండదన్నారు. సాహితీ విమర్శకులు డాక్టర్ యు. నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మ అనే పలుకులో ఉన్న విశిష్టతయే మాతృభాషలో కూడా ఉందన్నారు. బతుకు తెరువుకు తెలుగు పనికిరాదన్న భయం ప్రజల్లో నెలకొందని చెప్పారు. ఈ భయాన్ని పోగొట్టి తెలుగు వికాసానికి మరింత కృషి జరగాలన్నారు. భాష అవసరాలను తీర్చేదిగా ఉండాలన్నారు. న్యాయస్థానాల్లోనూ, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగు భాషలో జరపాలన్నారు. దీనికై ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో ఉన్నవారు తెలుగు భాషను రెండవ భాషగా అంగీకరించమని నిరాహారదీక్షలు చేసిన సందర్భాలున్నాయని, తమిళులకు ఉన్నంత భాషాభిమానం మనకు లేదన్నారు.

మరో కవి విమర్శకులు డాక్టర్ రామసూరి మాట్లాడుతూ చిన్న పిల్లలకు భాష నేర్పేది తల్లి, తెలుగు భాషలోని సంగీత గుణాన్ని గురజాడ అప్పారావు గుర్తించాడన్నారు. శ్రీకృష్ణదేవరాయలు వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చారని, రైతులను మర్చిపోతే దేశం నశించినట్లేనని పేర్కొన్నారు. మన సంస్కృతి వ్యవసాయ సంబంధమైనదని, వాటిని రక్షించుకున్నట్లయితే భాష బ్రతుకుతుందని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమ వ్యాపారం కోసం ఇంగ్లీషును వ్యాప్తి చేసారన్నారు. దీనికి ఉదాహరణ చెబుతూ వారు అలల మీద వచ్చి వలలు వేయగా మన తలలు అందులో చిక్కుకున్నాయని 'అల వల తల' కథను వివరించారు.



ఆంగ్ల ఉపన్యాసకులు ఇ.బి. పద్మావతి మాట్లాడుతూ మనం ప్రస్తుతం 11వ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని, 2000 లో ఇది ప్రారంభమైందని తెలిపారు. ఒక సర్వే ప్రకారం 6,803 మాతృభాషలు ఉన్నట్లుగా తేలిందన్నారు. మన దేశంలోనే 801 భాషలున్నాయని అన్నారు. సంవత్సరానికి 1.5 శాతం భాషలు అదృశ్యమవుతున్నాయని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో భాషలు చచ్చిపోవడం లేదు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే భాషలు చచ్చిపోతున్నాయని పేర్కొన్నారు. మాతృభాషపై పట్టు ఉన్నప్పుడే ఇతర భాషలను సులభంగా నేర్చుకోగలమన్నారు.

డాక్టర్ జక్కు రామకృష్ణ మాట్లాడుతూ నన్నయ్యను రెండవ వాల్మీకిగా పేర్కొన్నారు. సామెతలన్నీ జాతీయాలని తెలిపారు. వేలాది సంవత్సరాలుగా మన భాష ఉండడం వలన ప్రాచీన భాషగా గుర్తింపు పొందిందన్నారు. ప్రాథమిక స్థాయిలోనే పిల్లలకి మాతృభాష పట్ల అవగాహన కల్పించాలన్నారు. మనముందు తరాల వారు జాతి మనుగడ కోసం ప్రజా మనుగడ కోసం కవిత్వం వ్రాసేవారని, అందుకే గురజాడ వంటి వారు నిలబడగలిగారని అన్నారు. నేడు అటువంటి ప్రయత్నాలు జరగడం లేదన్నారు. సభలో పలువురు ప్రముఖులు ఆసక్తికరంగా మాట్లాడి సభికుల్లో ఆలోచింపజేశారు. ఈ కార్యక్రమానికి అల స్వాగతం పలుకగా కృష్ణారావు వందన సమర్పణ చేశారు. చంద్రిక పాడిన 'విన్నాను అమ్మ ఒడిలో కమ్మని తెలుగు' పాటతో సభ ప్రారంభమయ్యింది. ఆనంద్ 'పాడనా తెలుగు పాట' గీతాన్ని పాడారు. తెలుగు భాష విశిష్టతను చాటే పలు గీతాలను మరికొందరు గాయనీగాయకులు పాడి శ్రోతలను అలరించారు. సభ చివర్లో అన్ని విషయాలను క్రోడీకరిస్తూ దివాకర్ కొన్ని తీర్మానాలను ప్రవేశపెట్టారు.

మాతృభాష ద్వారా ఇతరులు చెప్పిన విషయాలను పూర్తిగా గ్రహించగలిగిన గ్రాహ్యశక్తి, ఆలోచనా, ఊహాశక్తి, తన లోపలి భావాన్ని సులభంగా స్పష్టంగా వ్యక్తీకరించగలిగిన శక్తి లభిస్తాయి. జ్ఞాన సముపార్జనకు, సజీవ మానవ సంబంధాలకు, నూతన సృజనకు, మానవీయ భావోద్వేగాలకు వ్యక్తీకరణకు మాతృభాషే సులభ సాధ్యమైనది. ఎంతో గంభీరమైన, ఈ సామాజిక శక్తిని కేవలం మనో ఉద్వేగపూరిత అంశంగా మాత్రమే పరిగణించడం, మాతృభాషకు సంపూర్ణ న్యాయం చేసినట్లవదు. మానవీయమైన విశిష్ట సామర్థ్యాన్ని పొందడంలోను దాన్ని ప్రదర్శించడంలోను మాతృభాష నిర్వహించే మహత్తర పాత్రను మనం గుర్తించి, ఇతరులు కూడా అర్థం చేసుకునేలా ఉద్యమించినపుడే 'మాతృభాష పరిరక్షణ' కృషికి అర్థవంతమైన ఫలితాలు సిద్ధిస్తాయి.

■



March 2010_Prasthanam.pmd 41 2/25/2003, 12:38 PM

## నివేదిక

# స్ఫూర్తి ప్రధాత శ్రీశ్రీ



ఖమ్మం పట్టణంలో వైరా రోడ్‌లోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీశ్రీ కాంస్య విగ్రహాన్ని జనవరి 28న ఖమ్మం జిల్లా కలెక్టర్ వి. ఉషారాణి ఆవిష్కరించారు. అనంతరం ప్రైవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శ్రీశ్రీ శతజయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం నాయకులు ఎల్. వీరారెడ్డి వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ఖమ్మం ఎం.ఎల్.ఏ తుమ్మల నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వి. ఉషారాణి మాట్లాడుతూ దోపిడీలేని సమాజం కోసం కృషిచేయడం ద్వారా శ్రీశ్రీకి నివాళులర్పించాలని అన్నారు. ఆయన పుట్టకముందు రాజులను పొగుడుతూ కవులు కవిత్వం రాసేవారని అన్నారు. శ్రీశ్రీ రాకతో ప్రజా సమస్యలను వాడుకభాషలో రాయడం ప్రారంభమయిందని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శమని చెప్పారు. నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ అన్నారు.

శ్రీశ్రీ సమాజాన్ని అధ్యయనం చేసిన వ్యక్తి అని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. శ్రీశ్రీ రచనలు చదవడం ద్వారా ప్రపంచీకరణ వంటి విషయాలను తేలికగా అర్థం చేసుకోవచ్చునని అన్నారు. ఆయన పుస్తకాలు చదవడం ద్వారా సమాజంలో చాలా భాగం అర్థమవుతుందని పేర్కొన్నారు. విగ్రహం ఏర్పాటుద్వారా ఖమ్మం వాసులు భవిష్యత్తుకు మార్గం చూపారని అన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం కృషిచేయడం శ్రీశ్రీకి నిజమైన నివాళి కాగలదని తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన ఆశయాలు ఆవరించిన ప్రజలు జిల్లాలో అత్యధికంగా ఉన్నారని అన్నారు. వారందరిలో శ్రీశ్రీ ఎప్పటికీ చిరస్థాయిగా నిలబడి ఉంటారని చెప్పారు. సరోజినీదేవి తన భర్తను ప్రజల్లో చూసుకోవచ్చునని అన్నారు.






తెలుగు సాహిత్యాన్ని ప్రపంచంలో అగ్రభాగాన నిలిపిన వ్యక్తి శ్రీశ్రీ అని ప్రజాగాయకుడు గోరటివెంకన్న అన్నారు. శ్రీశ్రీ తెలుగు సాహితీరంగానికి ఆణిముత్యం వంటి వాడన్నారు. తన జీవితాంతం విప్లవోద్యమంలో పసిబాలుడిగా బతికిన వ్యక్తి అని అన్నారు. ఆయన స్ఫూర్తితో తనలాంటి ఎందరో తయారయ్యారని అన్నారు. సమాజంలో చిరంజీవిగా ఉండే వ్యక్తి శ్రీశ్రీ అని అన్నారు.

తన భర్త మరణించినా ఇంతమందిని చూస్తుంటే అందరిలో చిరస్థాయిగా ఉన్నాడని అనిపిస్తోందని శ్రీశ్రీ సతీమణి సరోజ అన్నారు. ఇన్ని వేల మంది విద్యార్థులు, విద్యాసంస్థల యజమానులు ఒక్కటై విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందించాల్సిన విషయమని పేర్కొన్నారు. ఒక మహా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అందరిలోను శ్రీశ్రీ ఉన్నాడని చెప్పారు. మహాకవి గురజాడ రాసిన ఎన్నో గేయాలు తనకిప్పుడు గుర్తుకువస్తున్నాయని చెప్పారు.

శ్రీశ్రీకి ఖమ్మం జిల్లాతో అనుబంధం ఉందని ఖమ్మం ఎం.ఎల్.ఏ తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాళోజీ నారాయణరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో కూడా ఎన్‌టిఆర్ తరపున పాల్గొన్నారని చెప్పారు. జిల్లా సంస్కృతి మిగతా ప్రాంతాలకంటే భిన్నమయినదని, చైతన్యవంతమైనదని అన్నారు. జిల్లా వాసులు శ్రీశ్రీలాంటి మహోన్నత వ్యక్తులకు ఎంతో రుణపడి ఉన్నారని అన్నారు. ఈ సభలో ఉత్సవ కమిటీ కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, విరసం నేత చలసాని ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి పోతినేని సుదర్శన్‌రావు, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా, కవులు గౌరీశంకర్, రాజేంద్రప్రసాద్, రమోలా కృష్ణారావు, వివిధ విద్యాసంస్థల అధినేతలు పులిపాటి ప్రసాద్, చీకటి రోశయ్య, ఎల్‌వి. రమణ, శ్రీధర్, కుమార్, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ విగ్రహశిల్పి వెంకటేశ్వర్లును అందరూ అభినందించారు.

శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గత రెండు నెలలుగా ప్రవేటు విద్యాసంస్థల ఆధ్వర్యంలో జిల్లాలో పలు సభలు నిర్వహించడం జరిగింది. శ్రీశ్రీని నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశ్యంతో పలు పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు శ్రీశ్రీ మహాప్రస్థానంపై వకృత్వ పోటీలను నిర్వహించారు.

■



March 2010_Prasthanam.pmd 42 2/25/2003, 12:38 PM

నివేదిక

# అంపశయ్య నవీన్ గ్రంథాల ఆవిష్కరణ



డాక్టర్ పెద్ది వెంకటయ్య

వరంగల్ నగరంలో ప్రతి సంవత్సరం అంపశయ్య నవీన్ తన పుట్టిన రోజునాడు (డిసెంబర్ 24) తను రచించిన గ్రంథాల ఆవిష్కరణోత్సవాన్ని గత తొమ్మిది సంవత్సరాలుగా అక్కడి సాహిత్య సంస్థలు జరుపుతున్నాయి. అయితే ఈ కార్యక్రమం బంద్ కారణంగా 2010 జనవరి 17న హనుమకొండలోని అశోకా కాన్ఫరెన్స్ హాలులో మిత్రమండలి, సృజనలోకం, సహృదయసాహితీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

ఆ సభకు ఆచార్య పి. మల్లికార్జునరావు (ప్రిన్స్‌పాల్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి, వరంగల్) అధ్యక్షత వహించి 'ప్రయాణంలో ప్రమదలు' ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో తెలుగులో అనేక ప్రక్రియల్లో గ్రంథాల ప్రచురణ విరివిగా జరగటం హర్షించతగ్గ పరిణామం అన్నారు. ఈ నవల నవలాకారుడుగా నవీన్ ఎంత ప్రతిభావంతుడో మరోసారి రుజువు చేస్తుందన్నారు.

నవీన్ మరో రచన 'బంధితులు' కథా సంపుటిని ప్రముఖ వైద్యుడు, కవి డా॥ విజయమోహన రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'ఈ రోజుల్లో మానవ జీవితమంతా ఉరుకులు, పరుగులతో, ఒత్తిళ్ళతో కూడుకున్నదనీ, దానివల్ల నేటి యువతరం ప్రశాంత జీవితానికి, ఆనందానికి దూరమవుతున్నారనీ, ఈ అంశాన్ని 'బంధితులు' కథ అద్భుతంగా చిత్రించిందనీ, ఈ సంపుటిలోని ఇతర కథలన్నీ పాఠకుల్ని తమలోకి తాము చూసుకొని తమనితాము విశ్లేషించుకునేలా చేస్తాయని అన్నారు.

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నవలాకారుడు, కథకుడు సలీం 'బంధితులు' లోని కథల్ని సమీక్షిస్తూ ఈ కథల్లో మనం నిత్యం చూసే మనుషులే పాత్రలుగా ఉంటాయన్నారు. నవీన్ కథల్లో మెరుపులు, మలుపులు తక్కువగా ఉంటాయని, సంక్లిష్టమైన మానవ మనస్తత్వాల చిత్రణ ఎక్కువగా ఉంటుందని అంటూ ఈ సంపుటిలోని 'రెండో పెళ్ళి' 'టెక్నికల', అథోలోకం', 'బంధితులు', 'బింబం – ప్రతిబింబం', 'రుణం తీర్చుకున్నాడు' మొదలైన కథల్లో పాత్రల మానసిక విశ్లేషణ ఎంత అద్భుతంగా జరిగిందో సలీం సోదరహరణంగా వివరించారు.

'ప్రయాణంలో ప్రమదలు' నవలను పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో తెలుగు పండితుడు శంకరమంచి శ్యామ్ ప్రసాద్ సమీక్షిస్తూ 'నవీన్ రచన'లు 'ప్రయాణంలో ప్రమదలు' నవలలో మహిళల విద్యారంగాన్ని ప్రధాన ఇరుసుగా చేసుకొని విద్యార్థినులు ఎదుర్కునే సమస్యల్ని ఎంతో హృద్యంగా చిత్రించారన్నారు. యాత్రా చరిత్రను నవలలుగా మలచిన ఘనత నవీన్‌కే దక్కుతుందనీ, ఇప్పటికే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్న నవీన్‌కు "బుకర్స్ ప్రైజ్" వంటి అంతర్జాతీయ అవార్డులు రావాలని శంకరమంచి శ్యామ్‌ప్రసాద్ ఆకాంక్షించారు.

చివరగా నవీన్ తన స్పందనను తెలియజేస్తూ తన రచనల్లోని పాత్రలు తమలోకి తాము మరోవ్యక్తి తొంగి చూసినట్టుగా చూసుకుంటూ తమను తాము విశ్లేషించుకొని తమలోని చెడును సంహరించుకొని, మంచిని పెంచుకుంటాయనీ, ఇదే తన రచనలన్నిటిలోనూ అంతస్సూత్రంగా ఉంటుదన్నారు. పరిశీలకుడూ, పరిశీలితుడూ ఒక్కడే అయ్యుండాలని చెప్పిన జిడ్డు కృష్ణమూర్తి మాటకు తన రచనలు ఉదాహరణలని సకారాత్మక దృక్పథమే తన రచనలకు మూలమనీ చెప్పారు. గత శతాబ్దపు తొమ్మిదో దశకం నుండి ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణల లాంటి ఆర్థిక విధానాల వల్ల మన సమాజంలో సంభవించిన మార్పుల్ని చిత్రిస్తూ ఒక బృహన్నవలని రాసే ప్రాజెక్టును త్వరలోనే తను చేపట్టున్నానని నవీన్ తెలియజేశారు.

మిత్రమండలి తరపున నంగిళ్ళ రామశాస్త్రి సభకు స్వాగతం చెప్పగా, సహృదయ సాహితీ తరపున ఎన్.వి.ఎన్. చారి వందన సమర్పణ చేశారు.

ఈ సమావేశానికి బన్న అయిలయ్య, వి.ఆర్.విద్యార్థి, డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, రామా చంద్రమౌళి, పెద్ది వెంకటయ్య, వల్సపైడి, ఎస్.ఎన్‌చారి, డా॥ శ్రీరంగ స్వామి, పొట్లపల్లి శ్రీనివాస రావు, వాసిరెడ్డి భాస్కర్ రావు, పి.వెంకట్ రెడ్డి, ఆవాల దామోదర్ రెడ్డి, దయాకర్, జయపాల్ రెడ్డి, శ్రీదేవి, వజ్జల రంగాచారి, అన్వర్, ఇంకా నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు హాజరయి నవీన్‌కు అభినందనలు తెలియజేశారు.

■



March 2010_Prasthanam.pmd 43 2/25/2003, 12:38 PM

## పండిత విల్లూరులో మహాకవి శ్రీశ్రీ శతజయంతి



పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం పండిత విల్లూరు గ్రామములో నవంబర్ 30న శ్రీశ్రీ శత జయంతి సభ నిర్వహించబడింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మహాకవి శ్రీశ్రీ శతజయంతి సభకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.యస్.కె. గణపతిరావు అధ్యక్షత వహించారు. ఈ సభలో రిటైర్డ్ హైస్కూల్ హెచ్.ఎమ్. ఆచంట సుబ్బారావు, గ్రామములోని సాహితీ ప్రియులు. హైస్కూలు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

సభాధ్యక్షులు శ్రీగణపతి రావు 'శ్రీశ్రీ నవ్యకవిత్వం' గురించి వివరించారు. శ్రీశ్రీ పీడిత ప్రజల అభ్యున్నతి కోసం కవిత్వం వ్రాశారని చెప్పారు. తరువాత ఆచంట సుబ్బారావు ప్రసంగిస్తూ ప్రజల బాధలన్నీ తన బాధలుగా గుర్తించి అభ్యుదయ సాహిత్యం సృష్టించారని చెప్పారు. తోరం వెంకటసూర్య నారాయణ మాట్లాడుతూ శ్రీశ్రీ నిజమైన ప్రజాకవి అని, సర్వజనుల సౌభాగ్యం కోసం కవిత్వం వ్రాశారని. వారి "మహాప్రస్థానం" గ్రంథం తెలుగు భాషలో అత్యంత ప్రసిద్ధి గాంచిన కావ్యమని అన్నారు. తెలుగు భాష ఉన్నంత వరకు శ్రీశ్రీని తెలుగు ప్రజలు మరువరని, ఈ యుగమే కాదు, రాబోయే యుగాలు కూడా శ్రీశ్రీగారిదేనని, ఆయన కవితా మార్గం అనితర సాధ్యమని వివరించారు.

స్థానిక శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కమ్మనర్సింహారావు, శ్రీశ్రీ కవితా వైభవాన్ని వివరించారు. తరువాత హైస్కూలు ఉపాధ్యాయులు ఎ. యల్. నగేశ్, యస్. వెంకటేశ్వర రావు, వే.వి. నాగేశ్వరరావు తదితరులు ప్రసంగిస్తూ శ్రీశ్రీ తెలుగు భాషకు అంతర్జాతీయ గౌరవాన్ని తెచ్చిన గొప్ప కవి అని ప్రస్తుతించారు.

ఈ సందర్భముగా శ్రీశ్రీ రచించిన దేశభక్తి, సినీ గేయాల పాటల పోటీ నిర్వహించబడింది. చాలామంది విదార్థులు శ్రీశ్రీ సినీ గేయాలు పాడారు. చక్కగా పాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చివరిగా ఈ కార్యక్రమమునకు సహకరించిన వారందరికీ కమ్మ నర్సింహారావు గారు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగించి వందన సమర్పణ చేసారు.

**– టి.వి. సూర్యనారాయణ**



*చీరాలకు చెందిన కవి శ్రీనివాస్ గౌడ్‌కు 'మాకినీడి సాహిత్య పురస్కారం 2010' ని అందజేస్తున్న మాకినీడి సూర్యభాస్కర్. చిత్రంలో ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు, తాతబ్బాయి తదితరులు ఉన్నారు.*

## అనువాద రచనలకు నగదు పురస్కారాలు

తమిళనాడులోని ప్రసిద్ధ సాహితీ సంస్థ 'నల్లి – దిశై ఎట్టుం' తమిళం నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి తమిళంలోకి 2005 – 2009 సంవత్సరాల మధ్య ప్రచురించబడిన రెండు పుస్తకాలకు ఒక్కొక్కటికి పదివేల రూపాయల వంతున బహుమతులు ప్రధానం చేస్తుందని ప్రముఖ అనువాదకులు ఏ.జి. యతిరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ రచనల 3 ప్రతులతో పాటు, తమ ఫోటో, సంక్షిప్త వివరాలను: **నల్లి – దిశై ఎట్టుమ్, 6, పిళ్ళయార్ కోవిల్ వీధి, మీనాక్షీపేట, కురింజిపాడి– 607 302, తమిళనాడు** చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఈ సంవత్సరం ఆగస్టు నెలలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేయబడతాయని ఆ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు **9490838165** లో సంప్రదించవచ్చును.

## నానీల అవార్డుకు ఆహ్వానం

ఇండియన్ హైకూ క్లబ్ 2005లో నానీల అవార్డును ఇవ్వడం ప్రారంభించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థాగతమైన కారణాల రీత్యా ఆ తరువాత అవార్డును ప్రకటించలేకపోయామని తెలిపారు. 2006, 2007, 2008, 2009 లలో ఒక్కో సంవత్సరంలో వచ్చిన నానీ సంపుటాలలోని ఒక్కో ఉత్తమ నానీ సంపుటిని ఇండియన్ హైకూ క్లబ్ సభ్యులు ఎంపికచేసి నాలుగు సంవత్సరాలలోని నాలుగు ఉత్తమ నానీ సంపుటాలకు నానీల అవార్డులను ప్రకటించనున్నట్లు తెలియజేశారు. ఆయా సంవత్సరాలలో ప్రచురించబడిన నానీల సంపుటాలను మూడు కాపీలను **డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్, ఇండియన్ హైకూ క్లబ్, డోర్ నెం. 6–5, 6వ వీధి, శారదానగర్, అనకాపల్లి– 531001** చిరునామాకు పంపించవలసిందిగా ఆ ప్రకటనలో కోరారు. ఇతర వివరాలకు 9963299452 ద్వారా సంప్రదించవచ్చును. ఎంపిక చేసిన ఉత్తమ నానీల సంపుటాలకు ఒక్కొక్క దానికి 1,116/– రూపాయల నగదు బహుమతి ఇచ్చి సత్కరించనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.



March 2010_Prasthanam.pmd 44 2/25/2003, 12:38 PM

# డైరీ

## 'మథనం' ఆవిష్కరణ



మధురశ్రీ 'మథనం' సంపుటిలోని కవితలన్నీ సామాజిక సమస్యలను ప్రతిఫలింపజేస్తున్నాయని పలువురు వక్తలు ప్రశంసించారు. ఫిబ్రవరి 14న అనంతపురం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ కాన్ఫరెన్స్ హాలులో 'మానవత రక్తదాతల' సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి 'మథనం' కవితా సంపుటిని ఆవిష్కరించారు. సభాధ్యక్షత వహించిన డాక్టర్ రాధేయ మాట్లాడుతూ 'మధురశ్రీ కవితలు కార్మికుల జీవనశైలిని ప్రతిబింబిస్తున్నాయని' అన్నారు. కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 'రైతు కష్టాలను హృద్యంగా చెప్పాడని' అన్నారు. మల్లెల నరసింహమూర్తి మాట్లాడుతూ సుగాలి పిల్ల అమాయకత్వాన్ని, మట్టి సౌందర్యాన్ని అధ్బుతంగా వర్ణించాడని అన్నారు. ఉద్ధండం చంద్రశేఖర్ మాట్లాడుతూ మధురశ్రీ తన తల్లి మోకాళ్ళ నొప్పులతో బాధపడుతున్న సన్నివేశాన్ని 'నా కళ్ళలో నిను దాచుకోనా?' అనే కవితలో గుండెను తాకే భావంతో అక్షరీకరించారన్నారు. 'కష్టజీవి'కి అటూ ఇటూ ఉండేవాడే కవి అని మహాకవి శ్రీశ్రీ చెప్పారని, ఈ సామాజిక అవగాహనతోనే మధురశ్రీ శ్రామికవర్గానికి భరోసా ఇచ్చే కవిత్వాన్ని వెలువరించడం అభినందనీయమని అన్నారు. కె.వి. రమణారెడ్డి మాట్లాడుతూ 'తూమూ ఒక పర్యాటక కేంద్రమేనని' బాల్యాన్ని గుర్తుకు తెచ్చేలా కవిత్వాన్ని రాశారన్నారు. ముఖ్యంగా గొర్రెల కాపరులు, ఊపిర బుడగలు అమ్మేవారు, కుండలు చేసేవారి గురించి చక్కటి కవిత్వాన్ని వాస్తవికంగా చెప్పారన్నారు. తరిమెల అమరనాథరెడ్డి మాట్లాడుతూ పేదవాడి కన్నీటి తడి మధురశ్రీ ప్రతి కవితలో కనిపిస్తుందని అన్నారు. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ఫిర్యాదుల దినోత్సవంలో ప్రజలు ఇచ్చే అర్జీలను రాసేటువంటి అర్జీ లేఖకుల స్థితిగతులను చక్కగా వివరించారన్నారు. మధురశ్రీ స్పందిస్తూ ప్రోత్సహించే మనసున్న కవులు ఉంటే కొత్త కవులు మరింత చిక్కటి కవిత్వాన్ని రాస్తారని అన్నారు. ప్రతి మనిషీ ఏదో ఒక బాధతోనో, ఆవేశంతోనో కవిత్వం రాస్తారనీ, సమాజంలో జరుగుతున్న కొన్ని పేదరికపు వెతలను దగ్గరగా గమనించే తాను కూడా 'మథనం' కవిత్వం రచించానని అన్నారు. కథకు వస్తువులను ఎంచుకున్నప్పుడు, ఆ వస్తువు మూలాలను ఖచ్చితంగా కవిత్వంలో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కథకులు శాంతినారాయణ, చిలుకూరి దేవపుత్ర, దస్తగిరి, నందవరం కేశవరెడ్డి, నబీరసూల్, అంకే శ్రీనివాస్, ఏ.ఏ. నాగేంద్ర, గుత్తాహరి తదితరులు పాల్గొన్నారు.

## జి.వి. పూర్ణచంద్‌కి గిడుగు స్మారక పురస్కారం



హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో సుబ్బారాయ కళావేదికలో 'తెలుగురథం' సంస్థ జనవరి 22వ తేదీ గిడుగు వర్ధంతిని వ్యవహారిక భాషోద్యమానికి నూరేళ్ళ పండుగగా నిర్వహించింది. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి స్మారక పురస్కారాన్ని తెలుగు భాషా పరిశోధకులు డాక్టర్ జి.వి పూర్ణచంద్‌కి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా సి. నారాయణరెడ్డి ప్రధానం చేశారు. ప్రధానవక్త డాక్టర్ ద్వా.నా శాస్త్రి వ్యావహారిక భాషోద్యమ పుట్టు పూర్వోత్తరాలను చమత్కార భరితంగా వివరించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన దూరదర్శన్ సంచాలకులు పి. మధుసూదన్ రావు మాట్లాడుతూ గిడుగు వారి సేవ వల్లనే ఈనాడు తెలుగు భాష ప్రసార మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందిందని పలికారు. తెలుగు రథం సంస్థ నిర్వాహకులు కొంపెల్ల శర్మ గిడుగు కృషిని వివరించారు.

## ద్వానా శాస్త్రికి 'విమర్శక రత్న' బిరుదు



హైదరాబాద్‌లోని శ్రీత్యాగరాయగానసభలో ఫిబ్రవరి 16న విశ్వసాహితి స్వర్ణోత్సవాల సందర్భంగా డాక్టర్ ద్వానా శాస్త్రిని విమర్శకరత్న బిరుదుతో సత్కరించారు. విశ్వసాహితి వ్యవస్థాపకులు డాక్టర్ పోతుకూచి సాంబశివరావు మాట్లాడుతూ సహృదయ విమర్శకుడిగా పేరుపొందిన ద్వానా శాస్త్రిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి డాక్టర్ గోపి మాట్లాడుతూ 'ద్వానా శాస్త్రి అక్షర పూజారి' అన్నారు. 'నేటి వచన కవిత్వం' అంశంపై ద్వానా శాస్త్రి ప్రసంగించారు. అనంతరం జరిగిన 'కవితోత్సవాన్ని తంగిరాల చక్రవర్తి, రామమోహనరావులు నిర్వహించారు.



March 2010_Prasthanam.pmd 45 2/25/2003, 12:38 PM

## తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం

తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో జనవరి 31న సా్రమాట్ క్లినిక్‌లో 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంశంపై కవి సమ్మేళనం, పాటల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు నగరశాసన సభ్యులు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ 'హైదరాబాద్, విశాఖపట్టణంలో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. అదేవిధంగా మన నెల్లూరు నగరంలో కూడా ఇలాంటి కవి సమ్మేళనాలు, పాటలపోటీలు జరగడం చాలా సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సంస్థ అధ్యక్షులు కె. మురళీమోహన్‌రాజుకు అభినందనలు తెలిపారు. కడపజిల్లాకు చెందిన మొల్ల సాహితీపీఠం అధ్యక్షులు రాష్ట్రపతి అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ కడపజిల్లాలో మొల్లపీఠాన్ని ఏర్పరచిన విధంగానే నెల్లూరు మహానగరంలో కూడా తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో మహాకవి తిక్కన విగ్రహాన్ని



కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కవిసమ్మేళనానికి గుర్రాల రమణయ్య, యద్దల లలిత సమీక్షకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి యద్దల లలితను నెల్లూరు శాసనసభ్యులు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, డాక్టర్ మారం సుధాకర్ ఘనంగా సన్మానించారు. పాటల పోటీలకు న్యాయనిర్ణీతలుగా మధుసూధన్, పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ వ్యవహరించారు. అనంతరం పాటల పోటీలలో గెలుపొందిన విజేతలకు అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ కన్వీనర్ భవాని నాగేంద్రప్రసాద్, జిల్లా టాక్స్‌బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆర్.వి. శేషయ్య నాయుడు, డాక్టర్ యస్.యన్‌రాజు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిన్నపరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పిన్నపరెడ్డి రాజారెడ్డి, శ్రీరాజరాజేశ్వరీ ఎలక్ట్రికల్స్ ప్రొపయిటర్ ప్రభాకర్ రాజు, తిక్కన రచయితల సంఘం ఉపాధ్యక్షులు ఊరుబెండి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, తిక్కన కళాపీఠం కోశాధికారి శ్రీనివాస రాజు, సా్రమాట్ క్లినిక్ అధినేత డాక్టర్ మారం సుధాకర్, యువకవి రవితేజ, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామారావు, మాటేటి రత్నప్రసాద్, దశరధ రామిరెడ్డి, సృజన దగ్గుపాటి రాధాకృష్ణ, సన్ సంస్థ అధ్యక్షులు దశయ్య, సుందర్ రాజారెడ్డి, తదితరులు పాల్గొని తమ కవితల్ని వినిపించారు.

## 'మా నాన్నగారు' ఆవిష్కరణ



హైదరాబాద్‌లో 'కిన్నెర' ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో డా.ద్వా.నా. శాస్త్రి సంపాదకత్వంలో వెలువడిన "మా నాన్నగారు" పుస్తకాన్ని జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత ఆచార్య సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఆయన నూటా అరవైరెండు మంది సాహితీ వేత్తల జీవిత విధానాలను వాళ్ళ కుమారులు, కుమార్తెలతో రాయించి అందించిన ఈ పుస్తకం తెలుగు సాహిత్యంలో అపూర్వ గ్రంధం. ఇదొక వినూత్న ఆలోచన అని అన్నారు. గత దశాబ్దపు సాహిత్య, సామాజిక విశేషాలు ఇందులో వున్నాయని సినారె కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి డా.కె.వి. రమణాచారి మాట్లాడుతూ "సాహిత్యత్యాగధనుల, సరస్వతీసమారాధకుల జీవితనుభవాలను భద్రపరచటం ప్రశంసనీయం" అన్నారు తొలి ప్రతి 102 సంవత్సరాల నాన్నగారు, మాజీ ఐ.ఎ.ఎస్ అధికారి గెల్లినారాయణశెట్టి గారికి బహూకరించబడింది. రిటైర్డ్ ఐ.జి.డా.ఆర్. ప్రభాకరరావు, దర్భశయనం శ్రీనివాసాచార్య, కిన్నెర రఘురాం ప్రభుతులు పాల్గొన్నారు. డా. ద్వానా. శాస్త్రి తమ స్పందన ఉపన్యాసంలో ఇటువంటి పుస్తకం తెలుగులో రాలేదని అన్నారు. కీర్తిశేషులైన నాన్నల గురించి అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా సహకరించారని, వీరి జీవిత విధానాలను నేటితరం తెలుసుకొని వ్యక్తిత్వ వికాసాన్ని పొందాలన్నారు.




***ఖమ్మం పట్టణంలోని మంచికంటి భవన్‌లో జరిగిన సాహిత్య సభలో రావు కథల సంపుటి 'స్పర్శ' ను ఆవిష్కరిస్తున్న కవి సాధనాల వేంకటస్వామి నాయుడు. చిత్రంలో శేషగిరి, కన్నెగంటి వెంకటయ్య, రాజారావు, కథా సంపుటి రచయిత రావు ఉన్నారు.***



March 2010_Prasthanam.pmd 46 2/25/2003, 12:38 PM



ఫిబ్రవరి *14*న అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో కవి కె.వి. రమణారెడ్డికి 'రాధేయ కవితా పురస్కారం-*2010*'ను అందజేస్తున్న ఉమ్మడిశెట్టి అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయ. చిత్రంలో కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మల్లెల నరసింహామూర్తి, ఉద్ధండం చంద్రశేఖర్, తరిమళ అమరనాథరెడ్డి, మధురశ్రీ, కె. ఆలీఖాన్ ఉన్నారు.




ఇటీవల విశాఖలో విశ్వనాథ సాహిత్యపీఠం ఆద్వర్యంలో జరిగిన 'ఆదూరి సత్యవతీదేవి ఆత్మరాగం' పుస్తకావిష్కరణ సభ. చిత్రంలో దూసి శ్రీరామమూర్తి, ఆదూరి వెంకట సీతారామమూర్తి, మిరియాల లక్ష్మీపతి, డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి, చలసాని ప్రసాద్, ప్రొఫెసర్ ఇ.విశ్వనాథరెడ్డి, రామతీర్థ ఉన్నారు.



ఫిబ్రవరి *14*న నెల్లూరులోని టౌన్‌హాలులో 'సన్' సంస్థ ఆధర్యంలో 'అక్షర జ్యోతి' పేరిట జరిగిన కవి సమ్మేళనంలో కవి కాళహస్తి వెంకట శేషగిరి రావును 'విశిష్ట పురస్కారం' తో సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో బి.వి.ఆర్. ఆంజనేయులు, ఆబౌతుల దశయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా దేశభక్తి గీతాలు, నృత్యపోటీలు నిర్వహించారు.



ఫిబ్రవరి *12*న చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి కళాసేవా సమితి, కడియం వారి చెళ్ళపిళ్ళ సాహితీ పురస్కారాన్నందుకుంటున్న కవి, విమర్శకుడు జి. సుబ్బారావు. చిత్రంలో తంబాబత్తుల పావేశ్వరరావు, డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు, చిలుకూరి శ్రీనివాసరావు, తోరాటి వసంతరావు, డాక్టర్ గూటం స్వామి, దాసరి శేషగిరి, డాక్టర్ నీలకంఠరావు తదితరులు ఉన్నారు.



జనవరి *31*న హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళనం (భోపాల్) సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ పోతుకూచి సాంబశివరావు *83*వ జన్మదినోత్సవ సందర్భంగా సన్మానిస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ రెవెన్యూ కార్యదర్శి కె.వి. రమణాచారి, పూర్వ లేబర్ కమీషనర్ ఎస్. ప్రసాదరావు, హైకోర్టు అద్వకేట్ ఆర్. దుర్గాప్రసన్న, స్వాతంత్ర్య సమరయోధులు ఎం.ఎల్. నరసింహారావు, సహకార సారధి సంపాదకులు పి.వి. బ్రహ్మం, తంగిరాల చక్రవర్తి, గౌతరాజు హనుమంతరావు, జి. రామ్మోహనరావు, బొపారా తదితరులు




రమ్యసాహితీ, పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లా వారి సాహితీసభలో కొడవటిగంటి కుటుంబరావు విశిష్ట సాహితీ పురస్కారం అందుకుంటున్న రచయిత వదలి రాధాకృష్ణ. చిత్రంలో డాక్టర్ కె.రామచంద్రరాజు, గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ తేతలి సుబ్బరాయలరెడ్డి, సంస్థ అధ్యక్షులు ఎం.ఆర్.వి. సత్యన్నారాయణమూర్తి, టి.భాస్కర్ కుమార్‌లు ఉన్నారు.



March 2010_Prasthanam.pmd 47 2/25/2003, 12:38 PM

## 'కవనంతో సవనం' ఆవిష్కరణ



సాహిత్యాధ్యయనం మనిషి మానసిక వికాసానికి తోడ్పడుతుందని, విద్యార్థులు సాహిత్యమూ, ఇతర కళలపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఏజెన్సీ విద్యాశాఖాధికారి గుజ్జురాజు అన్నారు. సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6న భద్రాచలంలోని ఎటపాకలో గిరిజన సంక్షేమ ప్రతిభా పాఠశాలలో ఎన్.సి.హెచ్. చక్రవర్తి రచించిన 'కవనంతో సవనం' పద్య కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షులు కె. ఆనందాచారి సభకు అధ్యక్షత వహించారు. 'కవనంతో సవనం' సామాజిక సమస్యలతో నిండిన కవిత్వమని చక్రవర్తి కేవలం సమస్యలు ఎత్తి చూపడమే కాక పరిష్కారాలూ సూచించారని అతిథిగా విచ్చేసిన 'మాగంటి సూర్యం' అన్నారు. కళ అనేది మానవ జీవనానికి దర్పణం అంటూ, కళను ఆస్వాదించడం ద్వారా మనను మనం తీర్చిదిద్దుకోవడం జరుగుతుందనీ పుస్తకాన్ని ఆవిష్కరించిన కొత్తగూడేనికి చెందిన ప్రముఖ వైద్యులు వాసిరెడ్డి రమేష్‌బాబు అన్నారు. జీవితమే ఒక సమస్య అవుతున్న నేపథ్యంలో కవి తేట తెలుగు పదాలతో పద్యాలను అల్లి, మనస్సుకు హత్తుకునేలా రాసారని పుస్తకాన్ని సమీక్షించిన డాక్టర్ కావూరి పాపయ్యశాస్త్రి అన్నారు. చక్రవర్తి కవిత్వం నిండా సామాజిక స్పృహ ఉంటుందని సాహితీస్రవంతి డివిజన్ అధ్యక్షులు మాల్యశ్రీ ప్రశంసించారు. సైన్సుకూ, సాహిత్యానికీ ఉన్న సంబంధాన్ని పాఠశాల ప్రధానాచార్యులు కె. మహేశ్వరయ్య వివరించారు. సభకు ఎస్. శ్రీనివాసకుమార్ స్వాగతం పలికారు. సాహితీస్రవంతి కార్యదర్శి దుర్గాచారి వందన సమర్పణ చేసారు. శ్రీమతి వి. శ్యామల స్వాగత గీతం ఆలపించారు. సభలో పి.వి.ఆర్. స్వామి, చక్రవర్తుల లక్ష్మీనరసమ్మలను వారి సేవలకు గుర్తింపుగా సత్కరించారు. కవి చక్రవర్తి సముచిత రీతిన కృతజ్ఞతలు తెలిపారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల సౌజన్యంతో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీధుల రాంబాబు, డి.వి. కృష్ణమూర్తి, చంద్ర, సూర్యకుమారి, తిరుపాలు, ఆర్.ఎస్.రావ్, శంకర్‌సింగ్, కవులూ, పండితులూ, విద్యార్థులూ పాల్గొన్నారు.


## FORM IV
(Rule 8)

**UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867**
**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS**
**ABOUT MONTHLY -SHAITYA PRASTHANAM**

| | |
|---|---|
| **1. Place of Publication** | **: Hyderabad** |
| **2. Periodicity of its Publication** | **: Monthly** |
| **3. Printer's Name** | **: V. Krishnaiah** |
| **1(a) Whether a citizen of India : YES** | |
| **(b) If a foreigner, the country of origin** | **: -** |
| **Address** | **: H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |
| **4. Publisher's Name** | **: V. Krishnaiah** |
| **1(a) Whether a citizen of India** | **: YES** |
| **(b) If a foreigner, the country of origin** | **: -** |
| **Address** | **: H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |
| **5. Editor's Name** | **: TELAKAPALLI RAVI** |
| **Nationality** | **: INDIAN** |
| **1(a) Whether a citizen of India** | **: YES** |
| **(b) If a foreigner, the country of origin** | **: -** |
| **Address** | **: H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |
| **6. Name and addresses of owner** | **: V. Krishnaiah** |
| **1(a) Whether a citizen of India** | **: YES** |
| **(b) If a foreigner, the country of origin** | **: -** |
| **Address** | **: H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020** |

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

**Sd/**
**V. KRISHNAIAH**
**Publisher**

**Date: 28.02.2010**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



ఫోటో: గుడిపూడి విజయరావు

## ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చదువవలసిన పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|
| 1. | పిల్లలు నేర్చుకోవడంలో ఎలా వెనకబడతారు? | 60.00 | 13. | నల్లబల్ల వెనుక | 25.00 |
| 2. | పిల్లలు ఎలా నేర్చుకుంటారు | 60.00 | 14. | చదువు సంధ్యలు | 25.00 |
| 3. | టీచర్ | 40.00 | 15. | మహోజ్వల స్మృతులు | 35.00 |
| 4. | విముక్తి-విద్య | 40.00 | 16. | మనిషి కథ | 40.00 |
| 5. | టీచర్లకు ఉత్తరం | 40.00 | 17. | చార్లీచాప్లిన్ | 25.00 |
| 6. | మాస్టారూ...! | 10.00 | 18. | పరిణామక్రమంలో విద్యా వ్యవస్థ 1833-2003 | 15.00 |
| 7. | మీ ఒడిలో | 10.00 | 19. | వేదభూమి | 10.00 |
| 8. | కథలే పాఠాలు | 25.00 | 20. | సమాజం-సైన్స్- సంప్రదాయం | 15.00 |
| 9. | బోధన-శోధన | 30.00 | 21. | సైన్సు చరిత్రలో సామాజికాంశాలు | 10.00 |
| 10. | విభిన్న విద్యా సంస్థలు | 25.00 | 22. | పిల్లల అలవాట్లు | 25.00 |
| 11. | భాష-భావం | 20.00 | 23. | భారతదేశ చరిత్ర | 25.00 |
| 12. | మీరు - మీ పిల్లలు | 15.00 | 24 | పిల్లల భాష - ఉపాధ్యాయుడు | 25.00 |

## పిల్లలు చదివే పుస్తకాల జాబితా

| క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల | క్ర.స | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మహావిశ్వం మన భూమి | 20.00 | 34. | మూడు కథలు | 10.00 | 67. | యమున దర్బారు | 10.00 |
| 2. | ఆదర్శబాల్యం | 25.00 | 35. | నత్తగుల్ల స్వార్థం-బంగారుచేపగర్వం | 15.00 | 68. | బంగారు జింక | 15.00 |
| 3. | విలియం షేక్స్పియర్ | 15.00 | 36. | అద్భుతాలనియం-నీరు | 10.00 | 69. | మూడు ఏనుగులు | 15.00 |
| 4. | హైడీ | 20.00 | 37. | నోయా | 10.00 | 70. | బోబక్ నేర్పిన పాఠం | 15.00 |
| 5. | విశ్వవిఖ్యాత శాస్త్రజ్ఞులు | 15.00 | 38. | బద్ధకం వదిలింది | 15.00 | 71. | పులి-తాబేలు | 10.00 |
| 6. | విదేశీ కథలు | 15.00 | 39. | బుడిబుడికథలు | 40.00 | 72. | పింకి-పిల్లి | 10.00 |
| 7. | విజ్ఞాన శిఖరాలు | 15.00 | 40. | పిల్లల ప్రశ్న-సైన్స్ జవాబు | 15.00 | 73. | సైన్యాధిపతి గర్వభంగం | 15.00 |
| 8. | చైనా నీతి కథలు | 15.00 | 41. | మేమొచ్చేశాం | 20.00 | 74. | కుడి-ఎడమ | 10.00 |
| 9. | భారతీయ శాస్త్రవేత్తలు | 15.00 | 42. | నిర్జీవం-జీవపరిణామం | 30.00 | 75. | నాతప్పేమిటో! | 15.00 |
| 10. | అందాల పార్కు | 15.00 | 43. | సరదాసరదా లెక్కలు | 30.00 | 76. | నందువంట-నేస్తంతంటా | 10.00 |
| 11. | పిల్లల గణితం | 15.00 | 44. | విశ్వం-విజ్ఞానం | 25.00 | 77. | వంశీధర్ నిజాయితీ | 10.00 |
| 12. | పిల్లలు-పిడుగులు | 20.00 | 45. | ప్రకృతిలో అద్భుతాలు-విజ్ఞానవిశేషాలు | 45.00 | 78. | జమిందారు వేట | 10.00 |
| 13. | సరదా సరదా చదువులు | 15.00 | 46. | కాలిక్యులేటర్ గేమ్స్ | 20.00 | 79. | అద్దంలో సింహం | 15.00 |
| 14. | తరగతిలో తమాషాలు | 15.00 | 47. | అలెగ్జాండర్ గ్రాహంబెల్ | 10.00 | 80. | సముద్ర నేస్తాలు | 15.00 |
| 15. | వానరుడు - నరావతరణ | 25.00 | 48. | మేకపిల్ల మెడగంట-చిట్టెలుక కృతజ్ఞత | 15.00 | 81. | కప్పకల | 15.00 |
| 16. | చదువంటే మూడోకన్ను | 25.00 | 49. | మంచిగా వుందాం | 30.00 | 82. | కథలంటే మాకిష్టం-1 | 25.00 |
| 17. | పాడరా ఓ తెలుగువాడా | 15.00 | 50. | భలేకథలు | 10.00 | 83. | కథలంటే మాకిష్టం-2 | 25.00 |
| 18. | పిల్లల సంరక్షణ | 25.00 | 51. | తోకతెగిన తోడేలు | 15.00 | 84. | రాబిన్సన్‌క్రూసో | 45.00 |
| 19. | అక్షరాలతో ఆటలు | 30.00 | 52. | బల్బు వెలిగింది | 20.00 | 85. | నల్లగుర్రం | 25.00 |
| 20. | నేర్చుకోడం మాకిష్టం | 20.00 | 53. | రవీంద్రనాథ్ ఠాగూర్ | 15.00 | 86. | పెన్సిల్‌బాక్స్ | 15.00 |
| 21. | కథలంటే మాకిష్టం | 40.00 | 54. | వినయంలేని వీరుడు | 25.00 | 87. | మంచి అమ్మ | 15.00 |
| 22. | ఆటలంటే మాకిష్టం | 30.00 | 55. | బండి నుంచి మోటారుకు | 20.00 | 88. | కోతి ఫొటో | 25.00 |
| 23. | పాటలంటే మాకిష్టం | 20.00 | 56. | చెట్టు | 15.00 | 89. | కథ కాని కథ | 15.00 |
| 24. | పాడుకొందాం | 25.00 | 57. | చిటపట చినుకులు | 20.00 | 90. | లోకంచుట్టిన వీరుడు | 40.00 |
| 25. | తేటతెలుగు-1 | 30.00 | 58. | చిట్టిరాకుమారి-చందమామ | 10.00 | 91. | చివరి ఆకు | 10.00 |
| 26. | తేటతెలుగు-2 | 30.00 | 59. | గుడ్డు నుంచి పిల్ల | 20.00 | 92. | పెద్దల మాయం-పిల్లలరాజ్యం | 20.00 |
| 27. | కొత్తబ్యాగ్ | 10.00 | 60. | కుకూ భూరీల కథ | 20.00 | 93. | నెలవంక | 25.00 |
| 28. | బొటనవేలితోబొమ్మలు | 10.00 | 61. | మన కథ | 20.00 | 94. | సాయపడే చేతులు | 20.00 |
| 29. | పొడుపుకథలు-చింగ్‌చదువు | 15.00 | 62. | నడిచేటి నావకథ | 20.00 | 95. | నీళ్ళు ఎందుకు తడిగాఉంటాయి? | 15.00 |
| 30. | డంభాలమారి డాన్ క్విక్సాట్ | 25.00 | 63. | రహస్యం | 10.00 | 96. | బడి-బ్రతుకు | 25.00 |
| 31. | గణితసూత్రదీపిక | 20.00 | 64. | ఎద్దు | 20.00 | 97. | హిరోషిమా అగ్నిజ్వాలలు | 25.00 |
| 32. | జంతువుల వింతభాష | 10.00 | 65. | మనమూ రాద్దామా? | 10.00 | 98. | సిసింద్రీలు | 20.00 |
| 33. | జంతువుల వింతరుచులు | 10.00 | 66. | బుచ్చిబాబు-బొమ్మకారు | 15.00 | 99. | అద్దాలతో ఆటలు | 15.00 |

# ప్రజాశక్తి బుక్‌హౌస్

**1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013**

గమనిక : పై పుస్తకాలు స్కూలు గ్రాంటు నుండి కాని, టీచర్ గ్రాంటు నుండి కానీ మీ స్కూలుకు కొనుగోలు చేసుకోవచ్చును. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ పేరిట డి.డి./ఎం.ఓ. తీసి పంపవలెను.



**If Un delivered please return to :** Prasthanam, C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059